వుదయం

కొల్లూరు అభివృద్ధిలో మరో ముందడుగు

ఐదు ఎకరాల్లో మోడల్ మార్కెట్ ఏర్పాటు..

వుదయం, తెల్లాపూర్ ప్రతినిధి
(సెప్టెంబర్ 30)

సంగారెడ్డి జిల్లా పటాన్‌చెరు నియోజకవర్గం పరిధిలోని తెల్లాపూర్ డివిజన్ కొల్లూరులో ఆధునిక వసతులతో మోడల్ మార్కెట్‌ను ఏర్పాటు చేయనున్నట్లు పటాన్‌చెరు శాసనసభ్యులు గూడెం మహిపాల్ రెడ్డి (జీఎంఆర్) తెలిపారు. కొల్లూరు పరిధిలోని సర్వే నంబర్ 203లోసుమారు ఐదు ఎకరాల విస్తీర్ణంలో ఈ మార్కెట్‌ను ఏర్పాటు చేసేందుకు చర్యలు చేపడుతున్నట్లు పేర్కొన్నారు.కొల్లూరు, తెల్లాపూర్ డివిజన్‌తో పాటు పరిసర ప్రాంతాల్లో పెరుగుతున్న జనాభా, భవిష్యత్తులో పెరగనున్న వ్యాపార అవసరాలను దృష్టిలో ఉంచుకుని మార్కెట్‌ను అన్ని రకాల సౌకర్యాలతో అభివృద్ధి చేయాలని ఎమ్మెల్యే తెలిపారు.ప్రజలకు ఒకే ప్రాంతంలో అవసరమైన నిత్యావసర సరుకులు,కూరగాయలు, పండ్లు తదితర వస్తువులు అందుబాటులో ఉండేలా మార్కెట్‌ను ప్రణాళికాబద్ధంగా నిర్మించనున్నట్లు చెప్పారు. మార్కెట్ ఏర్పాటుకు అవసరమైన భూ సర్వే ప్రక్రియను వేగవంతం చేయాలని సంబంధిత అధికారులను ఎమ్మెల్యే ఆదేశించారు. త్వరితగతిన సర్వే పూర్తి చేసి, మార్కెట్ నిర్మాణానికి అవసరమైన భూమిని కేటాయించేలా చర్యలు తీసుకోవాలని తహసీల్దార్ సరస్వతికి ఎమ్మెల్యే జీఎంఆర్ సూచించారు. కొల్లూరు ప్రాంత అభివృద్ధిలో మోడల్ మార్కెట్ కీలకంగా నిలిచేలా అవసరమైన మౌలిక వసతులు, ప్రజలకు అనుకూలమైన సౌకర్యాలతో నిర్మాణం చేపట్టేలా చర్యలు తీసుకుంటామని ఎమ్మెల్యే తెలిపారు. మార్కెట్ ఏర్పాటుతో స్థానిక ప్రజలకు మరింత మెరుగైన వ్యాపార, కొనుగోలు సదుపాయాలు అందుబాటులోకి వచ్చే అవకాశం ఉందన్నారు.ఈ కార్యక్రమంలో సీనియర్ నాయకులు సోమిరెడ్డి, రాములు గౌడ్, మాజీ ప్రజా ప్రతినిధులు, స్థానిక నాయకులు, సంబంధిత అధికారులు, కేసీఆర్ నగర్ బీఆర్ఎస్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

గ్రామసభలో సర్పంచ్ మహేశ్వరి ఆవేదన

- అవినీతి ఆరోపణలతో మనస్తాపం..
- గ్రామస్తులు తీర్మానిస్తేనే అభివృద్ధి పనులు చేపడతా
- రూ.1.20 కోట్ల నిధులపై వాట్సాప్‌లో ట్రోలింగ్..
- కావాలనే కొందరు విమర్శిస్తున్నారని ఆరోపణ
- 9 నెలల గ్రామపంచాయతీకి వచ్చినవి 54 లక్షలు
- పాత బిల్లులు 36 లక్షలు చెల్లింపు

మిరుదొడ్డి , సెప్టెంబర్ 30, వుదయం:

గ్రామ అభివృద్ధి కోసం కృషి చేస్తున్న తనపై అవినీతి ఆరోపణలు చేస్తూ, వాట్సాప్ గ్రూపుల్లో ట్రోలింగ్ చేయడం తీవ్ర మనస్తాపానికి గురిచేస్తోందని మిరుదొడ్డి సర్పంచ్ మహేశ్వరి ఆవేదన వ్యక్తం చేశారు.సిద్దిపేట జిల్లా మిరుదొడ్డి మండల కేంద్రంలో బుధవారం నిర్వహించిన గ్రామసభలో నిధుల వినియోగం, అభివృద్ధి పనులపై చర్చ సందర్భంగా వాతావరణం ఒక్కసారిగా వేడెక్కింది. గ్రామ పంచాయతీ నిధులు పక్కదారి పట్టాయంటూ, రూ.1.20 కోట్లు డ్రా చేశారంటూ తనపై ఆరోపణలు చేయడం బాధ కలిగిస్తోందని ఆమె పేర్కొన్నారు. ఈ సందర్భంగా సర్పంచ్ మహేశ్వరి మాట్లాడుతూ.. 9 నెలల పాలనలో 54 లక్షల రూపాయలు గ్రామపంచాయతీకి ప్రభుత్వం నిధులు విడుదల చేయగా, 36 లక్షలు పాత బిల్లులు చెల్లించడం జరిగిందన్నారు.మరో 17 లక్షల రూపాయలతో గ్రామంలో అభివృద్ధి పనులు చేశామని వెల్లడించారు. గ్రామంలో ఏ అభివృద్ధి పని చేపట్టడానికైనా తాను సిద్ధంగా ఉన్నానని, అయితే గ్రామస్తుల అభిప్రాయాలు, తీర్మానాల మేరకే పనులు చేపడతానని స్పష్టం చేశారు. గ్రామంలో ఏ సమస్య తలెత్తినా తన దృష్టికి తీసుకువస్తే పరిష్కారానికి కృషి చేస్తున్నానని, అయినప్పటికీ కొందరు ఉద్దేశపూర్వకంగా విమర్శలు చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. రాబోయే పండుగలను దృష్టిలో ఉంచుకుని గ్రామంలో చేపట్టాల్సిన పనులపై గ్రామస్తులే నిర్ణయం తీసుకోవాలని, వారి తీర్మానం మేరకే అభివృద్ధి పనులు చేపడతానని తెలిపారు. గ్రామంలో మోటార్లు కాలిపోయినా వాటి మరమ్మతులకు సంబంధించిన బిల్లులు పెట్టుకునే అవకాశం లేక ఇబ్బందులు ఎదురవుతున్నాయని ఆమె పేర్కొన్నారు. మిషన్ భగీరథ నీటిపైనే ఆధారపడి

గ్రామస్తుల అవసరాలన్నీ ఎలా తీర్చగలమని ప్రశ్నించారు. నిధుల వినియోగంపై అవినీతి ఆరోపణలు చేస్తూ తనను విమర్శిస్తే గ్రామంలో అభివృద్ధి పనులు ఎలా ముందుకు తీసుకెళ్లగలమని ప్రశ్నించారు. చిన్న వయసులోనే మహిళా సర్పంచ్‌గా ఎన్నికై గ్రామ అభివృద్ధికి అంకితభావంతో పనిచేస్తున్నానని, సమయానికి నిధులు రాకపోవడంతో తన వ్యవసాయ భూమిని సైతం విక్రయించి గ్రామ అభివృద్ధికి ఖర్చు చేస్తున్నానని మహేశ్వరి తెలిపారు. అయినప్పటికీ తనపై విమర్శలు చేయడం ఎంతవరకు సమంజసమని ప్రశ్నించారు. గ్రామ అభివృద్ధి కోసం చిత్తశుద్ధితో పనిచేస్తున్న తనకు గ్రామస్తుల సహకారం అవసరమని కోరారు.

సమస్యల పరిష్కారానికి కృషి చేస్తా

గ్రామసభలో గ్రామస్తులు తమ సమస్యలను సర్పంచ్ దృష్టికి తీసుకురాగా, వాటి పరిష్కారానికి కృషి చేస్తానని మహేశ్వరి హామీ ఇచ్చారు. గ్రామ అభివృద్ధికి అవసరమైన నిధుల కోసం ఎమ్మెల్యే, ఎంపీలను సంప్రదించి నిధులు తీసుకువచ్చేందుకు ప్రయత్నిస్తానని తెలిపారు. గ్రామంలో మౌలిక సదుపాయాల కల్పనతో పాటు ప్రజల అవసరాలకు ప్రాధాన్యతనిస్తూ అభివృద్ధి పనులు చేపడతామని పేర్కొన్నారు. ఈ గ్రామసభలో పంచాయతీ కార్యదర్శి ఫహీం, ఉపసర్పంచ్ కర్ణాకర్, వార్డు సభ్యులు, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

పంటల నమోదు వేగవంతం చేయాలి

- మార్కెట్‌కు తెచ్చిన మొత్తం పంటను కొనుగోలు చేయాలి
- రైతు సంఘం జిల్లా కమిటీ సభ్యుడు కాసుల మహేందర్‌రెడ్డి డిమాండ్

దౌల్తాబాద్, సెప్టెంబరు 30 (వుదయం):

రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఆన్‌లైన్ పంటల నమోదు ప్రక్రియను వేగవంతం చేసి, ప్రతి రైతు సాగు చేసిన పంటను సమగ్రంగా నమోదు చేయాలని రైతు సంఘం జిల్లా కమిటీ సభ్యుడు కాసుల మహేందర్‌రెడ్డి డిమాండ్ చేశారు. బుధవారం ఆయన మాట్లాడుతూ మొక్కజొన్న, పత్తి తదితర పంటలు చేతికొస్తున్న తరుణంలో క్షేత్రస్థాయిలో పంటల ఫొటో క్యాప్చర్, ఆన్‌లైన్ నమోదు ప్రక్రియ నత్తనడకన సాగడం ఆందోళన కలిగిస్తోందన్నారు. ఇప్పటి వరకు 20 శాతం కూడా పంటల నమోదు పూర్తి కాలేదని పేర్కొన్నారు.గతంలో పంటల కొనుగోలు సమయంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నిబంధనల కారణంగా రైతులు అనేక ఇబ్బందులు ఎదుర్కొన్నారని మహేందర్‌రెడ్డి తెలిపారు. పాస్‌బుక్ ఉండటం, ఆన్‌లైన్‌లో భూమి వివరాలు నమోదై ఉండటం వంటి నిబంధనల వల్ల కొంతమంది రైతులు పండించిన పంటను విక్రయించేందుకు ఇబ్బందులు పడ్డారని చెప్పారు. ప్రస్తుతం అమలు చేస్తున్న ఫొటో క్యాప్చర్, ఆన్‌లైన్ నమోదు ప్రక్రియలో జాప్యం జరిగితే పంటల కొనుగోలు సమయంలో రైతులకు మరిన్ని సమస్యలు ఎదురయ్యే అవకాశం ఉందన్నారు. గ్రామాల్లో భూ సమస్యలు, భూభారతి నమోదుల్లో తప్పులు, ఆన్‌లైన్‌లో భూముల వివరాలు లేకపోవడం, కౌలు రైతులు సాగు చేయడం వంటి సమస్యలు ఉన్నాయని ఆయన వివరించారు. ఇలాంటి అంశాలను పరిగణనలోకి తీసుకుని పంటల నమోదును సమగ్రంగా చేపట్టాలని కోరారు. రైతులు మార్కెట్‌కు తీసుకొచ్చిన మొత్తం పంటను ఎలాంటి ఆంక్షలు లేకుండా కొనుగోలు చేసేలా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.పంటల ఫొటో క్యాప్చర్, ఆన్‌లైన్ నమోదు ప్రక్రియలో జరుగుతున్న జాప్యంపై జిల్లా స్థాయి అధికారులు ప్రత్యేక దృష్టి సారించాలని, క్షేత్రస్థాయిలో పర్యవేక్షణ పెంచి నమోదు ప్రక్రియను యుద్ధప్రాతిపదికన పూర్తి చేయాలని మహేందర్‌రెడ్డి కోరారు. రైతులకు ఇబ్బందులు కలగకుండా పంట కొనుగోళ్లకు ముందే అవసరమైన అన్ని ఏర్పాట్లు పూర్తి చేయాలని ఆయన విజ్ఞప్తి చేశారు.

దీపాయంపల్లి లో కాంగ్రెస్ గ్రామ కమిటీ ఎన్నిక

దౌల్తాబాద్, సెప్టెంబరు 30 (వుదయం):

మండలంలో కాంగ్రెస్ పార్టీని గ్రామస్థాయిలో మరింత బలోపేతం చేయడమే లక్ష్యంగా కమిటీలను ఏర్పాటు చేస్తున్నట్లు మండల అధ్యక్షుడు జనగామ మల్లారెడ్డి అన్నారు. బుధవారం దౌల్తాబాద్ మండలం దీపాయంపల్లి గ్రామంలో ఆయన ఆధ్వర్యంలో కాంగ్రెస్ పార్టీ గ్రామ కమిటీని ఎన్నుకున్నారు.గ్రామ అధ్యక్షుడిగా మస్కూరి స్వామి, ఉపాధ్యక్షుడిగా పిట్ల స్వామి,ప్రధాన కార్యదర్శిగా గొల్ల స్వామి, మహిళా అధ్యక్షురాలిగా గొల్ల సునీతలను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.నూతనంగా ఎన్నికైన కమిటీ సభ్యులు పార్టీ బలోపేతానికి కృషి చేస్తూ, ప్రభుత్వ సంక్షేమ పథకాలను అర్హులైన ప్రజలకు చేరేలా ప్రజలకు అందుబాటులో ఉండాలని నాయకులు సూచించారు.ఈ సందర్భంగా నూతన కమిటీకి నాయకులు, కార్యకర్తలు అభినందనలు తెలిపారు. కార్యక్రమంలో సీనియర్ నాయకులు కారణాల శ్రీనివాసరావు, ఎస్సీ సెల్ మండల అధ్యక్షుడు బుర్రోల్ల స్వామి, మండల ఉపాధ్యక్షుడు డాకోలా ఆంజనేయులు, మండల కార్యదర్శి సుంకు రమేష్ పాటు దీపాయంపల్లి గ్రామ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఆడపిల్లల భవిష్యత్తుకు సుకన్య సమృద్ధి యోజన ఖాతాలు

- ఎన్నికల హామీని నిలబెట్టుకున్న పదకొండవ వార్డు మెంబర్ బేక్కంటి సునంద శ్రీనివాస్

మిరుదొడ్డి, సెప్టెంబర్ 30, వుదయం:

ఆడపిల్లల భవిష్యత్తుకు ఆర్థిక భద్రత కల్పించాలనే ఉద్దేశంతో తాను ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీని నిలబెట్టుకున్నట్లు పదకొండవ వార్డు మెంబర్ బేక్కంటి సునంద శ్రీనివాస్ తెలిపారు. ఎన్నికల సమయంలో తమ వార్డులో ఆడపిల్ల జన్మిస్తే సుకన్య సమృద్ధి యోజన పథకం కింద ఖాతా తెరిపించి ఇస్తానని హామీ ఇచ్చినట్లు ఆమె పేర్కొన్నారు. ఇచ్చిన మాటకు కట్టుబడి బుధవారం వార్డుకు చెందిన ముగ్గురు ఆడపిల్లల పేరుతో సుకన్య సమృద్ధి యోజన ఖాతాలను తెరిపించి అందజేశారు. సబ్ పోస్టుమాస్టర్ హరీష్ చేతుల మీదుగా బేక్కంటి శ్రీహన్వి, తరిగొప్పుల శ్రీనిత్య, ఎలుముల యశ్వి పేర్లతో ఖాతాలను ప్రారంభించారు. ఈ సందర్భంగా బేక్కంటి సునంద శ్రీనివాస్ లు మాట్లాడుతూ, ఆడపిల్లల పట్ల సమాజంలో సానుకూల దృక్పథాన్ని పెంపొందించడంతో పాటు వారి భవిష్యత్తుకు ఆర్థిక భరోసా కల్పించాల్సిన అవసరం ఉందన్నారు. ఆడపిల్ల పుట్టినప్పటి నుంచే వారి విద్య, భవిష్యత్తు అవసరాల కోసం తల్లిదండ్రులు పొదుపు చేయడం అలవాటు చేసుకోవాలని సూచించారు. సుకన్య సమృద్ధి యోజన వంటి ప్రభుత్వ పొదుపు పథకాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఎన్నికల సమయంలో ప్రజలకు ఇచ్చిన హామీలను కేవలం మాటలకే పరిమితం చేయకుండా, సాధ్యమైన మేరకు అమలు చేసేందుకు కృషి చేస్తానని ఆమె తెలిపారు. తన వార్డులో ఆడపిల్ల పుట్టిన ప్రతి కుటుంబానికి అండగా నిలుస్తానని పేర్కొన్నారు. ఆడపిల్లలను భారంగా కాకుండా కుటుంబానికి, సమాజానికి భవిష్యత్తు ఆస్తిగా భావించాలని ఆమె అన్నారు. ఈ కార్యక్రమంలో బేక్కంటి మురళి, కమ్మరి స్వామి, జ్ఞానేశ్వర్, ప్రశాంత్ తదితరులు పాల్గొన్నారు.

గుర్జివాడ లో వీఓ భవనానికి భూమిపూజ

- మహిళా సంఘాల కార్యకలాపాలకు మరింత సౌకర్యం

కోహీర్, సెప్టెంబరు 30 (వుదయం ప్రతినిధి):

కోహీర్ మండలం గురుజువాడ గ్రామంలో వీఓ భవన నిర్మాణానికి బుధవారం భూమిపూజ నిర్వహించారు.గ్రామ సర్పంచ్ ప్రియాంక రాజేందర్ ఆధ్వర్యంలో కార్యక్రమం జరిగింది. మహిళా సంఘాల కార్యకలాపాలకు సౌకర్యం కల్పించేందుకు భవనాన్ని నిర్మించనున్నారు.నిర్మాణానికి ఎంపిక చేసిన స్థలాన్ని సంబంధిత సిబ్బంది పరిశీలించారు.స్థలానికి సంబంధించిన హద్దులు, కొలతలను గుర్తించారు.
మహిళా సంఘాల సమావేశాలు నిర్వహించేందుకు భవనం ఉపయోగపడనుంది.వివిధ శిక్షణ, అవగాహన కార్యక్రమాలకు కూడా సౌకర్యంగా ఉండనుంది.భూమిపూజ పూర్తయిన నేపథ్యంలో త్వరలో నిర్మాణ పనులు ప్రారంభించనున్నారు.భవన నిర్మాణ పనులను నాణ్యతా ప్రమాణాలతో చేపట్టాలని సూచించారు.నిర్దేశిత ప్రమాణాలకు అనుగుణంగా పనులు పూర్తి చేయాలని తెలిపారు.భవనం పూర్తయిన తర్వాత మహిళా సంఘాలకు అందుబాటులోకి తీసుకురానున్నారు. దీంతో సంఘాల సమావేశాలు, కార్యక్రమాల నిర్వహణ సులభతరం కానుంది. గ్రామంలో మహిళా సంఘాలకు ప్రత్యేక భవనం అందుబాటులోకి రానుంది.
ఈ భవనం మహిళా సంఘాల కార్యకలాపాలకు ఎంతో ఉపయోగకరంగా ఉంటుందని తెలిపారు.
నిర్మాణ పనులకు అవసరమైన ఏర్పాట్లు చేపట్టాలని సూచించారు.
పనులను త్వరితగతిన పూర్తి చేయాలని స్థానికులు కోరారు.

పీఏసీఎస్ రూ.2.01 కోట్ల స్థూల లాభం, 6,826 మంది సభ్యులు

నాగర్ కర్నూల్ రూరల్, సెప్టెంబరు 30 (వుదయం ప్రతినిధి):

నాగర్‌కర్నూల్ ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం (పీఏసీఎస్) అభివృద్ధి దిశగా ముందుకు సాగుతోంది. సంఘం 202627 అర్థవార్షిక సర్వసభ్య సమావేశం బుధవారం జరిగింది. ఈ సందర్భంగా ప్రవేశపెట్టిన నివేదికలో సభ్యత్వం, రుణ లావాదేవీలు, ఆర్థిక పరిస్థితి, వ్యాపార కార్యకలాపాలు, అభివృద్ధి పనుల వివరాలను వెల్లడించారు. 1959 మే 18న రిజిస్ట్రేషన్ నంబర్ 4020తో 25 మంది సభ్యులు, రూ.2,990 వాటా ధనంతో ప్రారంభమైన సంఘంలో ప్రస్తుతం 6,826 మంది సభ్యులు ఉన్నారు. వీరిలో 5,948 మంది సన్నకారు రైతులు, 878 మంది పెద్దకారు రైతులు ఉన్నారు. సామాజిక వర్గాల వారీగా బీసీలు 4,136, ఎస్సీలు 615, ఎస్టీలు 39, ఇతరులు 2,036 మంది ఉన్నారు. రూ.41.40 కోట్ల రుణ బకాయిలు: సంఘం నుంచి వివిధ రకాల రుణాలు పొందిన 2,148 మంది సభ్యుల నుంచి మొత్తం రూ.41.40 కోట్లకు పైగా బకాయిలు రావాల్సి ఉందని నివేదికలో పేర్కొన్నారు. స్వల్పకాలిక, దీర్ఘకాలిక, బంగారు తాకట్టు, స్వయం ఉపాధి రుణాలు ఇందులో ఉన్నాయి. సంఘం బ్యాంకుకు వివిధ రుణాల కింద రూ.34.34 కోట్లకు పైగా చెల్లించాల్సి ఉందని తెలిపారు.రూ.2.01 కోట్ల స్థూల లాభం: 202526 ఆర్థిక సంవత్సరానికి సంఘం ఆడిట్ పూర్తయిందని, ఆ ఏడాది రూ.2,01,06,481.27 స్థూల లాభం వచ్చినట్లు నివేదికలో వెల్లడించారు. సభ్యుల ఫిక్స్‌డ్ డిపాజిట్లు రూ.99.78 లక్షలు, సేవింగ్స్ డిపాజిట్లు రూ.46.04 లక్షలు ఉన్నాయని తెలిపారు.గోదాముల నిర్మాణం పూర్తి: సంఘం అభివృద్ధిలో భాగంగా నాగనూలులో 2,000 మెట్రిక్ టన్నుల

సామర్థ్యంతో రెండు గోదాములు, 100 టన్నుల సామర్థ్యంతో వే బ్రిడ్జి నిర్మాణం పూర్తి చేశారు. తూడుకుర్తిలో 1,500 మెట్రిక్ టన్నుల సామర్థ్యంతో గోదాము, కార్యాలయ భవనాన్ని నిర్మించారు. నాగనూలులో ఎఫ్‌పీవో గ్రాంట్‌తో ఎలివేటెడ్ షీప్ ఫారం నిర్మాణం పూర్తయింది. వనపట్లలో పెట్రోల్ బంక్ నిర్మాణ పనులు కొనసాగుతున్నాయి.
సంఘం ఆధ్వర్యంలో ఎరువులు, విత్తనాలు, క్రిమిసంహారక మందుల విక్రయంతో పాటు ధాన్యం కొనుగోలు వ్యాపారం కొనసాగుతోంది. సభ్యుల సౌకర్యార్థం లాకర్ వసతిని కూడా కల్పించారు.ఈ సమావేశంలో పీఏసీఎస్ పీఐసీ ముఖ్య కార్యనిర్వహణాధికారి పాన్నమి నరేష్, అధ్యక్షుడు గజ్జెల నిరంజన్ గౌడ్, పాలక వర్గ సభ్యులు టి.పాండు, ఆవంచ రాజు, వడ్ల వీమలమ్మ, కుమ్మరి అనంతయ్య, వీ.నాగిరెడ్డి, డి.రాజవర్ధన్ రెడ్డి, కే.గోపాల్ రెడ్డి, కుమ్మరి తిరుపతయ్య, ఏ.రాములు, రొయ్య బాలమషయ్య, కే.చిన్నమ్మ, సంఘ పరిధిలోని గ్రామాల సభ్యులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ పాఠశాలకు ఆర్వో వాటర్ ప్లాంట్ ఏర్పాటు

- కృతజ్ఞతలు తెలిపిన విద్యార్థిని విద్యార్థులు తల్లిదండ్రులు....

వుదయం న్యూస్ శివ్వంపేట
సెప్టెంబర్ 30...

మెదక్ జిల్లా శివ్వంపేట మండల పరిధిలోని ఫాం బండ ప్రభుత్వ పాఠశాల విద్యార్థుల సౌకర్యం పార్ట్ టు హెల్ప్ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో క్లైయిన్ ఇంజనీరింగ్ ప్రైవేట్ లిమిటెడ్ హైదరాబాద్ మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ కే సాయినాథ్ గారి సహకారంతో సిఎస్ఆర్ ఫౌండేషన్ ద్వారా జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల పాంబండా పాఠశాలకు కు 500 లీ. ఆర్.ఓ వాటర్ ప్యూరిఫికేషన్ ప్లాంటును ఏర్పాటు చేయడం జరిగింది. అంచనా లక్ష 90 వేల రూపాయలతో ఏర్పాటు చేయగా 140 మంది విద్యార్థిని విద్యార్థులకు వన్ లీటర్ స్టీల్ వాటర్ బాటిల్స్ ని అందజేశారు.వీటి అంచనా 20000 రూపాయలు ఉంటుందని తెలిపారు. ఈ కార్యక్రమాన్ని కంపెనీ ప్రతినిధులు చైతన్యహాజరై ప్రారంభోత్సవం చేయడం జరిగింది. అనంతరం పిల్లల తల్లిదండ్రులు మాట్లాడుతూ మారుమూల గ్రామాల్లో చదువుకునే మా పిల్లల్ని గుర్తుంచుకొని మా పిల్లల ఆరోగ్యాన్ని కాపాడేందుకు మంచినీరు అందియాలనే సంకల్పంతో ఆర్ట్ టూ హెల్ప్ చారిటబుల్ ట్రస్ట్ . క్లైయిన్ ఇంజనీరింగ్ ప్రైవేట్ లిమిటెడ్ హైదరాబాద్ వారికి మా యొక్క హృదయపూర్వక కృతజ్ఞతలు అని తెలిపారు. ఈ కార్యక్రమంలో ట్రస్టు అధ్యక్షులు రవి నాయక్. మండల విద్యాశాఖ అధికారి బుచ్చా నాయక్. ప్రధానోపాధ్యాయులు మనోహర్. ఉపాధ్యాయ బృందం గ్రామ సర్పంచ్ . గౌరవ సభ్యులు.పిఏసిఎస్ బైక్ చైర్మన్ వేణుగోపాల్ రెడ్డి. శేఖర్ గౌడ్. మరియు విద్యార్థి తల్లిదండ్రులు గ్రామ తదితరులు పాల్గొని కృతజ్ఞతలు తెలిపారు.

ఎండిపోయిన పంటలకు ఎకరానికి 70 వేల నష్టపరిహారం ఇవ్వాలి

సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు ఎల్.దేశ్యానాయక్

అచ్చంపేట, సెప్టెంబరు 30 (వుదయం ప్రతినిధి):

అచ్చంపేట మండలంలోని చెంచుపల్లు తండా రైతుల పంట పొలాలను సీపీఎం అచ్చంపేట నియోజకవర్గ బృందం బుధవారం పరిశీలించింది. గిరిజన రైతులతో మాట్లాడి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు.ఈ సందర్భంగా సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు ఎల్.దేశ్యానాయక్ మాట్లాడుతూ.. రైతులు ఎకరాల్లో పత్తి పంట సాగు చేశారని, విత్తనాలు, ఎరువులు, పురుగుమందులు, కూలీల ఖర్చుతో ఎకరాకు రూ.70 వేల వరకు పెట్టుబడి పెట్టారని తెలిపారు.వర్షాలు సకాలంలో పడకపోవడం, నీళ్లు లేకపోవడం, ఎర్ర తెగులు సోకడంతో పంట ఎర్రగా మారి గిడసబారిందని, కాయలు తక్కువగా కాయడంతో దిగుబడి పూర్తిగా తగ్గిపోయిందని రైతులు ఆవేదన వ్యక్తం చేశారన్నారు.వర్షాభావంతో పాటు కరెంట్ సరఫరా కూడా కేవలం 10 గంటలు మాత్రమే ఇవ్వడంతో బోర్లు ఉన్నా ప్రయోజనం లేకుండా పోయిందని రైతులు వాపోయారన్నారు. కరెంట్ సరఫరాను పూర్తిస్థాయిలో ఇవ్వాలని, వ్యవసాయ రుణాలను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. తక్షణమే ఎండిపోయిన పంటలను సర్వే చేసి నష్టపోయిన రైతులకు ఎకరానికి రూ.70 వేల చొప్పున నష్టపరిహారం చెల్లించాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.కార్యక్రమంలో సీపీఎం మండల కార్యదర్శి సైదులు, అమ్రాబాద్ మండల కార్యదర్శి మల్లేష్, సీపీఎం నాయకురాలు దేవులి, రైతులు వాల్యా, లచ్చ, గోపాల్ రాజు, చాంప్లీ, గోపాల్ నాయక్, శ్రీను, ఆంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

మున్సిపల్ కార్మికులకు ఆరోగ్య పరీక్షలు

కల్వకుర్తి, సెప్టెంబరు 30 (వుదయం ప్రతినిధి):

మున్సిపల్ కార్యాలయంలో సఫాయి కార్మికులకు 'సఫాయి మిత్ర సురక్ష ఏవం సమ్మాన్ శిబిర్' మెడికల్ క్యాంపును బుధవారం నిర్వహించారు.నిత్యం ధూళి, చెత్తాచెదారం మధ్య శ్రమిస్తూ ప్రజారోగ్యాన్ని కాపాడే పారిశుధ్య కార్మికుల సేవలను చైర్మన్ బంగి రత్నమాల అభినందించారు. కార్మికుల సంక్షేమం కోసం ఇలాంటి కార్యక్రమాలు మున్సిపాలిటీ పరిధిలో నిరంతరం నిర్వహించాలని, పారిశుధ్య కార్మికులకు ఎల్లప్పుడూ అండగా ఉంటామని ఆమె హామీ ఇచ్చారు.మెడికల్ క్యాంపులో భాగంగా బీపీ, షుగర్ వంటి ప్రాథమిక ఆరోగ్య పరీక్షలు నిర్వహించారు. పరీక్షల అనంతరం అనారోగ్య సమస్యలు ఉన్న వారికి తగిన వైద్య సలహాలు ఇవ్వడంతో పాటు ఉచితంగా మందులను పంపిణీ చేశారు. కార్మికులు తమ విధులను నిర్వర్తించేటప్పుడు తీసుకోవాల్సిన ఆరోగ్య జాగ్రత్తలపై వైద్యులు ప్రత్యేక సూచనలు అందించారు.ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా డాక్టర్ భీమ హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కార్మికులు శారీరక శ్రమతో పాటు తమ ఆరోగ్యం పట్ల అప్రమత్తంగా ఉండాలని సూచించారు. రోజువారీ ఆహారపు అలవాట్లు, వ్యక్తిగత పరిశుభ్రత, వృత్తిపరమైన హానికర పరిస్థితుల నుంచి రక్షణ పొందే మార్గాలపై కార్మికులకు అవగాహన కల్పించారు. ప్రభుత్వాలు అందించే సంక్షేమ పథకాలను, వైద్య సదుపాయాలను ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ మహమ్మద్ షేక్, సీహెచ్‌వో శ్రీనివాస్, ఎంఎల్‌హెచ్‌పీఎస్ వర్షిత్ రెడ్డి, ఏఎన్ఎం భాగ్యలక్ష్మి, నాగలక్ష్మి, ఆశా కార్యకర్తలు, శానిటేషన్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

కొత్తూరు బిలో పోషణ మాసం కార్యక్రమం

జహీరాబాద్ సెప్టెంబర్ 30 (వుదయం)

కొత్తూరు బి :రైతు వేదికలో పోషణ మాసం కార్యక్రమంతో పాటు ఎంఎల్‌హెచ్‌పీ శిక్షణ కార్యక్రమాన్ని బుధవారం ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో డీటీఏ రాము, ఎంఎల్‌హెచ్‌పీ శశిరేఖ,సూపర్‌వైజర్లు అనిత కుమారి, నీరజ్, గ్రేస్ హెల్త్ సిబ్బంది పాల్గొని శిక్షణ అందించారు.
ఈ సందర్భంగా సీడీపీఓ సుశీల మాట్లాడుతూ చిన్నారులు, గర్భిణీలు, బాలింతలు ఆరోగ్యంగా ఉండేందుకు పోషకాహారం ఎంతో కీలకమని తెలిపారు.రోజువారీ ఆహారంలో పోషక విలువలు కలిగిన పదార్థాలను తప్పని సరిగా చేర్చుకోవాలని సూచించారు. పిల్లల ఆరోగ్యకరమైన ఎదుగుదల, పోషణ ప్రాధాన్యతపై తల్లిదండ్రులకు అవగాహన కల్పించారు.
అనంతరం సర్పంచ్ శ్రీమతి మహాదేవి మల్లికార్జున్,సీడీపీఓ సుశీల సమక్షంలో చిన్నారులకు అక్షరాభ్యాసం, అన్నప్రాసన కార్యక్రమాలను సంప్రదాయబద్ధంగా నిర్వహించారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ సిబ్బంది, ఆరోగ్య సిబ్బంది, తల్లులు, చిన్నారులు తదితరులు పాల్గొన్నారు.పిల్లల ఆరోగ్యం,పోషణ,విద్యపై తల్లిదండ్రులు ప్రత్యేక శ్రద్ధ చూపాలని ఈ సందర్భంగా సూచించారు.

కారుణ్య నియామకానికి మోక్షం

- నలుగురికి ఆఫీస్ సబార్డినేట్ ఉద్యోగాలు.. నియామక పత్రాలు అందజేసిన కలెక్టర్

గద్వాల సెప్టెంబర్ 30 (వుదయం కరస్పాండెంట్)

కారుణ్య నియామకం కోసం ఎదురుచూస్తున్న నలుగురు అభ్యర్థులకు ఉద్యోగాలు లభించాయి. ఇంటర్మీడియట్, విద్యా శాఖల్లో ఆఫీస్ సబార్డినేట్ పోస్టుల్లో నియమిస్తూ జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్ బుధవారం నియామక ఉత్తర్వులను అందజేశారు.ఐడీఓసీ కార్యాలయంలోని కలెక్టర్ ఛాంబర్‌లో జరిగిన కార్యక్రమంలో నలుగురు అభ్యర్థులకు నియామక పత్రాలను కలెక్టర్ అందించారు. వీరిలో ముగ్గురిని ఇంటర్మీడియట్ శాఖలో, మరో అభ్యర్థిని విద్యాశాఖలో ఆఫీస్ సబార్డినేట్‌గా నియమించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రభుత్వం కల్పించిన కారుణ్య నియామక అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని ఉద్యోగ బాధ్యతలను అంకితభావంతో నిర్వర్

కళ్యాణ లక్ష్మి –షాదీ ముబారక్ చెక్కులు పంపిణీ చేసిన ఎమ్మెల్యే

పూడూరు అక్టోబర్ 1.(వూదయం)

వికారాబాద్ జిల్లా పూడూర్ మండల కేంద్రంలో బుధవారం నిర్వహించిన కళ్యాణ లక్ష్మి&షాదీ ముబారక్ చెక్కుల పంపిణీ కార్యక్రమానికి పరిగి ఎమ్మెల్యే ,టీపీసీసీ ట్రైనింగ్ కమిటీ చైర్మన్ (సర్) డాక్టర్ టి.రామ్మోహన్ రెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా మండలంలోని పలు గ్రామాలకు చెందిన అర్హులైన 26 మంది లబ్ధిదారులకు ఒక్కొక్కరికి రూ.1,00,116 చొప్పున మొత్తం రూ.26,03,016 విలువైన కళ్యాణ లక్ష్మి, షాదీ ముబారక్ చెక్కులను ఎమ్మెల్యే పంపిణి చేశారు. ఈ కార్యక్రమం లో ప్రజాప్రతినిధులు,పి ఎ సి ఎస్ చెర్మన్ పెట్లోళ్ల రఘునాథ్ రెడ్డి, ఆత్మకమిటీ చెర్మన్ శ్రీనివాస్ రెడ్డి, మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు సురేందర్, వివిధ గ్రామాల లబ్ధిదారులు, అధికారులు,తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్ర స్థాయి ఎస్ జి ఎఫ్

హ్యాండ్ బాల్ క్రీడలకు ఎంపికైన ఖేడ్ మైనారిటీ గురుకుల బాలుర విద్యార్థులు

నారాయణఖేడ్ సెప్టెంబర్ 30(వుదయం)

రాష్ట్రస్థాయి ఎస్ జి ఎఫ్ బ్యాండ్ బాల్ క్రీడలకు ఎంపికైన కీడు మైనార్టీ విద్యార్థులు.సిద్దిపేట జిల్లా చేర్యాలలో జరిగిన ఉమ్మడి మెదక్ జిల్లా స్థాయి ఎస్ జి ఎఫ్ హ్యాండ్ బాల్ క్రీడల్లో నారాయణఖేడ్ పట్టణం లోని మైనారిటీ గురుకుల బాలుర ఉన్నత పాఠశాల విద్యార్థులు సత్తా చాటారు.అండర్17 విభాగంలో ఇద్దరు గణేష్, వంశి , అండర్ 14 విభాగంలో ఇద్దరు విద్యార్థులు అర్షద్, కుమార్ ఉమ్మడి జిల్లా స్థాయిలో మంచి ప్రతిభ కనబరిచారని వీరు రాష్ట్ర స్థాయి హ్యాండ్ బాల్ పోటీలకు ఎంపిక అయి నట్టు సిద్దిపేట జిల్లా ఎస్ జి ఎఫ్ ప్రధాన కార్యదర్శి భాస్కర్ రెడ్డి, నాగరాజు, శ్రీనివాస్ మరియు మండల విద్యాధికారి తెలిపారు. వీరు త్వరలో జరగబోయే రాష్ట్ర స్థాయి ఎస్ జి ఎఫ్ హ్యాండ్ బాల్ పోటీల్లో పాల్గొంటారని తెలిపారు. జిల్లా స్థాయిలో విజేతగా నిలిచి రాష్ట్ర స్థాయికి ఎంపిక అయిన విద్యార్థులకు ఖేడ్ మైనారిటీ గురుకుల పాఠశాల ప్రధానోపాధ్యాయులు జి.రాములు వ్యాయామ ఉపాధ్యాయులు అజీజ్, సంతోష్ మరియు పాఠశాల సిబ్బంది విద్యార్థులను అభినందించారు. ఈ కార్యక్రమంలో ఉమ్మడి మెదక్ జిల్లా నుంచి పి.డి మరియు పి.ఇ.టి లు ఇతర ఉపాధ్యాయులు, విద్యార్థులు, హ్యాండ్ బాల్ క్రీడా అభిమానులు పాల్గొన్నారు.

కబడ్డీ కూతకు గద్వాల జట్లు రెడీ!

రాష్ట్రస్థాయి బరిలో సత్తా చాటేందుకు బాలుర, బాలికల జట్ల సన్నద్ధత క్రీడాకారులకు క్రీడా దుస్తులు అందజేసిన జిల్లా కబడ్డీ అసోసియేషన్ అధ్యక్షురాలు డీకే స్నిగ్ధ రెడ్డి

గద్వాల సెప్టెంబర్ 30 (వుదయం బ్యూరో)

కబడ్డీ కూతకు గద్వాల క్రీడాకారులు సిద్ధమయ్యారు. రాష్ట్రస్థాయి వేదికపై తమ సత్తా చాటేందుకు జోగులాంబ గద్వాల జిల్లా బాలుర, బాలికల కబడ్డీ జట్లు సమరానికి సన్నద్ధమయ్యాయి. రాజన్న సిరిసిల్ల జిల్లా వేములవాడలో అక్టోబర్ 2 నుంచి జరగనున్న రాష్ట్రస్థాయి కబడ్డీ టోర్నమెంట్‌లో జిల్లా జట్లు పాల్గొనున్నాయి. పోటీలకు సిద్ధమవుతున్న క్రీడాకారులకు జిల్లా కబడ్డీ అసోసియేషన్ అధ్యక్షురాలు డీకే స్నిగ్ధ రెడ్డి ప్రోత్సాహం అందించారు.గద్వాల పట్టణంలోని డీకే బంగ్లాలో నిర్వహించిన కార్యక్రమంలో బాలుర, బాలికల జట్లకు అవసరమైన కబడ్డీ క్రీడా దుస్తులను ఆమె అందజేశారు.బరిలో బలం.. గెలుపే లక్ష్యం! క్రీడాకారు లతో మాట్లాడిన డీకే స్నిగ్ధ రెడ్డి.. రాష్ట్ర స్థాయి పోటీలను ప్రతిష్ఠాత్మకంగా తీసుకుని క్రమశిక్షణతో సాధన చేయాలని సూచిం చారు. మైదానంలో సమష్టి కృషి, పట్టుదల, ఆత్మవిశ్వాసంతో ఆడితే మంచి ఫలితాలు సాధించవచ్చని అన్నారు. గెలుపోటములు లతో సంబంధం లేకుండా ప్రతి మ్యాచ్‌లో అత్యుత్తమ ప్రతిభ కనబరచాలని, జిల్లా పేరును రాష్ట్రస్థాయిలో నిలబెట్టాలని ఆకాంక్షించారు. ప్రతిభకు చేయూత.. క్రీడలకు పెద్దపీట జిల్లాలో కబడ్డీ క్రీడకు మరింత ఊతమిచ్చేలా ప్రతిభావంతులైన క్రీడాకారులను గుర్తించి ప్రోత్సహించాల్సిన అవసరం ఉందని ఆమె పేర్కొన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో దాగి ఉన్న క్రీడా ప్రతిభను వెలికితీసి రాష్ట్ర, జాతీయ స్థాయికి తీసుకెళ్లేందుకు అసోసియేషన్ ఆధ్వర్యంలో కార్యక్రమాలను కొనసాగిస్తున్నామని తెలిపారు. క్రీడాకారులకు అవసరమైన సహకారం, సౌకర్యాల కల్పనలో తన వంతు కృషి కొనసాగుతుందని చెప్పారు.రాష్ట్రస్థాయి పోటీలకు జిల్లా జట్లు సిద్ధమవు తుండటంతో క్రీడాకారుల్లో ఉత్సాహం నెలకొంది. మైదానంలో పూర్తి సామర్థ్యాన్ని ప్రదర్శించి గద్వాల కబడ్డీకి ప్రత్యేక గుర్తింపు తీసుకురావాలని జట్లు పట్టుదలతో ముందుకు సాగుతున్నాయి. ఈకార్యక్రమంలో పాల్గొన్నవారు రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు బండల వెంకటరాములు, జిల్లా ఓబీసీ మోర్చా అధ్యక్షుడు దేవదాస్, కబడ్డీ అసోసియేషన్ జనరల్ సెక్రటరీ నర్సింహ, ట్రెజరర్ చందు, ఆర్గనైజింగ్ సెక్రటరీ టి. రవి, ఈసీ సభ్యుడు వెంకటన్న (సీఎం), కోచ్ ఉషన్, మేనేజర్ బుజ్జి బాబు, సీనియర్ క్రీడాకారుడు మహేష్ తదితరులు పాల్గొన్నారు.

రెడ్‌క్రాస్ ద్వారా మరిన్ని సేవా కార్యక్రమాలు చేపట్టాలి

మహబూబ్‌నగర్

జిల్లా కలెక్టర్ ఖుష్బూ గుప్తా

నూతనంగా ఎన్నికైన రెడ్‌క్రాస్ సొసైటీ చైర్మన్ ఎస్. రవికుమార్‌తో పాటు మేనేజింగ్ కమిటీ సభ్యులు బుధవారం కలెక్టర్ కార్యాలయంలో జిల్లా కలెక్టర్ ఖుష్బూ గుప్తాను మర్యాదపూర్వకంగా కలిశారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ ఖుష్బూ గుప్తా నూతనంగా ఎన్నికైన చైర్మన్ ఎస్. రవికుమార్, మేనేజింగ్ కమిటీ సభ్యులను అభినందించారు. రెడ్‌క్రాస్ సంస్థ ద్వారా ఇప్పటికే నిర్వహిస్తున్న సేవా కార్యక్రమాలను మరింత విస్తరించి, ప్రజలకు అవసరమైన మరిన్ని సేవలను అందించాలని ఆమె సూచించారు.

షాడో' రాజకీయంపై చైర్‌పర్సన్ సమరభేరి!

చౌకబారు బురదజల్లుడు సహించం.. చేతనైతే పాలనపై పోరాడండి! మహిళా ప్రజాప్రతినిధికి భర్త అండగా ఉంటే తప్పేంటి? సర్వసభ్య సమావేశంలో విపక్షాలపై తీవ్ర ఆగ్రహం

గద్వాల సెప్టెంబర్ 30 (వుదయం బ్యూరో)

రాజకీయ ప్రత్యర్థులు విధానపరమైన నిర్ణయాలు, పాలనాపరమైన లోపాలపై నిలదీస్తే సమాధానం చెప్పడానికి తాము ఎల్లప్పుడూ సిద్ధంగా ఉన్నామని, అంతేకానీ మహిళా ప్రజాప్రతినిధులను లక్ష్యంగా చేసుకుని వ్యక్తిగత దూషణ లకు దిగితే కట్టడి చేస్తామని గద్వాల మున్సిపల్ చైర్‌పర్సన్ తుమ్మల జయ లక్ష్మి తెగేసి చెప్పారు. సోషల్ మీడియా వేదికగా తన భర్తను ఉద్దేశించి 'షాడో' అంటూ సాగుతున్న దుష్ప్రచారాన్ని మున్సిపల్ సర్వసభ్య సమావేశంలో ఆమె తీవ్రంగా ఖండించారు. విపక్షాల చిల్లర రాజకీయాలపై తీవ్ర ఆవేదన, ఆగ్రహం వ్యక్తం చేశారు. పనితీరుపై నిలదీయండి.. వ్యక్తిత్వాన్ని కాదు: ''మా పాలనపై ప్రజాక్షేత్రంలో విమర్శలు చేయండి, నిర్ణయాల్లో లోపాలుంటే ఎత్తిచూపండి. దానికి మేం బదులిస్తాం. కానీ ఒక మహిళగా ప్రజాజీవితంలో ఉన్న నా కుటుంబంపై బురదజల్లడం ఏ రకమైన రాజకీయం?'' అని జయలక్ష్మి ఘాటుగా ప్రశ్నించారు. నీతిమాలిన పక్షపాతం: విమర్శలు చేసేవారి ఇళ్లలోని మహిళా కౌన్సిలర్లకు భర్తలు తోడుగా ఉంటే పవిత్రమని, తన భర్త తనకు ఆసరాగా నిలిస్తే 'షాడో' అని ముద్ర వేయడం వారి కపట నీతికి అద్దం పడుతోందన్నారు. చైర్‌పర్సన్‌గా బాధ్యతలను, అధికారిక నిర్ణయాలను తాను స్వతంత్రంగానే తీసుకుంటున్నానని స్పష్టం చేశారు.

మహిళల జోలికొస్తే ఊరుకోం: ప్రజా జీవి తంలో ఉన్న మహిళలకు కనీస గౌరవం ఇవ్వడం నేర్చుకోవాలని, రాజకీయ విమర్శలు హుందాగా ఉండాలని హితవు పలికారు. సర్వసభ్య సమావేశాలను వ్యక్తిగత కక్షసాధింపులకు కాకుండా పట్టణాభివృద్ధి, మౌలిక వసతుల కల్పనపై చర్చలకే వేదిక చేయాలని పిలుపునిచ్చారు.

ఐక్యత ఫౌండేషన్ ఆధ్వర్యంలో స్వచ్ఛ జల ధార

త్రాగునీటి నిల్వ ట్యాంకుల పరిశుభ్రత కార్యక్రమం ఐక్యత ఫౌండేషన్ చైర్మన్ సుంకిరెడ్డి రాఘవేందర్ రెడ్డి

వెల్దండ నెంబర్ 30 (వు దయం)

మారుమూల గ్రామాల్లోని ప్రజలకు పరిశుభ్రమైన త్రాగునీరు అందించాలనే లక్ష్యంతో ఐక్యత ఫౌండేషన్ చైర్మన్ సుంకిరెడ్డి రాఘవేందర్ రెడ్డి సహకారంతో చేపట్టిన స్వచ్ఛ జలధార కార్యక్రమం రెండవ విడతలో భాగంగా బుధవారం వెల్దండ మండలం కొట్ర గ్రామంలో ఆరు త్రాగునీటి నిల్వ ట్యాంకులను పరిశుభ్రపరిచారు.జర్మన్ సాంకేతికతతో కూడిన ప్రత్యేక యంత్రాల సహాయంతో ట్యాంకుల్లో పేరుకుపోయిన మురికి, వ్యర్థాలను శాస్త్రీయ పద్ధతిలో తొలగించి ట్యాంకులను పరిశుభ్రంగా మార్చారు. ప్రజల ఆరోగ్య పరిరక్షణతో పాటు త్రాగునీటి నాణ్యతను మెరుగుపరచాలనే ఉద్దేశంతో "స్వచ్ఛ జలధార" కార్యక్రమాన్ని కల్వకుర్తి నియోజకవర్గంలోని గ్రామాల్లో దశలవారీగా కొనసాగించనున్నారు.

గ్రామస్తులు మాట్లాడుతూ..

ప్రజల ఆరోగ్యం, సంక్షేమాన్ని దృష్టిలో పెట్టుకుని సుంకిరెడ్డి రాఘవేందర్ రెడ్డి గారు చేపడుతున్న సేవా కార్యక్రమాలు అభినందనీయమని తెలిపారు. ముఖ్యంగా పరిశుభ్రమైన త్రాగునీరు అందించాలనే ఉద్దేశంతో "స్వచ్ఛ జలధార" కార్యక్రమం ద్వారా గ్రామాల్లోని నీటి నిల్వ ట్యాంకులను శాస్త్రీయ పద్ధతిలో పరిశుభ్రపరచడం ఎంతో ఉపయోగకరమైన కార్యక్రమమని పేర్కొన్నారు..కొట్ర గ్రామ సర్పంచ్ శారద చెన్నయ్య డిప్యూటీ సర్పంచ్ ఐక్యత ఫౌండేషన్ గ్రామ ప్రతినిధులు సాంపూరి అల్లాజి ,సాంపూరి వెంకట్య, పోసయ్య, కృష్ణయ, తిరుపతయ్య, బండిగయా, సత్యం వార్డు సభ్యులు, యువకులు, గ్రామ పెద్దలు తదితరులు పాల్గొన్నారు.

శేఖర్ కుటుంబానికి రూ.50 వేల ఆర్థిక సాయం

నర్సింములు బిలాల్‌పూర్ మాజీ సర్పంచ్

కోహీర్, సెప్టెంబరు 30 (వుదయం ప్రతినిధి):

సంగారెడ్డి జిల్లా కోహీర్ మండలం బిలాల్‌పూర్ గ్రామానికి చెందిన గుల్లా శేఖర్ ఇటీవల ఆకస్మికంగా మృతి చెందారు. శేఖర్ మృతి పట్ల బిలాల్‌పూర్ మాజీ సర్పంచ్ మాచికొడుకు నర్సింలు తీవ్ర సంతాపం వ్యక్తం చేశారు.

శేఖర్ భౌతికకాయానికి నివాళులర్పించి, కుటుంబ సభ్యులను పరామర్శించారు.ఈ సందర్భంగా శేఖర్ కుటుంబ సభ్యులకు ధైర్యం చెప్పారు.

శేఖర్ మృతి కుటుంబ సభ్యులతో పాటు గ్రామస్తులకు తీరని లోటని పేర్కొన్నారు.చిన్న వయసులోనే శేఖర్ మృతి చెందడం బాధాకరమన్నారు.

బాధిత కుటుంబ సభ్యుల పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు.

కుటుంబానికి తమ వంతు సహాయ సహకారాలు అందిస్తామని భరోసా ఇచ్చారు.కష్టకాలంలో కుటుంబానికి అండగా నిలవడం ప్రతి ఒక్కరి బాధ్యత అని అన్నారు.ఈ సందర్భంగా బాధిత కుటుంబానికి రూ.50,000 ఆర్థిక సాయాన్ని అందజేశారు. కుటుంబ సభ్యులు ధైర్యంగా ఉండాలని సూచించారు.భవిష్యత్తులోనూ కుటుంబానికి అండగా ఉంటామని హామీ ఇచ్చారు.గ్రామంలో శేఖర్ కుటుంబానికి అండగా నిలవాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు.శేఖర్ మృతి పట్ల గ్రామస్తులు కూడా సంతాపం వ్యక్తం చేశారు.కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు.ఈ సందర్భంగా పలువురు గ్రామ పెద్దలు నర్సింలును అభినందించారు.ఆపదలో ఉన్నకుటుంబానికి ఆర్థిక సహాయం అందించడం అభినందనీయమని అన్నారు.బాధిత కుటుంబానికి గ్రామస్తుల సహకారం ఎల్లప్పుడూ ఉంటుందని తెలిపారు.

పరామర్శ కార్యక్రమంలో గ్రామానికి చెందిన పలువురు ప్రముఖులు గ్రామస్తులు,కుటుంబ సభ్యులు హాజరయ్యారు.

శేఖర్ మృతి పట్ల అందరూ విచారం వ్యక్తం చేశారు.కుటుంబ సభ్యులకు మనోధైర్యం కల్పించారు.బాధిత కుటుంబానికి అవసరమైన సహాయం అందించేందుకు ముందుంటామని సర్పంచ్ తెలిపారు.

వివక్ష చేస్తే ఖబడ్దార్!

అంటరానితనం.. రెండు గ్లాసుల విధానం ఇక చెల్లదు అందరికీ సమాన హక్కులు.. ఆలయ ప్రవేశాన్ని అడ్డుకుంటే చర్యలు రేపల్లెలో పౌరహక్కుల దినోత్సవం.. సామాజిక సమానత్వానికి అధికారుల పిలుపు

గద్వాల సెప్టెంబర్ 30 (వుదయం బ్యూరో)

కులం పేరుతో వివక్ష చూపినా.. అంటరానితనాన్ని పాటించినా..రెండు గ్లాసుల విధానాన్ని అమలు చేసినా ఇక ఉపేక్షించేది లేదని అధికారులు స్పష్టం చేశారు. రాజ్యాం గం కల్పించిన సమాన హక్కులను ప్రతి ఒక్కరూ గౌరవించాల్సిందేనని, సామాజిక వివక్షకు పాల్పడే వారిపై చట్టప్రకారం చర్యలు తప్పవని హెచ్చరించారు. గద్వాల మండలం రేపల్లె గ్రామంలో గ్రామ సర్పంచ్ మద్దిలేటి అధ్యక్షతన పౌరహక్కుల దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఎస్సీ, ఎస్టీ విజిలెన్స్ మానిటరింగ్ కమిటీ సభ్యుడు బి. కురుమన్న, ఎస్సై శ్రీకాంత్, డిప్యూటీ తహసీల్దార్ అజిత్ కుమార్, రెవెన్యూ, సోషల్ వెల్ఫేర్ అధికారులు,ప్రజాప్రతినిధులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

రెండు గ్లాసులు' ఇక వద్దు కార్యక్రమంలో బి. కురుమన్న మాట్లాడుతూ.. గ్రామంలో కులం పేరుతో ఎవరినీ దూరం పెట్టరాదని, రెండు గ్లాసుల విధానాన్ని పూర్తిగా నిర్మూలించాలని అన్నారు. దళితుల పట్ల వివక్ష చూపడం, అంటరానితనం పాటించడం లేదా ప్రోత్సహించడం చట్టవిరుద్ధమని స్పష్టం చేశారు. దేవాలయాల్లోకి ప్రవేశించే హక్కు ప్రతి ఒక్కరికీ సమానంగా ఉంటుందని, ఎవరినీ ఆలయ ప్రవేశానికి అడ్డుకోరాదని తెలిపారు. ఎక్కడైనా వివక్ష ఎదురైతే బాధితులు వెంటనే అధికారుల దృష్టికి తీసుకురావాలని సూచించారు.విద్యతోనే వివక్షకు చరమగీతం ఉన్నత విద్యతో ప్రజల్లో ఆలోచనా విధానం మారుతుందని కురుమన్న అన్నారు. రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ ఆశయాలను ప్రతి ఒక్కరూ ఆచరణలో పెట్టాలని సూచించారు.కుల, మత, వర్ణ, వర్గ భేదాలకు అతీతంగా గ్రామంలో ప్రశాంత వాతావరణాన్ని నెలకొల్పాలని కోరారు. సామాజిక సమానత్వం కోసం ప్రజా సంఘాలు, దళిత సంఘాలు, సామాజిక సేవా సంస్థలు కలిసి పనిచేయాలని పిలుపునిచ్చారు. గ్రామంలో ఇటీవల చోటు చేసుకున్న ఘటన దురదృష్టకరమని పేర్కొంటూ, ఇకపై ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా పోలీసులు, రెవెన్యూ అధికారులు కట్టుదిట్టమైన చర్యలు చేపట్టాలని కోరారు.చట్టాన్ని చేతుల్లోకి తీసుకుంటే సహించం ఎస్సై శ్రీకాంత్ మాట్లాడుతూ గ్రామస్తులంతా చట్టానికి లోబడి జీవించాలని సూచించారు. అన్యాయం జరిగినా, వివక్ష ఎదురైనా పోలీసులను ఆశ్రయించాలని తెలిపారు. శాంతిభద్రతలకు విఘాతం కలిగించినా.. చట్టాన్ని చేతులోకి తీసుకున్నా ఉపేక్షించేది లేదని స్పష్టం చేశారు. బాధితులకు చట్టపరంగా అండగా ఉంటామని తెలిపారు.వివక్షపై చట్టం కొరడా డిప్యూటీ తహసీల్దార్ అజిత్ కుమార్ మాట్లాడుతూ అంటరానితనం, రెండు గ్లాసుల పద్ధతి వంటి కుల వివక్ష చర్యలు నేరమని తెలిపారు. ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకుని దళితులు ఆర్థికంగా, సామాజికంగా, విద్యాపరంగా అభివృద్ధి సాధించాలని కోరారు.ఒకే వరుసలో.. ఒకే భోజనం సామాజిక సమానత్వానికి ప్రతీకగా కార్యక్రమం ముగింపులో అధికారులు,ప్రజాప్రతి నిధులు,గ్రామస్తులు కుల,మత భేదాలకు అతీతంగా ఒకే వరుసలో కూర్చొని సహపంక్తి భోజనం చేశారు.

ఈకార్య క్రమంలో రెవెన్యూ ఇన్స్పెక్టర్ శ్రీనివాసులు, వార్డెన్లు సుజాత, పద్మ, శ్రీనివాసులు, రమేష్, గ్రామపంచాయతీ కార్యదర్శి, జీపీఓ, వార్డు సభ్యులు, అంగన్‌వాడీ, ఆశా కార్యకర్తలు, మాజీ సర్పంచులు, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

మల్లమ్మకుంటకు రైతుల గ్రీన్ సిగ్నల్!

69 ఎకరాల భూసేకరణకు 15 మంది రైతుల సమ్మతి ఎకరాకు రూ.16.50 లక్షల భూమి విలువకు అంగీకారం రైతులకు న్యాయం చేస్తూనే ప్రాజెక్టును పూర్తి చేస్తాం: కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్

గద్వాల సెప్టెంబర్ 30 (వుదయం బ్యూరో)

మల్లమ్మకుంట రిజర్వాయర్ భూసేకరణకు కీలక ముందడుగు పడింది. భూములు కోల్పోతున్న రైతులతో జిల్లా యంత్రాంగం జరిపిన వరుస చర్చలు సానుకూల ఫలితాన్నిచ్చాయి. తనగల గ్రామానికి చెందిన 15 మంది రైతులు 69 ఎకరాల భూమికి ఎకరాకు రూ.16.50 లక్షల చొప్పున భూమి విలువకు అంగీకరిస్తూ కన్సెంట్ అవార్డు పత్రాలపై సంతకాలు చేశారు. దీంతో రిజర్వాయర్ భూసేకరణ ప్రక్రియను వేగవంతం చేసేందుకు మార్గం సుగమమైంది. రైతుల ప్రయోజనమే తొలి ప్రాధాన్యం మల్లమ్మకుంట రిజర్వాయర్ నిర్మాణానికి అవసరమైన భూసేకరణలో రైతులకు ఎలాంటి అన్యాయం జరగకుండా చర్యలు తీసుకుంటామని జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్ తెలిపారు. బుధవారం కలెక్టరేట్ కాన్ఫరెన్స్ హాలులో తనగల గ్రామ రైతులతో నిర్వహించిన జిల్లా స్థాయి భూసేకరణ సంప్రదింపులు, చర్చల సమావేశంలో ఆయన మాట్లాడారు.మల్లమ్మకుంట రిజర్వాయర్‌ను రాష్ట్ర ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యతతో చేపడుతోందని కలెక్టర్ తెలిపారు. రైతుల ప్రయోజనాలను పరిరక్షిస్తూ భూసేకరణ ప్రక్రియను పూర్తి చేయాలని ముఖ్యమంత్రి శ్రీ ఎ. రేవంత్ రెడ్డి ఆదేశించినట్లు చెప్పారు. అదే విధంగా రాష్ట్ర నీటిపారుదల శాఖ మంత్రి శ్రీ ఉత్తమ్ కుమార్ రెడ్డి కూడా ప్రాజెక్టు ప్రాధాన్యత,సాగునీటి అవసరాలను దృష్టిలో ఉంచుకుని భూసేకరణపై ప్రత్యేక దృష్టి సారించినట్లు వివరించారు. వరుస చర్చలు.. కొలిక్కి వచ్చిన భూసేకరణ భూసేకరణలో జనరల్ అవార్డు, కన్సెంట్ అవార్డు అంశాలపై రైతులతో పలుమార్లు చర్చలు నిర్వహించినట్లు కలెక్టర్ వెల్లడించారు. రైతులు కోరుతున్న అంశాలను ప్రభుత్వం, ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్లి, వారికి మెరుగైన పరిహారం అందేలా కన్సెంట్ అవార్డు విధానంలో భూసేకరణకు ప్రభుత్వం సానుకూలంగా స్పందించిందన్నారు.ఈ నేపథ్యంలో బుధవారం జరిగిన సమావేశంలో 15 మంది రైతులు తమ 69 ఎకరాల భూమికి ఎకరాకు రూ.16.50 లక్షల చొప్పున భూమి విలువను అంగీకరించారు. కన్సెంట్ అవార్డు పత్రాలపై సంతకాలు చేసి అధికారులకు సమర్పించారు. రైతుల సానుకూల స్పందనతో సంబంధిత ల్యాండ్ అక్విజిషన్ అవార్డు ఎంక్వైరీ ప్రక్రియను ముందుకు తీసుకెళ్లేందుకు అవకాశం ఏర్పడిందని కలెక్టర్ తెలిపారు. మిగిలిన రైతులతో నూ సంప్రదింపులు మిగిలిన రైతులతో కూడా చర్చలు కొనసాగిస్తామని కలెక్టర్ తెలిపారు. రైతుల అభిప్రాయాలను పరిగణనలోకి తీసుకుని, వారికి న్యాయం జరిగేలా భూసేకరణ ప్రక్రియను సజావుగా పూర్తి చేస్తామని స్పష్టం చేశారు. భూములు కోల్పోయే రైతుల ప్రయోజనాలను కాపాడటంతో పాటు ప్రాజెక్టు నిర్మాణాన్ని నిర్దిష్ట ప్రక్రియలో ముందుకు తీసుకెళ్లేందుకు అధికారయంత్రాంగం చర్యలు చేపడుతోందన్నారు. వేలాది ఎకరాలకు సాగునీటి ఆశలు మల్లమ్మకుంట రిజర్వాయర్ నిర్మాణం పూర్తయితే ఆలంపూర్ నియోజకవర్గంలోని వేలాది మంది రైతులకు సాగునీటి ప్రయోజనం కలుగుతుందని కలెక్టర్ తెలిపారు. సాగునీటి అవసరాలను తీర్చడంతో పాటు వ్యవసాయ రంగానికి ప్రయోజనం చేకూరేలా ప్రాజెక్టు దోహదపడుతుందని పేర్కొన్నారు. రైతుల ప్రయోజనాలు,ప్రజా సంక్షేమం, సాగునీటి అవసరాలను సమన్వయం చేస్తూ మల్లమ్మకుంట రిజర్వాయర్‌ను ముందుకు తీసుకెళ్తామని కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్ స్పష్టం చేశారు.

ఈసమావేశంలో ఆర్డీఓ శ్రీనివాసరావు, భూసేకరణ ప్రత్యేక డిప్యూటీ కలెక్టర్ కృష్ణ,తనగల గ్రామ సర్పంచ్ వెంకటేష్, సంబంధిత అధికారులు, రైతులు పాల్గొన్నారు.

అభిమానానికి ఆపన్న హస్తం

మెగా ఫ్యాన్స్‌కు రూ.5 లక్షల 'బీమా' ధైర్యం!

గద్వాల సెప్టెంబర్ 30 (వుదయం కరస్పాండెంట్)

అభిమానం అనేది కేవలం జైకొట్టే కేరింత లకే పరిమితం కాదు.. కష్టకాలంలో కొండంత అండగా నిలవడంలోనే దాని అసలైన సార్థకత ఉందంటూ గద్వాల గడ్డపై మెగా అభిమానులు తమ సామాజిక నిబద్ధతను చాటుకున్నారు. జిల్లా మెగా ఫ్యాన్స్ అధ్యక్షులు బోయ జమ్మన్న నేతృత్వంలో నిర్వహించిన ప్రత్యేక కార్యక్రమంలో అభిమానులకు రూ.5 లక్షల విలువైన ప్రమాద బీమా పాలసీలను ఉచితంగా అందజేశారు. ఈ కార్యక్రమానికి జోగులాంబ గద్వాల జిల్లా జనసేన పార్టీ ఇన్‌చార్జి శ్రీ బాసు చిన్న తిమ్మప్ప ముఖ్య అతిథిగా హాజరై బీమా పత్రాలను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. అభిమానుల సంక్షేమాన్ని ధ్యేయంగా పెట్టుకుని, వారి కుటుంబాలకు ఆర్థిక రక్షణ కల్పించేలా ఇలాంటి కార్య క్రమాలు చేపట్టడం అభినందనీయమ న్నారు. ఈ కార్యక్రమంలో జనసైనికులు బైన్ పరుష, రఘు, మహేష్ నాయుడు, జగన్, బాలు, శివ రామయ్య, జావీద్, దీనిష్, కబుల హుస్సేన్, రాము, సోమేశ్వరి తదితరులు పాల్గొన్నారు.

జీవన్గిలో కాంగ్రెస్‌కు బలం

***సర్పంచ్ బసప్ప పార్టీలో చేరిక**

***గ్రామ కాంగ్రెస్ అధ్యక్షుడిగా శ్రీనివాస్ రెడ్డి**

బషీరాబాద్

(వుదయం సెప్టెంబర్ 30):

బషీరాబాద్ మండలం జీవన్గి గ్రామంలో కాంగ్రెస్ పార్టీకి కొత్తగా బలం చేకూరింది. గ్రామ సర్పంచ్ రామని బసప్ప కాంగ్రెస్ పార్టీలో చేరారు. బుధవారం మండల కాంగ్రెస్ అధ్యక్షుడు రాజవర్ధన్ రెడ్డి ఆధ్వర్యంలో తాండూరు ఎమ్మెల్యే బుయ్యని మనోహర్ రెడ్డి సమక్షంలో ఆయన కాంగ్రెస్ కండువా కప్పుకున్నారు. ఎమ్మెల్యే మనోహర్ రెడ్డి బసప్పను పార్టీలోకి ఆహ్వానించి, గ్రామ అభివృద్ధి కోసం సమన్వయంతో పని చేయాలని సూచించారు.అదేవిధంగా జీవన్గి గ్రామ కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడిగా శ్రీనివాస్ రెడ్డిని నియమించారు. గ్రామస్థాయిలో పార్టీని మరింత బలోపేతం చేయడంతో పాటు కాంగ్రెస్ ప్రభుత్వ కార్యక్రమాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని పార్టీ నాయకులు సూచించారు. ఈ కార్యక్రమంలో ఏఎంసీ చైర్మన్ శంకరప్ప, సీనియర్ నాయకులు అజయ్ ప్రసాద్, పురుషోత్తం రావు, శ్రీనివాస్ రెడ్డి, గ్రామ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఘనంగా ఎంపీడీవో రాజిరెడ్డి పదవి ఉద్యోగ విరమణ కార్యక్రమం

మెదక్ జిల్లా వుదయం

నిజాంపేట ఎంపీడీవో రాజిరెడ్డి పదవీ విరమణ కార్యక్రమం బుధ వారం శ్రీ రేణుక ఎల్లమ్మ ఫంక్షన్‌హాల్‌లో జరిగింది. జెడ్పీ సీఈవో ఎల్లయ్య, డీఆర్‌డీఏ పీడీ శ్రీనివాస్, డీపీవో యాదయ్య ముఖ్య అతిథులుగా హాజరై జ్యోతి ప్రజ్వలన చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నిజాంపేట మండలానికి ఎంపీడీవో రాజిరెడ్డి రెండేళ్ల 40 రోజులు సేవలందించడం గొప్ప విషయం అన్నారు. గత సంవత్సరం కురిసిన భారీ వర్షాలకు ఆయన చేసిన సేవలు మర్చిపోలేవు అన్నారు. నిజాంపేట మండలానికి సంబంధించి అభివృద్ధి పథంలో నడిచేందుకు కిందిస్థాయి అధికారులతో కలిసికట్టుగా ఉంటూ ఉద్యోగాన్ని నిర్వర్తించేవారని ప్రతి ఒక్కరూ ఆయనను ఆదర్శంగా తీసుకున్నట్లయితే మంచి ప్రభుత్వ ఉద్యోగిగా పేరు పొందవచ్చు అని తెలిపారు. అనంతరం రాజిరెడ్డి మాట్లాడుతూ గుడికందుల గ్రామానికి చెందిన నేను మొట్టమొదటిగా దుబ్బాక జూనియర్ కళాశాలలో మొదటి నియామకం పంచాయ

ఖానాపూర్‌లో భూముల రీ సర్వే ప్రక్రియను పరిశీలించిన కలెక్టర్

బిజినపల్లి, సెప్టెంబరు 30 (వుదయం ప్రతినిధి):

బిజినపల్లి మండలం ఖానాపూర్ గ్రామంలో కొనసాగుతున్న భూముల రీ సర్వే ప్రక్రియను జిల్లా కలెక్టర్ హేమంత్ కేశవ్ పాటిల్ బుధవారం క్షేత్రస్థాయిలో పరిశీలించారు. సర్వే సిబ్బందిని వివరాలు అడిగి తెలుసుకున్నారు. అనంతరం అక్కడ ఉన్న రైతులతో నేరుగా మాట్లాడి రీ సర్వే పురోగతిపై ఆరా తీశారు.రాష్ట్ర ప్రభుత్వం చేపడుతున్న రీ సర్వే వల్ల కలిగే ప్రయోజనాలు, భూముల హద్దుల నిర్ధారణ, భూ రికార్డుల స్పష్టత తదితర అంశాలపై రైతులతో కలెక్టర్ చర్చించారు. సర్వే సక్రమంగా జరుగుతుందా, రైతులకు ఇబ్బందులు ఎదురవుతున్నాయా అని అడిగి తెలుసుకున్నారు. రైతులు రీ సర్వే ప్రక్రియపై సానుకూలంగా స్పందించారు.ఖానాపూర్ గ్రామ పరిధిలో మొత్తం 2,525 ఎకరాల 15 గుంటల భూములను రీ సర్వేలోకి తీసుకున్నట్లు కలెక్టర్ తెలిపారు. ప్రభుత్వ, అటవీ, పట్టా భూములను సమగ్రంగా సర్వే చేసి వాస్తవ పరిస్థితులకు అనుగుణంగా హద్దులు గుర్తించి మ్యాపులను ఆన్‌లైన్‌లో నమోదు చేస్తామన్నారు. దీనివల్ల భవిష్యత్తులో భూ వివాదాలు తగ్గుతాయన్నారు. రీ సర్వేను పారదర్శకంగా, పకడ్బందీగా నిర్వహించాలని అధికారులకు సూచించారు.అనంతరం ఖానాపూర్ ప్రాథమిక పాఠశాలను కలెక్టర్ సందర్శించారు. విద్యార్థులు, ఉపాధ్యాయుల హాజరు, మౌలిక వసతులపై ప్రధానోపాధ్యాయుడు రాజారెడ్డిని అడిగి తెలుసుకున్నారు. పాఠశాలలో 124 మంది విద్యార్థులు చదువుతున్నారని ప్రధానోపాధ్యాయుడు వివరించారు. పాఠశాల భవనం శిథిలావస్థలో ఉందని, అదనపు తరగతి గదులు మంజూరు చేయాలని సర్పంచ్ ఇందిరా, గ్రామస్తులు కోరారు. దీనిపై స్పందించిన కలెక్టర్ అదనపు గదుల నిర్మాణానికి స్థలాన్ని పరిశీలించారు. విద్యార్థులకు సురక్షిత వాతావరణంలో విద్య అందేలా చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు. కలెక్టర్ వెంట తహసీల్దార్ మునీరుద్దీన్, ఎంపీడీవో, సర్పంచ్ ఇందిరా, ప్రధానోపాధ్యాయుడు రాజారెడ్డి, అధికారులు, గ్రామస్తులు ఉన్నారు.

పశువులకు సకాలంలో వైద్య సేవలు టీకాలు అందించాలి : కలెక్టర్ హేమంత్ కేశవ్ పాటీల్

బిజినపల్లి, సెప్టెంబరు 30 (వుదయం ప్రతినిధి):

పశువుల ఆరోగ్య పరిరక్షణతోనే రైతులకు ఆర్థిక భరోసా కలుగుతుందని, పశువులకు సకాలంలో వైద్య సేవలు, టీకాలు అందించాలని జిల్లా కలెక్టర్ హేమంత్ కేశవ్ పాటీల్ అన్నారు.బిజినపల్లి మండలం నందివడ్డేమాన్ గ్రామంలోని ప్రాథమిక పశు వైద్య కేంద్రంలో కొనసాగుతున్న ఫెర్టిలిటీ క్యాంపు, కృత్రిమ గర్భధారణ కార్యక్రమాన్ని బుధవారం ఆయన పరిశీలించారు. పశువులకు అందిస్తున్న వైద్య సేవలను స్వయంగా పరిశీలించి, పశు వైద్యులు, సిబ్బందిని కార్యక్రమ నిర్వహణ వివరాలను అడిగి తెలుసుకున్నారు.పశువుల సంతానోత్పత్తి సామర్థ్యాన్ని పెంచేందుకు చేపడుతున్న కృత్రిమ గర్భధారణ అమలు తీరు, రైతులకు అందుతున్న సేవలు, గర్భధారణ చేయించుకున్న పశువుల వివరాలపై ఆరా తీశారు. ముద్ద చర్మ వ్యాధి, జబ్బ వ్యాధి, గొంతువాపు తదితర వ్యాధుల నివారణకు టీకాలు అందుతున్నాయా, ఎన్ని పశువులకు వేశారు, ఇంకా ఎన్నింటికి వేయాల్సి ఉంది అనే వివరాలను అడిగి తెలుసుకున్నారు. గ్రామంలో పశువుల సంఖ్య, ఆరోగ్య పరిస్థితి, వ్యాధుల నివారణ చర్యలపై ఆరా తీసి, వ్యాధులు సోకిన వెంటనే గుర్తించి సకాలంలో వైద్య సేవలు అందించాలని, వ్యాప్తి చెందకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని సిబ్బందికి సూచించారు. అనంతరం కేంద్రానికి వచ్చిన రైతులు, పశుపోషకులతో నేరుగా మాట్లాడారు. వైద్య సేవలు ఎలా అందుతున్నాయి, పశు వైద్యులు అందుబాటులో ఉంటున్నారా, టీకాలు సకాలంలో వేస్తున్నారా అని అడిగి తెలుసుకున్నారు.పశువులకు

అనారోగ్య లక్షణాలు కనిపించిన వెంటనే సమీప పశు వైద్య కేంద్రాన్ని సంప్రదించాలని, ప్రభుత్వ సేవలను సద్వినియోగం చేసుకోవాలని రైతులకు సూచించారు. పశుసంపద రైతుల జీవనోపాధికి ముఖ్య ఆధారమని, టీకాల ద్వారా అంటువ్యాధులను నియంత్రించవచ్చని, కృత్రిమ గర్భధారణ ద్వారా నాణ్యమైన పశుసంపద అభివృద్ధి చెందుతుందని కలెక్టర్ తెలిపారు. పశువుల వివరాలు, టీకాలు, వైద్య సేవలను పద్ధతిగా నమోదు చేయాలని, రైతులకు ఇబ్బందులు లేకుండా మెరుగైన సేవలు అందించాలని ఆదేశించారు.కలెక్టర్ వెంట బిజినపల్లి తహసీల్దార్ మునీరుద్దీన్, ఎంపీడీవో, నందివడ్డేమాన్ సర్పంచ్ తిప్పిరెడ్డి సుగుణమ్మ, ఉప సర్పంచ్ చింతల నాగరాజు, వార్డు సభ్యులు, పశుసంవర్ధక శాఖ అధికారులు, పశు వైద్యులు, సిబ్బంది, రైతులు తదితరులు ఉన్నారు.

అభివృద్ధి పనుల్లో వేగం పెంచాలి

*** అధికారులు, ప్రజాప్రతినిధులు సమన్వయంతో పనిచేయాలి: ఎమ్మెల్యే బుయ్యని మనోహర్‌రెడ్డి**

బషీరాబాద్(వుదయం సెప్టెంబర్ 30): మండలంలోని గ్రామాల అభివృద్ధి, ప్రజా సమస్యల పరిష్కారంపై ప్రత్యేక దృష్టి సారించాలని తాండూరు ఎమ్మెల్యే బుయ్యని మనోహర్‌రెడ్డి అధికారులను ఆదేశించారు. బషీరాబాద్ రైతు వేదికలో నిర్వహించిన మండల స్థాయి సమీక్ష సమావేశంలో ఆయన పాల్గొని వివిధ అంశాలపై చర్చించారు. గ్రామాల్లో చేపట్టాల్సిన అభివృద్ధి పనులు, పెండింగ్ సమస్యలు, సంక్షేమ పథకాల అమలు తీరును సమీక్షించారు. ప్రజలకు అవసరమైన పనులను గుర్తించి ప్రాధాన్యత ఆధారంగా పూర్తి చేయాలని సూచించారు. ప్రభుత్వ పథకాలు అర్హులైన వారికి చేరేలా క్షేత్రస్థాయిలో పర్యవేక్షణ పెంచాలని తెలిపారు. ఈ సమావేశంలో పీఏసీఎస్ అధ్యక్షురాలు కరుణ అజయ్ ప్రసాద్, ఏఎంసీ చైర్మన్ శంకరప్ప, ఆత్మ కమిటీ చైర్మన్ శంకర్ రెడ్డి, బషీరాబాద్ సర్పంచ్ వెంకటేష్ మహారాజ్, సీనియర్ నాయకులు అజయ్ ప్రసాద్, ఎమ్మార్వో, ఎంపీడీఓ, వివిధ గ్రామాల సర్పంచులు, అధికారులు పాల్గొన్నారు.

విద్యార్థులకు అండగా ప్రభుత్వం

అనంతరం బషీరాబాద్ జూనియర్ కళాశాలలో విద్యార్థులకు ఏకరూప దుస్తులు, నోట్ పుస్తకాలను ఎమ్మెల్యే పంపిణీ చేశారు. ఈ సందర్భంగా విద్యార్థులతో మాట్లాడిన ఆయన విద్యతోనే మంచి భవిష్యత్తుకు బాటలు వేసుకోవచ్చని అన్నారు. క్రమశిక్షణ, పట్టుదలతో చదివి ఉన్నత స్థాయికి చేరుకోవాలని విద్యార్థులకు సూచించారు. విద్యార్థుల అవసరాలకు అనుగుణంగా సహకారం అందించేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉందని పేర్కొన్నారు.

కనుచూపుమేరా కనిపించని ఇంటిగ్రేటెడ్ పాఠశాల

దళితుల భూములను దౌర్జన్యంగా లాక్కోవడాన్ని ఖండిస్తున్నాం
వ్యక్తిగత దూషణలను చేయడం సరికాదు
అభివృద్ధి చేసి చూపించండి ప్రతిపక్షంలో ఉన్న మేము తప్పులను ఎత్తి చూపకూడదా

యాలాల సెప్టెంబర్ 30, వుదయం ప్రతినిధి :-

నూతనంగా నిర్మిస్తున్న ఇంటిగ్రేటెడ్ పాఠశాల ఇంతవరకు ప్రారంభం కూడా కాకపోవడం శోచనీయమని మండల బిఆర్ఎస్ నాయకులు అరవింద్ రెడ్డి, శేఖర్ రెడ్డి, లక్ష్మప్ప, లాలూ ముదిరాజ్ తదితరులు ఆగ్రహం వ్యక్తం చేశారు. బుధవారం యాలాల మండల పరిధిలోని దౌలాపూర్ గ్రామ సమీపంలో నిర్మిస్తున్న ఇంటిగ్రేటెడ్ పాఠశాల నిర్మాణ పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... ఎంతో ఆర్భాటంగా శంకుస్థాపన చేసిన ఇంటిగ్రేటెడ్ పాఠశాల ఇంతవరకు ప్రారంభించకపోవడం ఏమిటన్నారు. కనీసం ఒక రాయి కూడా పాఠశాల నిర్మాణానికి వేయకపోవడం ఆశ్చర్యానికి గురిచేస్తుందన్నారు. అభివృద్ధిలో దూసుకు పోతున్నాయన్న కాంగ్రెస్ నాయకుల మాటలు చేతలలో లేకపోవడం చాలా విడ్డూరంగా ఉందన్నారు. వ్యక్తిగత దూషణలు చేస్తూ ప్రతిపక్ష నాయకుల మనోభావాలను దెబ్బతీయడం ఎంత వరకు సమంజసమన్నారు. ఇంటిగ్రేటెడ్ పాఠశాల పేరుతో అక్రమ మట్టి వ్యాపారాన్ని కొనసాగిస్తున్నారన్నారు. ఇన్ని నెలలు గడిచిన కనీసం పాఠశాల ప్రారంభానికి ఒక ఇటుక కూడా పెట్టలేదన్నారు. అభివృద్ధి అభివృద్ధి అని చెప్పుకునే కాంగ్రెస్, చేతలలో అభివృద్ధి చేయకుండా సమయాన్ని వృధా చేస్తూ ప్రజలను తీవ్ర ఇబ్బందులకు గురిచేస్తుందన్నారు. అక్రమ ఇసుక, మట్టి వ్యాపారాలతో కాంగ్రెస్ లో కొంతమంది నాయకులు తల మునకలై మండల అభివృద్ధికి తిలోదకాలు ఇచ్చారన్నారు. బెన్నూరు గ్రామ ప్రాంతంలోని పొలాలు కాలుష్యం కోరల్లో చిక్కి కంపెనీ వెదజల్లే దుర్గంధాలతో రైతులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారన్నారు. ప్రజలు తాగే కాగ్నా నీటిని కంపెనీ కాలుష్య వ్యర్థాలు కలుషితం చేస్తూ ప్రజలకు అనారోగ్యాన్ని కలిగిస్తున్నాయన్నారు. ఇకనైనా కాంగ్రెస్ నాయకులు తాము చేస్తున్న కార్యకలాపాలను మానుకొని మండల అభివృద్ధిపై తమ దృష్టి సారించాలన్నారు. మండల అభివృద్ధికి తాము ఎప్పుడు వ్యతిరేకం కాదన్నారు. మండల అభివృద్ధిని మరిచి వ్యక్తిగత అభివృద్ధి కోసం పాకులాడే నాయకుల వ్యవహార శైలి పట్ల తాము తీవ్ర అసంతృప్తితో ఉన్నామన్నారు. ఈ కార్యక్రమంలో శరణ్ భూపాల్, కృష్ణ, శ్రీనివాస్ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

యాలల్లో ఘనంగా అంగన్ మిలన్ సేవ

యాలాల సెప్టెంబర్ 30 వుదయం ప్రతినిధి:-

ప్రధానమంత్రి నరేంద్ర మోదీ జన్మదిన పురస్కరించుకొని దేశవ్యాప్తంగా అంగన్వాడీ కేంద్రాలలో అంగన్ మిలన్ సేవ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామని మాజీ ఎంపీపీ బీజేపీ సీనియర్ నాయకులు బాలేశ్వరం గుప్తా పేర్కొన్నారు..బుధవారం మండల పరిధి లోని లక్ష్మీనారాయణపూర్, అగ్గనూరు, తిమ్మాయిపల్లి గ్రామాలలోని అంగన్వాడి కేంద్రాలలో చిన్నారులకు అందిస్తున్న సేవలను అభినందిస్తూ అంగన్‌వాడీ టీచర్, ఆశా కార్యకర్త, ఆయమ్మలను శాలువాలతోసన్మానించారు. అనంతరం చిన్నారులకు పండ్లు పంపిణీ చేసి సేవా కార్యక్రమాన్నినిర్వహించారు. ఈ కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్లు,చిన్నారులు,గర్భిణీ మహిళలతోముచ్చటించారు. కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలపై అవగాహన కల్పించారు. అనంతరం వారు మాట్లాడుతూ... ప్రధానమంత్రి నరేంద్ర మోదీ జన్మదిన వేడుకలను పురస్కరించుకుని చేపట్టిన సేవా సంకల్ప్ అభియాన్ కార్యక్రమంలో భాగంగా తెలంగాణ వ్యాప్తంగా అంగన్ మిలన్ సేవా కార్యక్రమాలు ఘనంగా జరుగుతున్నాయన్నారు. అంగన్వాడి కేంద్రాలు కేంద్ర నిధులతో నడుస్తున్నాయన్నారు.మండల వ్యాప్తంగా అన్ని అంగన్వాడీ కేంద్రాలు సన్నాన కార్యక్రమం నిర్వహించడం జరిగిందన్నారు.అంగన్ మిలన్ సేవా కార్యక్రమంలో భాగంగా అంగన్‌వాడీ మరియు ఆశా కార్యకర్తల సేవలను గుర్తించడంతో పాటు వారిని సత్కరించడం.అంగన్‌వాడీ కేంద్రాల సందర్శన, టీచర్లకు సన్మానం, చిన్నారులకు పండ్ల పంపిణీ చేయడం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షుడు శివకుమార్, ఉప సర్పంచ్ వెంకటేశం, అరుణ్ కుమార్, శంకర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు

దేవుళ్లను రాజకీయాల్లోకి లాగొద్దు

బీజేపీ - ముఖ్యమంత్రి దిష్టిబొమ్మ దహనం

నాగర్ కర్నూల్ రూరల్, సెప్టెంబరు 30 (వుదయం ప్రతినిధి):

దేవుళ్లను రాజకీయాల్లోకి లాగొద్దని భారతీయ జనతా పార్టీ నాయకులు డిమాండ్ చేశారు.ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి శ్రీరాముడు,హిందూ దేవుళ్లపై చేసిన వ్యాఖ్యలను నిరసిస్తూ బుధవారం నాగర్‌కర్నూల్ జిల్లా కేంద్రంలోని కొల్లాపూర్ చౌరస్తాలో బీజేపీ నాయకులు ఆందోళన చేపట్టారు. ముఖ్యమంత్రి దిష్టిబొమ్మను దహనం చేసి తమ నిరసన వ్యక్తం చేశారు.ఈ సందర్భంగా బీజేపీ నాయకులు మాట్లాడుతూ.. శ్రీరాముడిపై సీఎం చేసిన వ్యాఖ్యలు హిందువుల మనోభావాలను దెబ్బతీసే విధంగా ఉన్నాయని ఆరోపించారు. ఓటు బ్యాంకు రాజకీయాల కోసం దేవుళ్ల మధ్య విభజన తీసుకురావడం, హిందూ దేవుళ్లను రాజకీయాల్లోకి లాగడం సరికాదని విమర్శించారు. హిందూ ధర్మం, ఆరాధ్య దైవాలపై అనుచిత వ్యాఖ్యలు చేయడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామని పేర్కొన్నారు. ముఖ్యమంత్రి తన వ్యాఖ్యలను వెంటనే ఉపసంహరించుకుని హిందూ సమాజానికి క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు.భవిష్యత్తులో హిందూ దేవుళ్లను కించపరిచేలా మాట్లాడితే పెద్ద ఎత్తున ఆందోళనలు చేపడతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో బీజేపీ పట్టణ అధ్యక్షులు చెవ్వ ప్రమోద్, జిల్లా, మండల, పట్టణ స్థాయి నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

సూక్ష్మ నీటి సేద్యంతో పంట దిగుబడి, రైతుల ఆదాయం పెరుగుతుంది

డ్రిప్ ఇరిగేషన్ విధానాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలి
నాబార్డ్ జిల్లా అధికారి క్రిష్ణ తేజ

సంగారెడ్డి, సెప్టెంబర్ 30:-వుదయం.

సూక్ష్మ నీటి సేద్యం ద్వారా నీటి వినియోగాన్ని తగ్గించడంతో పాటు పంటల దిగుబడిని పెంచుకోవచ్చని నాబార్డ్ జిల్లా అధికారి క్రిష్ణతేజ పేర్కొన్నారు.డ్రిప్ ఇరిగేషన్ విధానాన్ని రైతులు విస్తృతంగా వినియోగించుకోవాలని సూచించారు. బుధవారం నాబార్డ్ జిల్లా అధికారి క్రిష్ణ తేజ, జిల్లా ఉద్యానశాఖ అధికారి సోమేశ్వరరావుతో కలిసి సంగారెడ్డి జిల్లాలోని చౌటకూరు, కంది, సంగారెడ్డి, సదాశివపేట తదితర మండలాల్లో పర్యటించారు. ఉద్యానశాఖ ద్వారా నాబార్డ్ సహకారంతో అమలు చేస్తున్న తెలంగాణ సూక్ష్మ నీటి సేద్య పథకం కింద లబ్ధి పొందిన రైతుల ఆయిల్‌పామ్, చెరుకు తదితర పంట తోటలను వారు పరిశీలించారు.ఈ సందర్భంగా ఆయా తోటల్లో ఏర్పాటు చేసిన డ్రిప్ ఇరిగేషన్ వ్యవస్థల పనితీరును పరిశీలించి, రైతులతో నేరుగా మాట్లాడారు. డ్రిప్ ఇరిగేషన్ వినియోగం ద్వారా పంటలకు అందుతున్న ప్రయోజనాలు, నీటి వినియోగం, దిగుబడి, సాగు ఖర్చులలో వస్తున్న మార్పుల గురించి రైతులను అడిగి తెలుసుకున్నారు.
డ్రిప్ ఇరిగేషన్ ద్వారా పంటలకు అవసరమైన నీటిని సమర్థవంతంగా అందించడం వల్ల 20 నుంచి 30 శాతం వరకు అదనపు దిగుబడి పొందుతున్నామని రైతులు తెలిపారు.అంతేకాకుండా కూలీల ఖర్చు తగ్గడంతో పాటు పంట సాగు వ్యయం తగ్గి, నికర ఆదాయం పెరుగుతోందని రైతులు సంతోషం వ్యక్తం చేశారు.ఈ సందర్భంగా జిల్లా ఉద్యానశాఖ అధికారి సోమేశ్వర్ రావు మాట్లాడుతూ, తక్కువ నీటితో పంటలకు అవసరమైన తేమను సమర్థవంతంగా అందించేందుకు సూక్ష్మ నీటి సేద్యం ఎంతో ఉపయోగకరంగా ఉంటుందని తెలిపారు. ముఖ్యంగా ఆయిల్‌పామ్, చెరుకు వంటి పంటల్లో డ్రిప్ ఇరిగేషన్ ద్వారా నీటి పొదుపుతో పాటు పంటల ఉత్పాదకత, రైతుల ఆదాయం పెంచేందుకు అవకాశం ఉంటుందని పేర్కొన్నారు. అర్హులైన రైతులు ప్రభుత్వం అందిస్తున్న సూక్ష్మ నీటి సేద్య పథకాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.ఈ కార్యక్రమంలో ఉద్యానశాఖ అధికారులు సమత, అనూష రెడ్డి, సునీత, డ్రిప్ ఇంజినీర్ ఉమ, ఫినోలెక్స్ మరియు కుమార్ డ్రిప్ కంపెనీల ప్రతినిధులు మహేష్, రాహుల్, రాజ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

అంగన్‌వాడీ టీచర్ పోస్టుల నియామక ఇంటర్వ్యూలు పూర్తి

మహబూబ్‌నగర్

అంగన్‌వాడీ టీచర్ పోస్టులకు 467 మంది అభ్యర్థులు ఇంటర్వ్యూ కు హాజరుజిల్లాలో ఖాళీగా ఉన్న 165 అంగన్‌వాడీ టీచర్ పోస్టులకు అభ్యర్థుల ఎంపిక ప్రక్రియ కొనసాగుతోంది. ఇందులో భాగంగా గత రెండు రోజులుగా నిర్వహిస్తున్న ఇంటర్వ్యూలకు మొత్తం 494 మంది అభ్యర్థులు దరఖాస్తు చేసుకోగా, 467 మంది అభ్యర్థులు హాజరయ్యారు.మహబూబ్‌నగర్ జిల్లా కలెక్టర్ కార్యాలయంలో గత రెండు రోజులుగా నిర్వహిస్తున్న అంగన్‌వాడీ టీచర్ పోస్టుల ఇంటర్వ్యూలను స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ మధుసూదన్ నాయక్ తన ఛాంబర్‌లో నిర్వహించారు.ఈ ఇంటర్వ్యూ ప్యానెల్‌లో జిల్లా రెవెన్యూ అధికారి ఎ. నిర్మల, జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డా. ఎ. శ్రీనివాసులు, జిల్లా మహిళా శిశు సంక్షేమ శాఖ అధికారి జరీనా బేగం పాల్గొన్నారు.

మంచినీరు, విద్యుత్ సమస్య ఉండకూడదు

అధికార పార్టీ కౌన్సిలర్ల వార్డులలో అభివృద్ధి అన్ని వార్డులలో అభివృద్ధి జరగాలి

నర్సాపూర్ సెప్టెంబర్ 30 (వుదయం న్యూస్)

నర్సాపూర్ పురపాలక సర్వసభ్య సమావేశం బుధవారం పురపాలక కార్యాలయంలో జరిగింది పట్టణంలో ప్రధానంగా విద్యుత్, మంచినీరు, సిసి రోడ్లు పారిశుద్యం అండర్ డ్రైనేజ్ పెండింగ్ పనులు వివిధ అంశాలపై సమావేశంలో చర్చించారు బిజెపి టీ ఆర్ఎస్ కౌన్సిలర్ల గెలుపొందిన వార్డులలో అభివృద్ధి కార్యక్రమాలు చేయడం లేదని అధికార పార్టీ కౌన్సిలర్ల వార్డులలో అభివృద్ధి పనులు చేస్తున్నారని కౌన్సిలర్లు అభ్యంతరం వ్యక్తం చేశారు ఈ సమావేశంలో ఎమ్మెల్యే సునీత లక్ష్మారెడ్డి మాట్లాడుతూ మున్సిపల్ పరిధిలో మంచి నీటి , కరెంటు సమస్యలు లేకుండా చూడాలని బతుకమ్మ, దసరా పండుగ సందర్భంగా వీధిలైట్లు లేని చోట ఏర్పాటు స్టేడియం నిర్మాణంకు 4.2 కోట్ల నిధులు మంజూరు స్టేడియం ఏర్పాటుకు టెండర్లు పిలవాలని వాలీబాల్ వాకింగ్ ట్రాక్ నిర్మించాలని డబుల్ బెడ్ రూమ్ లు వెంటనే పంపిణీ చేయాలని నర్సాపూర్ పట్టణంలో కరెంటు సమస్య ఉంది ప్రత్యేకంగా సబ్ స్టేషన్,స్మశాన వాటిక మరమ్మతులు రాయ రావు చెరువు అభివృద్ధి వంటి అంశాలపై సమావేశంలో అధికారులకు సూచన చేశారు మున్సిపల్ అభివృద్ధికి పార్టీలకు అతీతంగా అందరూ కృషి చేయాలని అన్నారు ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ లక్ష్మీ రాజు యాదవ్ వైస్ చైర్మన్ భూచేష్ యాదవ్ మున్సిపల్ కమిషనర్ సాయి కిరణ్, కౌన్సిలర్లు మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు

ప్రమాదాల నివారణకు చర్యలు చేపట్టాలి

మహబూబ్‌నగర్

జిల్లా కలెక్టర్ ఖుష్బూ గుప్తా

జిల్లాలో జాతీయ రహదారుల పై కొనసాగుతున్న పనులను వేగంగా పూర్తి చేసి, రోడ్డు ప్రమాదాల నివారణకు సంబంధిత శాఖల అధికారులు సమన్వయంతో పనిచేసి, అవసరమైన భద్రతా చర్యలను తక్షణమే చేపట్టాలని జిల్లా కలెక్టర్ ఖుష్బూ గుప్తా ఆదేశించారు.బుధవారం కలెక్టర్ కార్యాలయం వీడియో కాన్ఫరెన్స్ హాల్‌లో నిర్వహించిన జిల్లా రోడ్డు భద్రతా కమిటీ సమావేశాన్ని లో ఎస్.పి. డి. జానకీతో కలిసి జిల్లా కలెక్టర్ ఖుష్బూ గుప్తా పాల్గొన్నారు.ఈ సందర్భంగా జిల్లాలోని జాతీయ రహదారులు, ప్రధాన రహదారులపై రోడ్డు భద్రతా పరిస్థితులు, ప్రమాదాల నివారణకు చేపట్టిన చర్యలు, గత సమావేశంలో తీసుకున్న నిర్ణయాల అమలు పురోగతిని జిల్లా కలెక్టర్ అధికారులతో సమీక్షించారు.ముఖ్యంగా జాతీయ రహదారులపై ప్రమాదాలకు అవకాశం ఉన్న ప్రాంతాలను గుర్తించి, బ్లాక్ స్పాట్ల వద్ద అవసరమైన రహదారి భద్రతా చర్యలు చేపట్టాలని కలెక్టర్ సూచించారు. రోడ్ల నిర్మాణం, మరమ్మతులు, అప్రోచ్ రోడ్లు, లైటింగ్, సైన్ బోర్డులు తదితర పనులను వేగవంతంగా పూర్తి చేయాలని ఆదేశించారు. బాలానగర్ సమీపంలోని జాతీయ రహదారి పనుల్లో జాప్యం జరుగుతున్న అంశంపై కలెక్టర్ అసంతృప్తి వ్యక్తం చేశారు. పెండింగ్‌లో ఉన్న అప్రోచ్ రోడ్ల పనులను నిర్ణీత గడువులోగా పూర్తి చేయాలని, ఒక అప్రోచ్ రోడ్డును అక్టోబర్ నెలాఖరులోగా, మరో అప్రోచ్ రోడ్డును నవంబర్‌లోగా పూర్తి చేస్తామని అధికారులు తెలిపిన నేపథ్యంలో, పనులను వెంటనే చేపట్టి వేగవంతం చేయాలని ఆదేశించారు.పనుల జాప్యం వల్ల వాహనదారులకు, ప్రయాణికులకు ట్రాఫిక్ ఇబ్బందులు కలగకుండా చర్యలు తీసుకోవాలన్నారు.రాజాపూర్, పోలేపల్లి సెజ్ ప్రాంతాల్లో పెండింగ్‌లో ఉన్న రహదారి సంబంధిత పనులను పోలీస్, జాతీయ రహదారుల అధికారులు సమన్వయంతో త్వరితగతిన పూర్తి చేయాలని సూచించారు. అవసరమైన చోట సాయిల్ వర్క్స్ తదితర పనులను కూడా పూర్తి చేయాలని ఆదేశించారు.
అంబటిపల్లి-దివిటిపల్లి, ఇతర బైపాస్ రోడ్ల వద్ద లైటింగ్, అలాగే పాలకొండ బై పాస్ రోడ్డులో లైట్లకు విద్యుత్ కనెక్షన్లకు సంబంధించిన పనులను వెంటనే పూర్తి చేయాలని విద్యుత్ శాఖ అధికారులను కలెక్టర్ ఆదేశించారు. రహదారులపై తగిన వెలుతురు ఉండేలా చర్యలు తీసుకోవాలని సూచించారు.
జడ్చర్ల-కల్వకుర్తి రహదారితో పాటు ఇతర ప్రాంతాల్లో రోడ్డు భద్రతకు సంబంధించిన అంశాలను పోలీస్ శాఖతో సమన్వయం చేసుకుని పరిశీలించాలని అధికారులను ఆదేశించారు. ప్రమాదాల నివారణకు అవసరమైన చోట రోడ్ సేఫ్టీ చర్యలను గుర్తించి అమలు చేయాలని సూచించారు.
రోడ్డు భద్రతకు సంబంధించిన పనులకు నిర్ణయించిన గడువులను అధికారులు కచ్చితంగా పాటించాలని, పనుల పురోగతిని నిరంతరం పర్యవేక్షించాలని కలెక్టర్ స్పష్టం చేశారు. రోడ్డు భద్రత విషయంలో ఎలాంటి నిర్లక్ష్యానికి తావులేకుండా సంబంధిత శాఖలు సమన్వయంతో పనిచేయాలని ఆమె ఆదేశించారు.ఈ సమావేశంలో జిల్లా రెవెన్యూ అధికారి ఎ. నిర్మల, అదనపు ఎస్.పి ఎన్. బి రత్నం, మున్సిపాల్ కమిషనర్ రామానుజుల రెడ్డి, ఆర్ అండ్ బి ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్, జాతీయ రహదారుల శాఖ అధికారులు, పోలీస్, విద్యుత్ శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

ఆహార భద్రత చర్యలను పటిష్టంగా అమలు చేయాలి: జిల్లా కలెక్టర్

మహబూబ్‌నగర్

జిల్లాలో ఆహార భద్రత చర్యలను పటిష్టంగా అమలు చేయాలని జిల్లా కలెక్టర్ ఖుష్బూ గుప్తా అధికారులను ఆదేశించారు. బుధవారం కలెక్టరేట్‌లోని వీడియో కాన్ఫరెన్స్ హాల్‌లో నిర్వహించిన జిల్లా ఆహార భద్రత కమిటీ సమావేశంలో ఆమె పాల్గొని జిల్లాలో అమలవుతున్న ఆహార భద్రత కార్యక్రమాలను సమీక్షించారు.ఈ సందర్భంగా గత సమావేశంలో చర్చించిన అంశాలు, వాటిపై సంబంధిత శాఖలు తీసుకున్న చర్యలపై కలెక్టర్ సమీక్షించారు. గత త్రైమాసికంలో ఆహార భద్రత శాఖ చేపట్టిన కార్యక్రమాలను అధికారులు కలెక్టర్‌కు వివరించారు. జిల్లాలో ఇప్పటివరకు 200 ఆహార వ్యాపార సంస్థలను నమోదు చేయగా, 67 సంస్థలకు లైసెన్సులు జారీ చేసినట్లు తెలిపారు.
ప్రతి నెలా 12 ఆహార నమూనాలను సేకరించి ప్రయోగశాలలకు పరీక్షల నిమిత్తం పంపుతున్నట్లు అధికారులు తెలిపారు. ఇప్పటివరకు వివిధ ప్రాంతాల నుంచి 36 ఆహార నమూనాలను సేకరించి ఆహార భద్రత పరీక్షల కోసం ప్రయోగశాలలకు పంపినట్లు వివరించారు.

'ఈట్ రైట్' కార్యక్రమంపై సమీక్ష

జిల్లాలో అమలు చేస్తున్న 'ఈట్ రైట్' కార్యక్రమం పురోగతిని కూడా అధికారులు కలెక్టర్‌కు వివరించారు. విద్యార్థుల్లో ఆహార భద్రత, ఆరోగ్యకరమైన ఆహారపు అలవాట్లపై అవగాహన కల్పించేందుకు జిల్లాలోని ఏడు పాఠశాలలను ఎంపిక చేసినట్లు తెలిపారు.
ఈ సమావేశంలో జిల్లా రెవెన్యూ అధికారి ఎ. నిర్మల, జిల్లా ఆహార భద్రత అధికారి నీలిమ, ఫుడ్ సేఫ్టీ ఆఫీసర్ బి. శ్రీలత,విద్యాశాఖ, వైద్య, ఆరోగ్య శాఖ, ఎస్సీ, ఎస్టీ, మైనారిటీ సంక్షేమ శాఖల అధికారులు, పంచాయతీరాజ్ శాఖ అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

మత్తు పదార్థాల వినియోగం నివారణకు బాధ్యతతో సమష్టిగా కృషి చేయాలి– జిల్లా కలెక్టర్ ఖుష్బూ గుప్తా

మహబూబ్‌నగర్

మత్తు పదార్థాలు, మాదకద్రవ్యాల వినియోగాన్ని అరికట్టేందుకు అధికారులు, విద్యాసంస్థల యాజమాన్యాలు, కళాశాలల ప్రతినిధులు సమష్టిగా బాధ్యత తీసుకుని పనిచేయాలని జిల్లా కలెక్టర్ ఖుష్బూ గుప్తా అన్నారు.బుధవారం జిల్లా కలెక్టర్ కార్యాలయంలో మా

రైతుల సంక్షేమమే సోసైటీ లక్ష్యం

పిఎసిఎస్ చైర్మన్ దేశిడి శ్రీనివాస్ రెడ్డి

కొత్తగూడ సెప్టెంబర్ 30(వుదయం ప్రతినిధి) :రైతుల సంక్షేమమే సోసైటీ లక్ష్యం అని రైతుల ఉన్నతి కోసమే సొసైటీ పని చేస్తుందని పిఎసిఎస్ చైర్మన్ దేశిడి శ్రీనివాస్ రెడ్డి తెలిపారు. బుధవారం మండలంలోని పోగులపల్లి పిఎసిఎస్ కార్యాలయంలో మహాజనసభ జరిగింది. ఈ సభలో రైతులను ఉద్దేశించి చైర్మన్ దేశిడి శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ సొసైటీని అభివృద్ధి చేయడంలో రైతుల పాత్ర ప్రత్యేకంగా ఉంటుందని తెలిపారు. ఎరువులు సొసైటీ లోనే కొనుగోలు చేసుకోవాలని సూచించారు. ప్రతి ఒక్క రైతు సొసైటీని బలోపేతం చేయడానికి కృషి చేయాలని కోరారు. సొసైటీ రైతుల పక్షాన ఉంటుందని అన్నారు. ఎఫ్ పి ఓ ద్వారా రైతులకు మరిన్ని ప్రయోజనాలు ఉంటుందని అన్నారు.ఎఫ్ పిఓలో ఉన్న సభ్యులకు ఎఫ్ పి ఓ జిల్లా ఇన్చార్జ్ రాజయ్య చేతుల మీదుగా షేర్ సర్టిఫికెట్లు అందజేశారు.

ఈ కార్యక్రమంలో వైస్ చైర్మన్ ఈసం కమలమ్మ, డైరెక్టర్లు చల్లా నారాయణరెడ్డి, కొమ్మనబోయిన వేణు, ఢిల్లీ మోహన్ రావు, యాకయ్య, మమత, సీతమ్మ వెంకన్న, సిబ్బంది వెంకన్న, లింగన్న తదితరులు పాల్గొన్నారు.

సాదాసీదాగా మండల సర్వసభ్య సమావేశం

అరకొర నివేదికలతో అధికారులు మండల సభకు హాజరు.
వచ్చే సమావేశానికి పూర్తి నివేదికలతో అధికారులు సభకు హాజరు కావాలి.
అధికారుల ప్రజాప్రతినిధుల సమన్వయంతో గ్రామాలను అభివృద్ధి చేయాలి.
మండల స్పెషల్ ఆఫీసర్ నారాయణరెడ్డి.

ఖానాపురం, సెప్టెంబర్ 30
(వుదయం ప్రతినిధి):

ప్రజా ప్రతినిధుల అధికారుల సమన్వయంతో గ్రామాలను అభివృద్ధి పథంలో ముందుకు తీసుకువెళ్లాలని మండల స్పెషల్ ఆఫీసర్ నారాయణరెడ్డి అధికారులకు ప్రజాప్రతినిధులకు తెలిపారు. మండల కేంద్రంలోని మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో మండల సర్వసభ్య సమావేశం మండల అభివృద్ధి అధికారి వనపర్తి అద్వైత అధ్యక్షన ఏర్పాటు చేయగా ముఖ్యఅతిథిగా మండల స్పెషల్ ఆఫీసర్ పాల్గొని మాట్లాడుతూ మండల సర్వసభ్య సమావేశానికి వచ్చే అధికారులు ఆయా గ్రామాల అభివృద్ధి పూర్తి నివేదికలతో మండల సర్వసభ్య సమావేశానికి హాజరు కావాలని సర్వసభ్య సమావేశంలో ప్రజా ప్రతినిధులు అడిగిన ప్రతి ప్రశ్నకు సంబంధిత అధికారులు నివేదిక రూపంలో ప్రజాప్రతినిధులకు సమాధానం చెప్పాలని తెలుపుతూ, అధికారుల ప్రజాప్రతినిధుల సమన్వయంతో గ్రామాలను అభివృద్ధి పథంలో ముందుకు తీసుకువెళ్లాలని తెలిపారు. అనంతరం సంబంధిత శాఖ అధికారు నివేదికలు చదివినవించగా ప్రజాప్రతినిధులు వారి సందేహాలను సంబంధిత శాఖ అధికారులను అడగగా వారి వద్ద పూర్తి సమాచారం లేకపోవడంతో అధికారులపై ప్రజా ప్రతినిధులు అసహనం వ్యక్తం చేయగా మండల అభివృద్ధి అధికారి కలగజేసుకొని ప్రజాప్రతినిధులకు పలు అభివృద్ధి పనులపై కులం కుశంగా వివరణ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ నంగునూరి రమేష్, ఏం సి వైస్ చైర్మన్ శాఖమూరి హరిబాబు, సొసైటీ చైర్ పర్సన్ వల్లే శ్రీనివాస్, ఎంపీఓ సునీల్ కుమార్ రాజ్, ఇన్చార్జి ఎంఈఓ వెంకట్రామ్, ఏటీఎం రమాదేవి, ఎపిఓ సునీత, సర్పంచులు దాసరి రమేష్, జాడి అచ్చితం, మాద్రాజు వెంకన్న, ఎలగందుల రాజు, ఆబోతు శ్రీలత, పిండి అనూష, బాదావత్ జ్యోతి, పెసరు రాణి, గొంది సుజాత, బానోతు సునీత, ధనసరి సురేష్, జాటోత్ వినోద్ కుమార్, కూస విమల, బోడ రమేష్, మూడు దేవేందర్, మీరన్న తోపాటు వివిధ శాఖల అధికారులు ప్రజా ప్రతినిధులు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

భూ రీ-సర్వేను పకడ్బందీగా నిర్వహించాలి

– జిల్లా కలెక్టర్ బోర్ఖడే హేమంత్ సహదేవరావు

ములుగు, సెప్టెంబర్ 30
(వుదయం ప్రతినిధి) :

ప్రభుత్వ మార్గదర్శకాలకు అనుగుణంగా భూ రీ సర్వేను పకడ్బందీగా నిర్వహించాలని, అధికారులు బాధ్యతాయుతంగా నిర్దేశిత పనులను సకాలంలో పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ బోర్ఖడే హేమంత్ సహదేవరావు ఆదేశించారు. బుధవారం రోజున జిల్లా కలెక్టర్ బోర్ఖడే హేమంత్ సహదేవరావు, అదనపు కలెక్టర్ రెవెన్యూ సిహెచ్ మహేందర్ జి, తో కలిసి జిల్లాలోని అన్ని మండలాల తహసీల్దార్లతో భూ రీ సర్వే, పై ఐ డి ఓ సి సమావేశ మందిరంలో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ, జిల్లాలో ఎంపిక చేసిన గ్రామాల్లో భూ రీ సర్వే పనులలో వేగం పెంచాలన్నారు. క్షేత్రస్థాయిలో సర్వే ప్రక్రియను పర్యవేక్షిస్తూ, కొలతలు, భూ వివరాల నమోదులో పొరపాట్లకు తావులేకుండా జాగ్రత్తలు తీసుకోవాలని ఆదేశించారు. భూభారతి, సాదా బైనామాలకు సంబంధించిన దరఖాస్తులను ప్రభుత్వ మార్గదర్శకాల మేరకు పరిశీలించి, పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ప్రజలకు పారదర్శకంగా రెవెన్యూ సేవలు అందిస్తూ, భూ సమస్యల పరిష్కారంలో అనవసర జాప్యం లేకుండా చూడాలన్నారు. ఈ సమావేశంలో ఆర్డీవో కృష్ణవేణి , అన్ని మండలాల తహసిల్దార్ లు, డిప్యూటీ తహసిల్దార్ లు, సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

అంగన్‌వాడీ, ఆశా వర్కర్ల సేవలు అభినందనీయం.

నర్సంపేట వుదయం ప్రతినిధి
సెప్టెంబర్ 30.

సేవా సంకల్ప్ అభియాన్‌లో భాగంగా నర్సంపేటలో అంగన్ మిలన్ సేవా కార్యక్రమం నిర్వహించారు. కన్వీనర్ సూత్రపు సరిత ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమానికి బీజేపీ వరంగల్ జిల్లా ప్రధాన కార్యదర్శి డాక్టర్ గోగుల రాణా ప్రతాప్ రెడ్డి, మహిళా మోర్చా జిల్లా ఇంచార్జీ సిరికొండ కవిత, అధ్యక్షురాలు టేకుమట్ల రేణుక తదితరులు హాజరయ్యారు. ఈ సందర్భంగా అంగన్‌వాడీ టీచర్లు, ఆయా వర్కర్లు, ఆశా కార్యకర్తలను శాలువాలతో ఘనంగా సన్మానించారు. చిన్నారుల ఆరోగ్యం, పోషకాహారం, ప్రాథమిక విద్యతో పాటు గర్భిణులు, బాలింతల సంక్షేమంలో వారి సేవలు కీలకమని డాక్టర్ గోగుల రాణా ప్రతాప్ రెడ్డి అన్నారు. కేంద్ర ప్రభుత్వ సంక్షేమ, పోషకాహార కార్యక్రమాలను ప్రజలకు చేరవేయడంలో వారి పాత్ర అభినందనీయమని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో బీజేపీ నాయకులు, మహిళా మోర్చా నాయకులు, అంగన్‌వాడీ, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో మెగా స్వచ్ఛభారత్ కార్యక్రమం

నర్సంపేట వుదయం ప్రతినిధి
సెప్టెంబర్ 30.

ప్రభుత్వ డిగ్రీ కళాశాల అటానమస్ నర్సంపేటలో ఎన్ఎస్ఎస్ వాలంటీర్ల ఆధ్వర్యంలో బుధవారం మెగా స్వచ్ఛ భారత్ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ మల్లం నవీన్ ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. అధ్యాపకులు, ఎన్ఎస్ఎస్ ప్రతినిధులు, విద్యార్థులు కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎన్ఎస్ఎస్ వాలంటీర్లు కళాశాల మైదానం, పరిసర ప్రాంతాలను శుభ్రం చేశారు. మైదానంలో పెరిగిన గడ్డి, మొక్కలు, చెత్తాచెదారం, ప్లాస్టిక్ వ్యర్థాలను తొలగించి పరిసరాలను పరిశుభ్రంగా తీర్చిదిద్దారు. కళాశాల ప్రాంగణాన్ని ప్లాస్టిక్ రహిత ప్రాంతంగా మార్చేందుకు విద్యార్థులు ప్రత్యేకంగా శ్రమించారు. కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ మల్లం నవీన్ మాట్లాడుతూ పరిశుభ్రత ప్రతి ఒక్కరి సామాజిక బాధ్యత అని అన్నారు. పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకున్నప్పుడే ఆరోగ్యవంతమైన సమాజాన్ని నిర్మించగలమని పేర్కొన్నారు. విద్యార్థులు పరిశుభ్రతపై అవగాహన పెంచుకుని, తమ ఇళ్లతో పాటు పరిసర ప్రాంతాల్లోనూ పరిశుభ్రతను పాటించాలని సూచించారు. ఎన్ఎస్ఎస్ జిల్లా కోఆర్డినేటర్ డాక్టర్ ఎం. రాంబాబు మాట్లాడుతూ ప్రజల్లో పరిశుభ్రత, ఆరోగ్యకరమైన వాతావరణంపై అవగాహన

కల్పించడంతో పాటు యువతలో సామాజిక బాధ్యతను పెంపొందించడమే లక్ష్యంగా మెగా స్వచ్ఛభారత్ కార్యక్రమాన్ని నిర్వహించినట్లు తెలిపారు. కళాశాల ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం అధికారి డాక్టర్ సంధ్య మాట్లాడుతూ విద్యార్థి దశ నుంచే పరిశుభ్రతను జీవితంలో భాగంగా చేసుకోవాలని సూచించారు. ప్రతి ఒక్కరూ తమ ఇళ్లతో పాటు చుట్టుపక్కల పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాల్సిన బాధ్యత ఉందన్నారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ మల్లం నవీన్, ఎన్ఎస్ఎస్ జిల్లా ప్రోగ్రాం అధికారి డాక్టర్ ఎం. రాంబాబు, కళాశాల ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం అధికారి కలగజేసుకొని ప్రజాప్రతినిధులకు పలు అభివృద్ధి పనులపై కులం కుశంగా వివరణ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ నంగునూరి రమేష్, ఏం సి వైస్ చైర్మన్ శాఖమూరి హరిబాబు, సొసైటీ చైర్ పర్సన్ వల్లే శ్రీనివాస్, ఎంపీఓ సునీల్ కుమార్ రాజ్, ఇన్చార్జి ఎంఈఓ వెంకట్రామ్, ఏటీఎం రమాదేవి, ఎపిఓ సునీత, సర్పంచులు దాసరి రమేష్, జాడి అచ్చితం, మాద్రాజు వెంకన్న, ఎలగందుల రాజు, ఆబోతు శ్రీలత, పిండి అనూష, బాదావత్ జ్యోతి, పెసరు రాణి, గొంది సుజాత, బానోతు సునీత, ధనసరి సురేష్, జాటోత్ వినోద్ కుమార్, కూస విమల, బోడ రమేష్, మూడు దేవేందర్, మీరన్న తోపాటు వివిధ శాఖల అధికారులు ప్రజా ప్రతినిధులు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

మంత్రి సీతక్క అధికారులు, సర్పంచ్ లతో వీడియో కాన్ఫరెన్స్

అక్టోబర్ 2న ప్రతి గ్రామపంచాయతీలో తప్పనిసరిగా గ్రామసభ నిర్వహించాలి.
వికసిత్ గ్రామపంచాయతీ ప్లానింగ్ ప్రాసెస్‌తో గ్రామాల సమగ్ర అభివృద్ధి

పర్వతగిరి , సెప్టెంబర్ 30
(వుదయం విలేకరి):

తెలంగాణ రాష్ట్ర పంచాయతీరాజ్ గ్రామీణ అభివృద్ధి శాఖ ఆధ్వర్యంలో బుధవారం నిర్వహించిన జూమ్ సమావేశంలో వికసిత్ గ్రామపంచాయతీ ప్లానింగ్ ప్రాసెస్, వీబీజీ రాంజీ పథకం తోపాటు గ్రామీణ ప్రాంతాల్లో ఉపాధి కల్పనపై నిర్వహించిన జూమ్ సమావేశంలో మహాదేవపూర్ ఎంపీడీవో మాలోత్ శంకర్ నాయక్ తో పాటు గ్రామాల సర్పంచ్లు కార్యదర్శులు పాల్గొన్నారు. ఈ సమావేశంలో రాష్ట్ర పంచాయతీరాజ్ గ్రామీణ అభివృద్ధి శాఖ మంత్రి సీతక్క మాట్లాడుతూ, ప్రతి గ్రామపంచాయతీలో గ్రామ అవసరాలకు అనుగుణంగా వికసిత్ గ్రామపంచాయతీ ప్లానింగ్ ప్రాసెస్ కింద నూతన అభివృద్ధి పనులను గుర్తించాలని సూచించారు. .అక్టోబర్ 2న గాంధీ జయంతిని పురస్కరించుకొని ప్రతి గ్రామపంచాయతీలో తప్పనిసరిగా గ్రామసభ నిర్వహించాలని మంత్రి సూచించారు. గ్రామసభలో ప్రజల అవసరాలు, గ్రామ అభివృద్ధికి అవసరమైన పనులను గుర్తించి ప్రణాళికలు రూపొందించాలని తెలిపారు. గ్రామ పంచాయతీ ద్వారా దరఖాస్తులను మండల కార్యాలయానికి పంపించి అర్హులైన కూలీలకు జాబ్ కార్డులు జారీ చేయాలని

తెలిపారు.అదేవిధంగా 18 సంవత్సరాలు నిండిన యువతీ యువకులు ఉపాధి పనుల్లో పనిచేయడానికి సిద్ధంగా ఉంటే, వారి తల్లిదండ్రుల జాబ్ కార్డుల్లో పేర్లు చేర్చేందుకు దరఖాస్తులను స్వీకరించాలని సూచించారు.ప్రతి సర్పంచ్ గ్రామ అభివృద్ధికి అంకితభావంతో పనిచేయాలని మంత్రి కోరారు.గత జూన్ నెలలో ఉపాధి హామీ పథకం కింద పనిచేసిన కూలీలకు సంబంధించి కొన్ని రోజుల వేతనాలు పెండింగ్‌లో ఉన్నాయని సమావేశంలో అధికారులు తెలిపారు. పెండింగ్ వేతనాలను త్వరగా విడుదల చేసేందుకు కేంద్ర ప్రభుత్వంతో సంప్రదింపులు జరుపుతున్నామని పేర్కొన్నారు.ఈ జూమ్ జలసిరి పనులు వేగవంతం చేయాలిఅధికారులు, సర్పంచులతో మంత్రి సీతక్క వీడియో కాన్ఫరెన్స్ వర్షగిరి సెప్టెంబర్ 30: గ్రామీణ ప్రాంతాల్లో నీటి సంరక్షణకు చేపడుతున్న జలసిరి కార్యక్రమం పనులను ప్రణాళికాబద్ధంగా చేపట్టి నిర్దేశిత గడువులో పూర్తి చేయాలని పంచాయతీరాజ్ ,గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి దనసరి అనసూయ సీతక్క అధికారులను ఆదేశించారు. జలసిరి కార్యక్రమం అమలుపై అధికారులు, సర్పంచులతో రాష్ట్రస్థాయి వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు.ఈసందర్భంగా నీటి నిల్వసామర్థ్యం పెంపు, చెరువులు, కుంటలు, ఫామ్‌పాండ్లు, ఇతర నీటి పనరుల అభివృద్ధి పనుల పురోగతిని సమీక్షించారు. అక్టోబర్ 2న గ్రామ సభలు అక్టోబర్ 2న అన్ని గ్రామాల్లో గ్రామసభలు నిర్వహించి VBG RAM Gలో గుర్తించిన పనులపై తీర్మానాలు చేయాలని మంత్రి సూచించారు.

గ్రామ అవసరాలకు అనుగుణంగా నీటి సంరక్షణ పనులను ఎంపిక చేసి సమర్థవంతంగా అమలు చేయాలని తెలిపారు. వీడియో కాన్ఫరెన్స్‌లో ఎంపీడీవో శంకర్ నాయక్, ఏపీవో, ఈసీ,సర్పంచులు,పంచాయతీ కార్యదర్శులు, ఫీల్డ్ అసిస్టెంట్లు వీబీజీ రాంజీ సిబ్బంది పాల్గొన్నారు.

జర్నలిస్టుల హక్కుల కోసం దేశవ్యాప్త నిరసనలు

.అక్టోబర్ 2న మహబూబాబాద్‌లో టీయూడబ్ల్యూజే (ఐజేయూ) ఆధ్వర్యంలో ధర్నా
.పెద్దవంగర జర్నలిస్టులు తరలిరావాలి .ప్రెస్‌క్లబ్ అధ్యక్షుడు దుర్గోజు రాజశేఖర్

పెద్దవంగర, సెప్టెంబర్ 30
(వుదయం ప్రతినిధి):



జర్నలిస్టుల హక్కులు, సంక్షేమం, రక్షణ కోసం ఇండియన్ జర్నలిస్ట్స్ యూనియన్ (ఐజేయూ) పిలుపు మేరకు అక్టోబర్ 2న దేశవ్యాప్తంగా 'డిమాండ్స్ డే' నిర్వహించనున్నట్లు టీయూడబ్ల్యూజే (ఐజేయూ) నాయకులు తెలిపారు. జర్నలిస్టుల సమస్యలను ప్రభుత్వాల దృష్టికి తీసుకెళ్లేందుకు దేశవ్యాప్తంగా నిరసన కార్యక్రమాలు చేపడుతున్నట్లు పేర్కొన్నారు. బెంగళూరులో జరిగిన ఐజేయూ జాతీయ కార్యవర్గ సమావేశంలో తీసుకున్న నిర్ణయం మేరకు గాంధీ జయంతి రోజైన అక్టోబర్ 2న ఉదయం 10 గంటలకు మహబూబాబాద్ జిల్లా కేంద్రంలోని గాంధీ విగ్రహం వద్ద టీయూడబ్ల్యూజే (ఐజేయూ) ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించనున్నట్లు తెలిపారు. అనంతరం జర్నలిస్టుల డిమాండ్లతో కూడిన వినతిపత్రాలను జిల్లా కలెక్టర్, ఎంపీ, ఎమ్మెల్యేలకు అందజేయనున్నట్లు వెల్లడించారు. జర్నలిస్టుల వృత్తి భద్రత, హక్కుల పరిరక్షణకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు తగిన చర్యలు తీసుకోవాలని నాయకులు డిమాండ్ చేశారు. విధి నిర్వహణలో జర్నలిస్టులపై దాడులు, వేధింపులు జరగకుండా ప్రత్యేక రక్షణ చట్టాన్ని తీసుకురావాలని డిమాండ్ చేశారు.అదేవిధంగా గతంలో రద్దు చేసిన జర్నలిస్టుల హక్కులకు సంబంధించిన చట్టాలను పునరుద్ధరించాలని, జర్నలిస్టుల సంక్షేమానికి సమగ్ర విధానం రూపొందించాలని కోరారు. అర్హులైన జర్నలిస్టులకు ఇళ్ల స్థలాలు కేటాయించడంతో పాటు జర్నలిస్టుల సంక్షేమం, ఆరోగ్యం, భద్రత, సామాజిక భద్రతకు ప్రభుత్వం ప్రత్యేక చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు.టీయూడబ్ల్యూజే (ఐజేయూ) రాష్ట్ర అధ్యక్షుడు కె. విరాహత్ అలీ, ప్రధాన కార్యదర్శి కె. రాంనారాయణ రాష్ట్రంలోని అన్ని జిల్లాల్లో డిమాండ్స్ డే కార్యక్రమాలను విజయవంతం చేయాలని పిలుపునిచ్చినట్లు తెలిపారు. మహబూబాబాద్ జిల్లా కేంద్రంలో నిర్వహించే ధర్నాను టీయూడబ్ల్యూజే (ఐజేయూ) జిల్లా అధ్యక్షుడు చిత్తలూరి శ్రీనివాస్ ఆధ్వర్యంలో నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు.

జర్నలిస్టుల హక్కుల సాధన కోసం నిర్వహిస్తున్న ఈ నిరసన కార్యక్రమానికి పెద్దవంగర మండలంలోని జర్నలిస్టులు పెద్ద సంఖ్యలో తరలివచ్చి విజయవంతం చేయాలని పెద్దవంగర ప్రెస్‌క్లబ్ అధ్యక్షుడు దుర్గోజు రాజశేఖర్ పిలుపునిచ్చారు.

ఆయిల్‌ఫామ్ రైతుల నర్సంపేట మండల కమిటీ అధ్యక్షుడిగా బండారి రమేష్

నర్సంపేట వుదయం ప్రతినిధి
సెప్టెంబర్ 30.

నర్సంపేట మండల ఆయిల్‌ఫామ్ రైతుల కమిటీని బుధవారం నర్సంపేట రైతు వేదికలో జరిగిన సమావేశంలో ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఆయిల్‌ఫామ్ రైతుల సమస్యలు, అభివృద్ధి అంశాలపై చర్చించేందుకు నిర్వహించిన ఈ సమావేశానికి జిల్లా అధ్యక్షుడు నంద్యాల కృష్ణారెడ్డితో పాటు జిల్లా కార్యవర్గ సభ్యులు ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. రైతుల సమక్షంలో జరిగిన ఎన్నికల్లో నర్సంపేట మండల కమిటీ అధ్యక్షుడిగా బండారి రమేష్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ప్రధాన కార్యదర్శిగా తుమ్మ శ్యాంసుందర్, ఉపాధ్యక్షులుగా పోతు శంకర్, మోతె గోదాదేవి, సహాయ కార్యదర్శిగా పోతు నవీన్, కోశాధికారిగా వడ్లకొండ రవి కిరణ్ ఎన్నికయ్యారు. కార్యవర్గ సభ్యులుగా గజ్జి వెంకటేశ్వర్లు, మందడపు అప్పారావు, చుండు వెంకటేశ్వర్లు ఎన్నికయ్యారు. నూతన కమిటీ అధ్వర్యంలో ఆయిల్‌ఫామ్ రైతుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని నాయకులు తెలిపారు. ఈ సమావేశానికి నర్సంపేట మండలంలోని సుమారు 100 మంది ఆయిల్‌ఫామ్ రైతులు హాజరై నూతన కమిటీ ఎన్నికను విజయవంతం చేశారు.

తెలంగాణ ఉద్యమకారుడు చుంచు రవి మృతి

హసన్ పర్తి, సెప్టెంబర్ 30
(వుదయం ప్రతినిధి):

తెలంగాణ ఉద్యమకారుడు, దేవన్న పేట గ్రామ మాజీ సర్పంచ్ చుంచు రవిందర్ మృతి చెందారు. చుంచు రవి స్వగ్రామం హన్మకొండ జిల్లా, హసన్ పర్తి మండలం, దేవన్నపేట గ్రామం, దీంతో విషాద ఛాయలు అలుముకున్నాయి.ఆయన మృతి పట్ల గ్రామస్తులు, తెలంగాణ ఉద్యమ కారులు, పలువురు నాయకులు సంతాపం వ్యక్తం చేశారు. గ్రామ అభివృద్ధిలో ఆయన చేసిన కృషిని గుర్తు చేసుకొని స్మరించుకున్నారు. ప్రత్యేక తెలంగాణ కోసం ఉద్యమ సమయంలో ఆయన పోరాడిన తీరును తలుచుకుంటూ ఉద్యమ కారులు కన్నీరు పెట్టుకున్నారు. చుంచు రవన్న ఆత్మకు శాంతి చేకూరాలని భగవంతుడిని ప్రార్థిస్తూ, ఆయన కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు.

విద్యార్థుల యూనిఫాం నాణ్యత తనిఖీ

తొర్రూరు సెప్టెంబర్.30
(వుదయం ప్రతినిధి):

బుధవారం తొర్రూరు మున్సిపాలిటీ పరిధిలో మెప్మా ఆధ్వర్యంలో స్వయం సహాయక సంఘాల మహిళలు కుట్టిన పాఠశాల యూనిఫామ్‌లను మెప్మా స్టేట్ కోఆర్డినేటర్స్ పద్మ, రష్మి పరిశీలించారు. బుధవారం నిర్వహించిన ఈ పరిశీలనలో భాగంగా పలు పాఠశాలలు, విద్యాసంస్థలను సందర్శించి, యూనిఫామ్‌ల నాణ్యత,
తయారీ తీరును పరిశీలించారు. ఈ సందర్భంగా తోర్రూరు మున్సిపాలిటీ పరిధిలో కే.జి.బి.వి. మరియు యమ్. పి.పి.యస్. స్కూళ్లను సందర్శించి విద్యార్థినులకు అందిస్తున్న యూనిఫామ్‌లను పరిశీలించారు. మహిళా సంఘాలకు కుట్టు పనుల ద్వారా ఉపాధి కల్పించడంతో పాటు వారి ఆర్థిక స్వావలంబనకు మెప్మా చేపడుతున్న కార్యక్రమాలపై అధికారులు వివరించారు. మహిళా సంఘాల సభ్యులు ఇలాంటి అవకాశాలను సద్వినియోగం చేసుకుని మరింత నైపుణ్యాన్ని పెంపొందించుకోవాలని సూచించారు.

ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ శ్యాంసుందర్, మెప్మా డి.యమ్.సి. విజయ, ఆర్.పి.లు మరియు యస్. హెచ్.జి. మెంబర్స్ పాల్గొన్నారు.

వడ్డేపల్లి దళిత సంక్షేమ కమిటీ ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరం

ముఖ్యఅతిథిగా ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి

హనుమకొండ టౌన్, సెప్టెంబర్ 30
(వుదయం ప్రతినిధి) :



అక్టోబర్ 2వ తేదీ శుక్రవారం గాంధీ జయంతిని పురస్కరించుకొని ఫాదర్ కొలంబో ఇన్స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్ మెడికేర్ జనరల్ హాస్పిటల్ వారి సౌజన్యంతో, వడ్డేపల్లి దళిత సంక్షేమ ఆధ్వర్యంలో ఉచిత మెగా వైద్య శిబిరం,రక్తదాన శిబిరం నిర్వహించడం జరుగుతుందని దళిత వెల్ఫర్ సంక్షేమ కమిటీ అధ్యక్షులు తాళ్లపల్లి రవీందర్ (జెకే)తెలిపారు.

బుధవారం సాయంత్రం ఎన్జీవోస్ కాలనీలోని రోజ్ గార్డెన్ లో రవీందర్ మాట్లాడారు. ప్రజలు ఉచిత వైద్య శిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. వైద్య శిబిరానికి ముఖ్య అతిథిలుగా ఎంపీ కడియం కావ్య, ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి, ఎంజిఎచ్ డైరెక్టర్ ఫాదర్ జి. చినప్ప రెడ్డి హాజరై ప్రారంభిస్తారని చెప్పారు. వైద్య శిబిరంలో జనరల్ మెడిసిన్, జనరల్ సర్జన్, ఆర్థోపెడిక్, పీడియాట్రిక్, గైనకాలజీ, కంటి వైద్యులు, గుండె వైద్యులు, యూరాలజీ, పిల్లల వైద్యులు,నేఫ్రాలజీ,దంత వైద్యం, న్యూరో సర్జరీ, ఆప్తమాలజీ,పర్మనాలజీ, మెడికల్ గ్యాస్ట్రో, మానసిక వైద్యం, చర్మ వ్యాధులు, బిపి, షుగర్ పరీక్షలు, గుండె పరీక్షలు, కంటి పరీక్షలు నిర్వహించడం జరుగుతుందని తెలిపారు. ఉచిత వైద్య శిబిరానికి ముఖ్యఅతిథిగాలుగా వరంగల్ ఎంపీ డాక్టర్ కడియం కావ్య, పశ్చిమ నియోజకవర్గం శాసనసభ్యులు నాయిని రాజేందర్ రెడ్డి , ఎంజిఎచ్ డైరెక్టర్ ఫాదర్ జి. చిన్నపరెడ్డి హాజరై ప్రారంభిస్తారని తెలిపారు. సమావేశంలో వడ్డేపల్లి దళిత సంక్షేమ కమిటీ కార్యదర్శి ఆవుల రవీందర్, మండల అసోసియేట్ అధ్యక్షుడు నేతుల స్వామి, పీఆర్‌టీయూ ప్రాథమిక సభ్యులు పాల్గొని రాందెడ్డిని శాలువాతో సత్కరించి అభినందనలు తెలిపారు.దీర్ఘకాలం విద్యారంగానికి అందించిన సేవలను వారు కొనియాడారు. పదవీ విరమణ అనంతరం ఆయన ఆయురారోగ్యాలతో సుఖసంతోషాలతో జీవించాలని ఆకాంక్షించారు.

ర్శి టి ప్రవీణ్ కుమార్, కోశాధికారి నల్ల ఆశీర్వాదం, ఎం. చేరాలు, టి సుధాకర్ టి శ్రీనివాస్ ఎన్ ప్రవీణ్ అర్గనైజర్లు టి సుధాకర్, అడ్వైజర్స్ టీ ప్రభాకర్, దళిత సంక్షేమ కమిటీ మహిళా విభాగం అధ్యక్షురాలు టి గ్రేసమ్మ

ఉపాధ్యక్షురాలు ఇ.కవిత, సహా కార్యదర్శి ఈ పద్మ టి మేరి ఎం కళావతి, దళిత సంక్షేమ కమిటీ యువజన విభాగం కోశాధికా రెడ్డి రాజకుమార్, ఉపాధ్యక్షులు ఆర్ శంకర్ సహకార దర్శులు బి రాజ్ కుమార్ అడ్వైజర్స్ ఈ నరేష్ పబ్లిసిటీ సెక్రెటరీ సాంప్రూట్, ఈసీ మెంబర్స్ రాకేష్, వెల్నేస్ కోచ్ వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

టీకాల కోల్డ్ చైన్, ఓపెన్ వయల్ పాలసీ పక్కాగా అమలు చేయాలి

– డీఎంహెచ్ఓ డా. బి. రాజా రెడ్డి
వ్యాక్సినేషన్ సెషన్‌ను తనిఖీ చేసిన జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి

నర్సంపేట, సెప్టెంబర్ 30
(వుదయం ప్రతినిధి) :

టీకాల నిల్వలో కోల్డ్ చైన్ వ్యవస్థను నిరంతరం సక్రమంగా నిర్వహించాలని, ఓపెన్ వయల్ పాలసీని తప్పని సరిగా పాటించాలని వరంగల్ జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి (డీఎంహెచ్ఓ) డా. బి. రాజా రెడ్డి ఆదేశించారు. బుధవారం రోజున డీఐఓ/డిప్యూటీ డీఎంహెచ్ఓ డా. ఐ. ప్రకాష్‌తో కలిసి బానోజిపేట్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలోని నర్సంపేట్ 3 ఆయుష్మాన్ ఆరోగ్య మందిర్ (AAM)లో నిర్వహిస్తున్న వ్యాక్సినేషన్ సెషన్‌ను ఆయన ఆకస్మికంగా పర్యవేక్షించారు. ఈ సందర్భంగా కేంద్రంలోని టీకాల కోల్డ్ చైన్ నిర్వహణ, వ్యాక్సిన్‌ల లభ్యత, సంబంధిత రికార్డులు మరియు రిజిస్టర్లను డీఎంహెచ్ఓ క్షుణ్ణంగా పరిశీలించి, సిబ్బందికి పలు కీలక సూచనలు చేశారు. టీకా వయల్ తెరిచిన వెంటనే దానిపై తెరిచిన తేదీ, సమయాన్ని తప్పనిసరిగా రాయాలి. అర్హులైన పిల్లలందరికీ సమయానికి టీకాలు అందేలా ఆశా కార్యకర్తలు 'డ్యూ లిస్ట్' ప్రకారం పిల్లలను వ్యాక్సినేషన్ కేంద్రానికి తీసుకురావాలి. వ్యాక్సినేషన్ సెషన్ సైట్‌కు అవసరమైన అన్ని రకాల టీకాలను ముందుగానే సిద్ధం చేసుకోవాలి.ఆన్‌లైన్ నమోదు: వ్యాక్సినేషన్ వివరాలను

సర్పంచ్ నిర్లక్ష్య వైఖరిపై పంచాయతీ కార్యదర్శికి ఫిర్యాదు

జన్నారం,
సెప్టెంబర్ 30 (వుదయం విలేఖరి)

జన్నారం మండలంలోని ఇంధన్‌పల్లి గ్రామ పంచాయతీ పరిధిలో సర్పంచ్ తీవ్ర బాధ్యతారాహిత్యంతో వ్యవహరిస్తున్నారని, గ్రామ అభివృద్ధిని, ప్రజల ప్రాథమిక అవసరాలను పూర్తిగా గాలికొదిలేశారని నిరసిస్తూ గ్రామ పౌరులు, ప్రజాప్రతినిధులు పంచాయతీ కార్యదర్శికి రాతపూర్వక ఫిర్యాదు లేఖను సమర్పించారు.ఈ సందర్భంగా గ్రామస్తులు మాట్లాడుతూ ఓట్ల సమయంలో అనేక హామీలు ఇచ్చి గెలిచిన సర్పంచ్, అధికారంలోకి వచ్చాక తీవ్ర పక్షపాత వైఖరి ప్రదర్శిస్తున్నారని, చివరికి తనను నమ్మి గెలిపించిన సొంత సామాజిక వర్గం ప్రజలను, తండా సమస్యలను కూడా పూర్తిగా విస్మరించి కేవలం తన స్వార్థ అవసరాలకే ప్రాధాన్యత ఇస్తున్నారని తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు.గ్రామంలో వీధి దీపాలు లేక చీకట్లు అలుముకోవడం, తాగునీటి ఎద్దడి, చెత్త సేకరణ, డ్రైనేజీల శుభ్రత నిలిచిపోవడం, దోమల నివారణకు ఫాగింగ్, స్ప్రేయింగ్ చేయకపోవడంతో రోగాలు వ్యాపించే ప్రమాదం నెలకొందని వారు ఆవేదన వ్యక్తం చేశారు.పదవి అనేది ఐదేళ్ల బాధ్యత మాత్రమేనని, పెత్తనం చెలాయించడానికి కాదని సర్పంచ్ కు స్పష్టం చేశారు. వినతి పత్రంలోని సమస్యలను తక్షణమే పరిష్కరించకపోతే గ్రామ పంచాయతీ కార్యాలయాన్ని ముట్టడిస్తామని, నడిరోడ్డుపై నిలదీస్తామని హెచ్చరించారు

కలమడుగులో విద్యార్థులకు స్క్రీనింగ్ పరీక్షలు

జన్నారం,
సెప్టెంబర్ 30 (వుదయం విలేఖరి)

మండలంలోని కలమడుగు జడ్పీహెచ్ఎస్ పాఠశాలలో బుధవారం రోజున ప్రభుత్వం ద్వారా ఆర్బీఎస్కే (రాష్ట్రీయ బాల స్వాస్థ్య కార్యక్రమ్) ఆధ్వర్యంలో స్క్రీనింగ్ పరీక్షలు మరియు కంటి పరీక్షలు నిర్వహించారు.ఈ సందర్భంగా ఆర్బీఎస్కే మెడికల్ ఆఫీసర్ డా.గౌరీ శంకర్ మాట్లాడుతూ విద్యార్థులందరికీ స్క్రీనింగ్ టెస్ట్ నిర్వహించి, అవసరమైన మెడిసిన్స్ ఉచితంగా అందిస్తామని తెలిపారు. దాదాపుగా 156 మందికి టెస్ట్ లు నిర్వహించారు.కంటి పరీక్షలు నిర్వహించి, అవసరమైన మెడిసిన్ మరియు కంటి అద్దాలు అందజేశారు .ఈ సందర్భంగా పాఠశాల హెచ్ఎం కట్ట రాజమౌళి మాట్లాడుతూ ఇలాంటి కార్యక్రమాలు విద్యార్థుల ఆరోగ్యానికి ఎంతో ఉపయోగపడతాయన్నారు. ఆర్బీఎస్కే వారు పాఠశాలల్లో వచ్చి అన్ని రకాల స్క్రీనింగ్ పరీక్షలు నిర్వహించి మందులు ఇవ్వడం విద్యార్థులకు ఎంతో మేలు అని అన్నారు.156 మంది విద్యార్థులకు స్క్రీనింగ్ టెస్ట్ నిర్వహించి మెడిసిన్స్ అందించారు.ఈ కార్యక్రమంలో ఆర్బీఎస్కే సిబ్బంది కీర్తన, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు

అంత్యక్రియలకు పీసీఆర్ ఫౌండేషన్ ఆర్థిక సహాయం

జన్నారం,
సెప్టెంబర్ 30 (వుదయం విలేఖరి)

జన్నారం మండలం పొనకల్ గ్రామ పంచాయతీ పరిధిలోని గాంధీనగర్ కు చెందిన మంతెన రవీందర్ గత కొంతకాలంగా అనారోగ్యంతో బాధ పడుతూ బుధవారం ఉదయం మృతి చెందారు.ఆయన కుటుంబ పరిస్థితిని తెలుసుకున్న పీసీఆర్ ఫౌండేషన్ వ్యవస్థాపకులు ముదుగు ప్రవీణ్ స్పందించి అంత్యక్రియల ఖర్చుల కోసం ఐదువేల రూపాయలను ఆర్థిక సహాయంగా అందించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆపదలో ఉన్న కుటుంబాలకు అండగా నిలవడమే పీసీఆర్ ఫౌండేషన్ లక్ష్యమని తెలిపారు. ఆర్థిక ఇబ్బందుల్లో ఉన్న కుటుంబాలకు తమ వంతు సహాయ సహకారాలు అందిస్తామని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో నోముల రాజ్ కుమార్, కొత్త శ్రీనివాస్, రాజేష్ తదితరులు పాల్గొన్నారు.

సర్పంచ్ నిర్లక్ష్య వైఖరిపై పంచాయతీ కార్యదర్శికి ఫిర్యాదు

జన్నారం,
సెప్టెంబర్ 30 (వుదయం విలేఖరి)

జన్నారం మండలంలోని ఇంధన్‌పల్లి గ్రామ పంచాయతీ పరిధిలో సర్పంచ్ తీవ్ర బాధ్యతారాహిత్యంతో వ్యవహరిస్తున్నారని, గ్రామ అభివృద్ధిని, ప్రజల ప్రాథమిక అవసరాలను పూర్తిగా గాలికొదిలేశారని నిరసిస్తూ గ్రామ పౌరులు, ప్రజాప్రతినిధులు పంచాయతీ కార్యదర్శి ప్రతిభ, ఉప సర్పంచ్ వినయ్ లకు రాతపూర్వకంగా ఫిర్యాదు లేఖను సమర్పించారు.ఈ సందర్భంగా గ్రామస్తులు మాట్లాడుతూ ఓట్ల సమయంలో అనేక హామీలు ఇచ్చి గెలిచిన సర్పంచ్, అధికారంలోకి వచ్చాక తీవ్ర పక్షపాత వైఖరి ప్రదర్శిస్తున్నారని, చివరికి తనను నమ్మి గెలిపించిన సొంత సామాజిక వర్గం ప్రజలను, తండా సమస్యలను కూడా పూర్తిగా విస్మరించి కేవలం తన స్వార్థ అవసరాలకే ప్రాధాన్యత ఇస్తున్నారని తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. గ్రామంలో వీధి దీపాలు లేక చీకట్లు అలుముకోవడం, తాగునీటి ఎద్దడి, చెత్త సేకరణ, డ్రైనేజీల శుభ్రత నిలిచిపోవడం, దోమల నివారణకు ఫాగింగ్, స్ప్రేయింగ్ చేయకపోవడంతో రోగాలు వ్యాపించే ప్రమాదం నెలకొందని వారు ఆవేదన వ్యక్తం చేశారు.పదవి అనేది ఐదేళ్ల బాధ్యత మాత్రమేనని, పెత్తనం చెలాయించడానికి కాదని సర్పంచ్ కు స్పష్టం చేశారు. వినతి పత్రంలోని సమస్యలను తక్షణమే పరిష్కరించకపోతే గ్రామ పంచాయతీ కార్యాలయాన్ని ముట్టడిస్తామని, నడిరోడ్డుపై నిలదీస్తామని హెచ్చరించారు

జన్నారంలో సంపూర్ణ బంద్.. టైగర్ జోన్ రద్దుకై వ్యాపారుల మద్దతు

జన్నారం,
సెప్టెంబర్ 30 (వుదయం విలేఖరి

)జన్నారం డివిజన్ లోని కవ్వాల్ టైగర్ జోన్ రద్దు చేయాలని,ఈకో సెన్సిటివ్ జోన్ ఎత్తివేయాలని కోరుతూ సామాజిక పోరాట సమితి కన్వీనర్ శ్రీరాముల భూమాచారి ఇచ్చిన పిలుపు మేరకు జన్నారం మండల కేంద్రంలో బుధవారం పలు వ్యాపార సంస్థలు సంపూర్ణ బంద్ నిర్వహించాయి.గత 39 రోజులుగా టైగర్ జోన్ ఎత్తివేయాలంటూ పోరాడుతున్న భూమాచారికి మద్దతుగా వర్తక, వ్యాపార సంస్థలు, హోటళ్లు, ఫెర్టిలైజర్ షాపులు, ఇతర వ్యాపార సంస్థలు, పాన్ షాపులు,చిరు వ్యాపారులు స్వచ్ఛందంగా బంద్ పాటించారు. దీంతో మండల కేంద్రంలోని ప్రధాన వ్యాపార ప్రాంతాలు నిర్మానుష్యంగా వెలవెలబోతూ కనిపించాయి.కవ్వాల్ టైగర్ జోన్ ను రద్దు చేయాలని స్థానిక ప్రజలతో పాటు తాపీ మేస్త్రీల సంఘం తమ పనులను నిలిపివేసి మద్దతు ప్రకటించింది. టైగర్ జోన్ సమస్యను ప్రభుత్వం పరిష్కరించాలని బంద్ సందర్భంగా స్థానికులు డిమాండ్ చేశారు.ఇప్పటికైనా అధికారులు స్పందించి జన్నారం మండలాన్ని టైగర్ జోన్ నుండి తొలగించి అభివృద్ధి దిశగా మండలాన్ని అభివృద్ధి పరచాలని కోరారు.జన్నారం మండలాన్ని టైగర్ జోన్ గా ప్రకటించడంతో అన్ని రకాలుగా ఎంతో వెనకబడిపోయిందని పలువురు మండల వాసులు ఆవేదన వ్యక్తం చేశారు.

ముదిమడుగులో అటవీ భూమి స్వాధీనం: ట్రెంచ్ వర్క్ చేపట్టిన అధికారులు

జన్నారం,
సెప్టెంబర్ 30 (వుదయం విలేఖరి)

జన్నారం మండలం ఇందనపల్లి రేంజ్ పరిధిలోని కలమడుగు బీట్ ముదిమడుగు గ్రామంలో ఆక్రమణకు గురైన అటవీ భూమిని అటవీ శాఖ అధికారులు తిరిగి స్వాధీనం చేసుకున్నారు.బుధవారం రోజున ఇంధనపల్లి రేంజ్ అధికారి బాబా ఖాదర్ వలీ ఆధ్వర్యంలో జేసీబీ సహాయంతో ట్రెంచ్ వర్క్ చేపట్టి సరిహద్దులను నిర్ధారించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అటవీ భూమిని అక్రమంగా ఆక్రమించుకున్న వారిపై చట్ట పరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.ఈ కార్యక్రమంలో సెక్షన్, బీట్, అధికారులు, అటవీ సిబ్బంది ఉన్నారు.

అల్లం వారి కుంటపై విచారణకు ఆదేశించిన జేసీ వి.రాములు

జన్నారం,
సెప్టెంబర్ 30 (వుదయం విలేఖరి)

జన్నారం మండలంలోని రేండ్లగూడ గ్రామ శివారులో సర్వే నెంబర్ 160, 161లో ఉన్న 24 ఎకరాల అల్లం వారి కుంట కబ్జాకు గురైందని గత నెల రోజులుగా పోరాడడమే కాకుండా, వారం రోజులుగా రిలే నిరాహార దీక్షలు చేపట్టడం, ప్రధాన రహదారిపై వంటావార్పు కార్యక్రమం నిర్వహించి రాస్తారోకో నిర్వహించారు.సామాజిక పోరాట సమితి నాయకుడు సముద్రాల శంకర్, సీపీఐ మండల కార్యదర్శి దాసరి తిరుపతి, ఆకుల మధు, బాల్త సుధాకర్, అల్లం సురేష్ లు, వేయికండ్ల రవి ఈ నెల 28న మంచిర్యాల జిల్లా కలెక్టరేట్ లో నిర్వహించిన ప్రజావాణిలో కలెక్టర్ కుమార్ దీపక్ కు వినతిపత్రం అందజేశారు.దీంతో కలెక్టర్ కుమార్ దీపక్ జాయింట్ కలెక్టర్ వి.రాములను అట్టి కుంటపై విచారణ చేపట్టాలని ఆదేశించగా బుధవారం రోజున జన్నారం మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయంలో రేండ్లగూడ గ్రామస్తులతో సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా జాయింట్ కలెక్టర్ వి.రాములు మాట్లాడుతూ నీటిపారుదల శాఖ అధికారులను, రెవెన్యూ అధికారులను సంయుక్తంగా కుంటపై సర్వే చేసి నివేదిక అందజేయాలని, రెండు వారాల్లో పూర్తి నివేదిక అందజేస్తామని తెలిపారు.ఈ కార్యక్రమంలో తహసీల్దార్ బక్కయ్య, ఇరిగేషన్ డిపార్ట్మెంట్ ఏఈ శ్రావణ్, డిప్యూటీ తహసీల్దార్ మస్కూర్ అలీ, గిర్దవర్ వెంకటేశం తదితరులు పాల్గొన్నారు.

పోషకాహారంతోనే ఆరోగ్యవంతమైన సమాజం

సర్పంచ్ నల్లపాటి ప్రమీల శ్రీనివాస్
మునగాల,
సెప్టెంబర్ 30 (వుదయం):–

9వ జాతీయ పోషణ మాసం కార్యక్రమాన్ని పురస్కరించుకుని మునగాల మండల కేంద్రంలో అంగన్‌వాడీ కేంద్రాల ఆధ్వర్యంలో బుధవారం వివిధ కార్యక్రమాలను నిర్వహించారు. ఈ కార్యక్రమానికి మునగాల గ్రామ సర్పంచ్ నల్లపాటి ప్రమీల శ్రీనివాస్ ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా గర్భిణులకు సామూహిక సీమంతాలు, చిన్నారులకు అన్నప్రాసన కార్యక్రమాలను నిర్వహించారు.ముఖ్యఅతిథి నల్లపాటి ప్రమీల శ్రీనివాస్ మాట్లాడుతూ గర్భిణులు, బాలింతలు, చిన్నారుల ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని సూచించారు. గర్భిణులు పోషక విలువలు కలిగిన ఆహారం తీసుకోవడంతో పాటు క్రమం తప్పకుండా వైద్య పరీక్షలు చేయించుకోవాలని అన్నారు. బిడ్డ పుట్టిన వెంటనే తల్లిపాలు పట్టించడం, ఆరు నెలల తర్వాత వయసుకు అనుగుణంగా పోషకాహారం అందించడం ద్వారా చిన్నారుల ఆరోగ్యకరమైన ఎదుగుదలకు దోహదపడుతుందని తెలిపారు.అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా అందిస్తున్న పోషకాహారాన్ని గర్భిణులు, బాలింతలు,చిన్నారులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. పోషకాహార లోపం నివారణ, పరిశుభ్రత, ఆరోగ్య సంరక్షణపై ప్రజల్లో మరింత అవగాహన కల్పించాల్సిన అవసరం ఉందన్నారు.ఈ కార్యక్రమంలో సూపర్‌వైజర్ శ్రీనివాస్, ఎంపీడీఓ రమేష్ దయానంద్,తహసీల్దార్ సరిత,సీడీపీఓ సత్యనారాయణ,అంగన్‌వాడీ సిబ్బంది, ఏఎన్ఎంలు, ఆశా కార్యకర్తలు, గర్భిణులు, బాలింతలు పాల్గొన్నారు. అంగన్‌వాడీ సిబ్బంది జి. సరోజారాణి, టి. మాధవి, కె. కమల, డి. శ్రీదేవి తదితరులు పాల్గొన్నారు.

సేవా రంగంలో మరో బాధ్యత.. డాక్టర్ దశరథ్ కు గౌరవం

ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ జిల్లా డైరెక్టర్‌గా నియామకం
కోదాడ
సెప్టెంబర్ 30(వుదయం):

కోదాడ ప్రభుత్వ ఏరియా ఆసుపత్రి సూపరింటెండెంట్, సీనియర్ సర్జన్ డాక్టర్ దశరథ్ ఎంఎస్ ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ జిల్లా డైరెక్టర్‌గా నియమితులయ్యారు. ఈ మేరకు రెడ్‌క్రాస్ ఉన్నతాధికారులు ఉత్తర్వులు జారీ చేశారు. ఆయన నియామకంపై వైద్యులు, రెడ్‌క్రాస్ సభ్యులు, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు, తెలంగాణ ఉద్యమకారులు హర్షం వ్యక్తం చేస్తూ శుభాకాంక్షలు తెలిపారు. తెలంగాణ ఉద్యమ సమయంలో చురుకైన పాత్ర పోషించిన డాక్టర్ దశరథ్.. వైద్య రంగంలో సీనియర్ సర్జన్‌గా విశేష అనుభవం పొందారు. ప్రభుత్వ వైద్య సేవలతో పాటు సామాజిక సేవా కార్యక్రమాల్లోనూ ముందుంటున్నారు. కోదాడ ఏరియా ఆసుపత్రి సూపరింటెండెంట్‌గా బాధ్యతలు చేపట్టిన ప్పటి నుంచి మౌలిక వసతుల కల్పన, పారిశుద్ధ్యం, రోగులకు మెరుగైన వైద్య సేవలపై ప్రత్యేక దృష్టి సారిస్తున్నారు. కరోనా విపత్కర సమయంలోనూ ప్రజలకు సేవలందించిన ఆయన.. నిరుపేదలకు ఉచిత వైద్యం, రక్తదాన శిబిరాలు, అవయవదానంపై అవగాహన కార్యక్రమాలు, గ్రామీణ ప్రాంతాల్లో ఉచిత వైద్య శిబిరాల నిర్వహణలో కీలకంగా వ్యవహరించారు.ఈ సందర్భంగా డాక్టర్ దశరథ్ ఎంఎస్ మాట్లాడుతూ తనపై నమ్మకంతో బాధ్యతలు అప్పగించిన రెడ్‌క్రాస్ సొసైటీకి కృతజ్ఞతలు తెలిపారు. కొత్త బాధ్యతలను సమర్థవంతంగా నిర్వహిస్తూ మరిన్ని సేవా కార్యక్రమాలు చేపట్టి ప్రజలకు చేరువగా పనిచేస్తానని అన్నారు.

అక్రమ అరెస్టులతో ఉద్యమాలను ఆపలేరు



మల్లు లక్ష్మిపై పోలీసుల దాడిని ఖండించాలి: ములకలపల్లి రాములు
కోదాడ
సెప్టెంబర్ 30 (వుదయం)

చీఫ్ ఎలక్షన్ కమిషనర్ జ్ఞానేష్ కుమార్ రాజీనామా చేయాలని డిమాండ్ చేస్తూ హైదరాబాద్‌లో అఖిలపక్షాల ఆధ్వర్యంలో నిర్వహించిన ర్యాలీలో నాయకులను అరెస్టు చేయడాన్ని సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు ములకలపల్లి రాములు ఖండించారు. మహిళా సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మల్లు లక్ష్మిని పోలీసులు ఈడ్చుకెళ్లడం దుర్మార్గమైన చర్య అన్నారు.
బుధవారం పట్టణంలోని జుట్టుకొండ బసవయ్య ఇంట్లో జరిగిన సీపీఎం పట్టణ కమిటీ సమావేశంలో ఆయన మాట్లాడుతూ శాంతియుతంగా ర్యాలీ నిర్వహిస్తున్న అఖిలపక్ష నాయకులపై పోలీసుల చర్యలు సరికాదన్నారు. నాయకులను అరెస్టు చేసినంత మాత్రాన ప్రజా ఉద్యమాలను ఆపలేరని పేర్కొన్నారు.సంబంధిత కార్యక్రమాలను వెంటనే నిలిపివేసి, చీఫ్ ఎలక్షన్ కమిషనర్ జ్ఞానేష్ కుమార్ రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు.
సమావేశంలో రైతు సంఘం రాష్ట్ర కమిటీ సభ్యులు మేదరమట్ల వెంకటేశ్వరరావు, సీపీఎం జిల్లా కమిటీ సభ్యులు ఎస్కే సైదా, సీఐటీయూ జిల్లా అధ్యక్షులు కోటగిరి వెంకటనారాయణ, సీనియర్ నాయకులు జుట్టుకొండ బసవయ్య, సీపీఎం పట్టణ కార్యదర్శి ఎం. ముత్యాలు తదితరులు పాల్గొన్నారు.

అంగన్వాడీ కేంద్రాల్లో పోషణ మాసం

గుమ్మడిదల,
సెప్టెంబర్ 30 (వుదయం): :

గుమ్మడిదల మండలంలోని నాగిరెడ్డిగూడెం గ్రామంలో బుధవారం అంగన్వాడీ కేంద్రంలో “మన అంగన్వాడీ-మన బాధ్యత” అనే థీమ్‌తో పోషణ మాసం కార్యక్రమాన్ని నిర్వహించారు. అంగన్వాడీ టీచర్ అనిత ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం జరిగింది. ఐసీడీఎస్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఈ కార్యక్రమంలో అంగన్వాడీ కేంద్రాల్లో చిన్నారులకు అన్నప్రాసన, అక్షరాభ్యాసం వంటి కార్యక్రమాలతో పాటు కేంద్రాల్లో అందించే పోషకాహారంపై అవగాహన కల్పించారు. గర్భిణులు, బాలింతల కోసం ప్రభుత్వం అందిస్తున్న ఆరోగ్య లక్ష్మి, ఒక పూట భోజనం పథకాలను సద్వినియోగం చేసుకోవాలని నాగిరెడ్డిగూడెం సర్పంచ్ గడ్డం లావణ్య గోవర్ధన్‌రెడ్డి తల్లులకు సూచించారు. ఈ సందర్భంగా అంగన్వాడీ టీచర్ అనిత, అంగన్వాడీ సహాయకురాలు స్వప్న కూరగాయలు, ఆకుకూరలతో బతుకమ్మను తయారు చేసి ప్రదర్శించారు. తక్కువ ఖర్చుతో ఎక్కువ పోషకాలు లభించే వివిధ రకాల ఆహార పదార్థాలను ప్రదర్శించి, వాటి ప్రయోజనాలను వివరించారు. అంగన్వాడీ కేంద్రాల్లో పోషకాహారం, చిన్నారుల ఆరోగ్యంపై తల్లిదండ్రులకు అవగాహన కల్పిస్తూ, పిల్లలకు అవసరమైన పోషకాహారం అందించాలని సూచించారు. చిన్నారుల్లో రక్తహీనత, తక్కువ బరువు వంటి సమస్యలను గుర్తించి, వారికి తగిన పోషకాహారం అందించడంతో పాటు అవసరమైన చర్యలు తీసుకోవాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో నాగిరెడ్డిగూడెం సర్పంచ్ గడ్డం లావణ్య గోవర్ధన్‌రెడ్డి, ఉపసర్పంచ్ గడ్డం విఠల్‌రెడ్డి, గ్రామ పెద్ద గడ్డం జంగారెడ్డి, వార్డు సభ్యులు జి. లక్ష్మి, జి. జ్యోతి, బి. మల్లేష్, కె. రాజు, వి. మంజుల, అంగన్వాడీ సిబ్బంది, గర్భిణులు, బాలింతలు, ప్రీస్కూల్ చిన్నారుల తల్లులు తదితరులు పాల్గొన్నారు.

100 పడకల ఆసుపత్రి మంజూరు బీఆర్ఎస్ హయాంలోనే: బొల్లం మల్లయ్య యాదవ్

జీవో 442, నిధుల మంజూరు ప్రభుత్వ రికార్డుల్లో ఉన్నాయి
కోదాడ
సెప్టెంబర్ 30(వుదయం)

కోదాడ పట్టణంలోని 30 పడకల ప్రభుత్వ ఆసుపత్రిని 100 పడకల ఆసుపత్రిగా అప్‌గ్రేడ్ చేయడానికి నిధులు మంజూరు చేసిన ఘనత బీఆర్ఎస్ ప్రభుత్వానిదేనని మాజీ ఎమ్మెల్యే బొల్లం మల్లయ్య యాదవ్ అన్నారు.బుధవారం ఆయన ప్రభుత్వాసుపత్రిని సందర్శించి, జీవో నంబర్ 442ను ప్రస్తావిస్తూ నిరసన తెలిపారు.
ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. తన ఎమ్మెల్యే పదవీకాలంలో అప్పటి ముఖ్యమంత్రి కేసీఆర్ సహకారంతో ఆసుపత్రిని 100 పడకలకు అప్‌గ్రేడ్ చేయించేందుకు రూ.26 కోట్ల నిధులు మంజూరు చేయించామని తెలిపారు. 2023 ఆగస్టు 9న జారీ చేసిన జీవో నంబర్ 442 ఇందుకు ఆధారమని పేర్కొన్నారు. బీఆర్ఎస్ ప్రభుత్వం మంజూరు చేసిన నిధులకు కాంగ్రెస్ ప్రభుత్వం శిలాఫలకాలు వేసుకుని తమ ఘనతగా ప్రచారం చేసుకుంటోందని ఆరోపించారు.
ఆసుపత్రి నిర్మాణ పనులు నెమ్మదిగా సాగుతున్నాయని, పనుల్లో జాప్యానికి కారణాలు వెల్లడించాలని డిమాండ్ చేశారు. అలాగే తన హయాంలో కోదాడ ప్రభుత్వాసుపత్రిలో కిడ్నీ రోగుల కోసం ఐదు పడకల డయాలసిస్ కేంద్రాన్ని ఏర్పాటు చేసి ఉచిత సేవలు అందించామని తెలిపారు. ప్రస్తుతం డయాలసిస్ సేవల పరిస్థితిపై ప్రభుత్వం దృష్టి సారించాలని కోరారు.
ఆసుపత్రి నిర్మాణానికి సంబంధించిన జీవో, నిధుల మంజూరు విషయంలో తాను చేసిన వ్యాఖ్యలు తప్పని నిరూపించాలని మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డికి బొల్లం మల్లయ్య యాదవ్ సవాల్ విసిరారు. ఆసుపత్రి పనులను త్వరిత గతిన పూర్తి చేసి ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించాలని డిమాండ్ చేశారు.

కవ్వాల్‌లో నేటి నుండి సఫారీ

జన్నారం,
సెప్టెంబర్ 30 (వుదయం విలేఖరి)

కవ్వాల్ టైగర్ రిజర్వు జన్నారం డివిజన్‌లో జంగిల్ సఫారీ సేవలు నేటి నుండి పునఃప్రారంభం కానున్నట్లు అటవీ డివిజనల్ అధికారి రామ్మోహన్ ఒక ప్రకటనలో తెలిపారు.వర్షాకాలం సందర్భంగా జూలై,ఆగస్టు, సెప్టెంబర్ మూడు నెలల వరకు తాత్కాలికంగా నిలిపివేసిన కవ్వాల్ టైగర్ రిజర్వు జంగిల్ సఫారీ సేవలను అక్టోబర్ 1 నుండి పునఃప్రారంభించనున్నట్లు తెలిపారు.వన్య ప్రాణుల సంరక్షణ, సఫారీ ఆవాసాల పరిరక్షణ మరియు పర్యాటకుల భద్రత దృష్ట్యా సఫారీ సేవలు తాత్కాలికంగా నిలిపివేయడం జరిగిందని, ప్రస్తుతం వర్షాకాలం ముగిసిన నేపథ్యంలో సంబంధిత మార్గదర్శకాలకు అనుగుణంగా సఫారీ సేవలను తిరిగి ప్రారంభించడం జరుగుతుందని తెలిపారు.పర్యాటకులు సఫారీకి సంబంధించిన అటవీ శాఖ నిబంధనలు, నిర్దేశిత సమయాలు మరియు వేగ పరిమితులను తప్పనిసరిగా పాటిస్తూ,వన్యప్రాణుల సంరక్షణకు సహకరించాలని కోరారు.

హెచ్‌సీయూలో ఎస్ఎఫ్ఐ కూటమి జయకేతనం : నాగర్‌కర్నూల్‌లో సంబరాలు

నాగర్‌కర్నూల్,
సెప్టెంబరు 30 (వుదయం ప్రతినిధి):

హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీ విద్యార్థి సంఘం ఎన్నికల్లో ఎస్ఎఫ్ఐ కూటమి ఘన విజయం సాధించిన సందర్భంగా నాగర్‌కర్నూల్ జిల్లా కేంద్రంలో ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో బాణసంచా కాల్చి, స్వీట్లు పంచి సంబరాలు చేశారు.ఈ సందర్భంగా జిల్లా కార్యదర్శి ఎం.తారా సింగ్ మాట్లాడుతూ.. హెచ్‌సీయూలో ఎప్పటికీ ప్రగతిశీల కూటమిదేనని, మతతత్వ రాజకీయాలకు చోటు లేదని స్పష్టమైందన్నారు. ఏబీవీపీ కూటమిని మట్టి కరిపించిన యూనివర్సిటీ విద్యార్థులకు కృతజ్ఞతలు తెలిపారు.202627 విద్యార్థి సంఘం ఎన్నికల్లో అధ్యక్షురాలిగా దిల్నాద (ఎస్ఎఫ్ఐ), ఉపాధ్యక్షుడిగా కొర్ర నితిన్ చౌహాన్ (టీఎస్ఎఫ్), ప్రధాన కార్యదర్శిగా ప్రతీక్ (ఏఎస్ఏ), సహాయ కార్యదర్శిగా సిద్ధాంత్ (ఏఐఎస్ఏ) భారీ మెజారిటీతో విజయం సాధించారని తెలిపారు. కేంద్ర ప్రభుత్వ విద్యార్థి వ్యతిరేక విధానాలకు వ్యతిరేకంగా విద్యార్థి లోకం పోరాడుతుందన్నారు.
కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షుడు వంశీ, నాయకులు రాకేష్, అభినవ్, యశ్వంత్, సందీప్, బషీర్, రామకృష్ణ, అజయ్, విజ్ఞాన్ తదితరులు పాల్గొన్నారు.

మందడి లలితమ్మ అంత్యక్రియలలో పాల్గొన్న

బిఆర్ఎస్ పార్టీ మండల సీనియర్ నాయకులు గజ్జె ఈదన్న యాదవ్, పసుపుల రంజిత్ కుమార్, మాజీ ఉపసర్పంచ్ తగరం కురుమయ్య
చిన్నంబావి మండలం
30 వుదయం రిపోర్టర్

చిన్నంబావి మండల కేంద్రంలోని గడ్డ బస్సాపూర్ గ్రామానికి చెందిన కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు మందడి చిదంబరెడ్డి మాతృమూర్తి మందడి లలితమ్మ అనారోగ్యంతో మంగళవారం చనిపోవడం జరిగింది. బుధవారం రోజు మందడి లలితమ్మ అంత్యక్రియలు బుధవారం కుటుంబ సభ్యులు, బంధుమిత్రులు, నాయకులు, కార్యకర్తల సమక్షంలో నిర్వహించారు. ఈ అంత్యక్రియలకు చిన్నంబావి మండల బిఆర్ఎస్ పార్టీ సీనియర్, గజ్జె ఈదన్న యాదవ్, పసుపుల రంజిత్ కుమార్, మాజీ ఉపసర్పంచ్ తగరం కురుమయ్య, హాజరై మందడి లలితమ్మ భౌతికకాయానికి నివాళులర్పించారు. ఈ సందర్భంగా వారు చిదంబరెడ్డి కుటుంబ సభ్యులను పరామర్శించి, మందడి లలితమ్మ మృతిపట్ల సంతాపం వ్యక్తం చేశారు. కుటుంబ సభ్యులకు మనోధైర్యం కల్పిస్తూ ఆమె ఆత్మకు శాంతి చేకూరాలని ప్రార్థించారు. ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ పార్టీ మండల నాయకులు, బిజెపి పార్టీ మండల నాయకులు, కాంగ్రెస్ పార్టీ మండల నాయకులు, కార్యకర్తలు, చిన్నంబావి మండల వివిధ గ్రామాల ప్రజలు గ్రామస్థులు పాల్గొన్నారు.

రైతుల సహకారంతోనే పీఏసీఎస్ బలోపేతం

ఎర్రవరం పీఏసీఎస్ మహాసభలో చైర్మన్ నలజాల శ్రీనివాస్

కోదాడ సెప్టెంబర్ 30 (వుదయం)

కోదాడ మండల పరిధిలోని ఎర్రవరం గ్రామంలోని ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం (పీఏసీఎస్) మహాసభను చైర్మన్ నలజాల శ్రీనివాస్ అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా సంఘం ఆరు నెలల ఆదాయ, వ్యయ వివరాలను సీఈవో సభ్యులకు వివరించారు. ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో సంఘం రూ.30 లక్షల లాభాన్ని ఆర్జించిందని తెలిపారు. రైతులు తీసుకున్న రుణాలను సకాలంలో చెల్లించి సంఘం అభివృద్ధికి సహకరించాలని చైర్మన్ కోరారు. సంఘంలో అందుబాటులో ఉన్న లాకర్ సౌకర్యాన్ని రైతులు, సభ్యులు వినియోగించుకోవాలని సూచించారు. రైతులకు మరిన్ని సేవలు అందించేలా సంఘాన్ని బలోపేతం చేయాల్సిన అవసరం ఉందన్నారు. దాతల పేర్లతో ధాన్యం గోదాంబిక్యా తండాలోని ధాన్యం గోదాం అభివృద్ధికి గతంలో సహకరించిన దాతల పేర్లను ఏర్పాటు చేస్తామని నలజాల శ్రీనివాస్ తెలిపారు. రైతులు, దాతల సహకారాన్ని గుర్తించి వారి సేవలను గౌరవిస్తామన్నారు. కార్యక్రమంలో సర్పంచులు రావుల భవాని వెంకటేశ్వర్లు, గంగిరెడ్డి తులసి కన్నారెడ్డి, ఇన్‌చార్జి కార్యదర్శి షేక్ మౌలాలి, ఉపాధ్యక్షుడు కొప్పుల సుభాష్‌రెడ్డి, డైరెక్టర్లు, సంఘ సభ్యులు, రైతులు, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

ప్రతి పోలీస్ సిబ్బంది అన్ని రకాల విధులపై అవగాహన కలిగి ఉండాలి.

నారాయణఖేడ్

సెప్టెంబర్ 30 (వుదయం)

నారాయణఖేడ్ నియోజకవర్గ పరిధిలోని సిర్గాపూర్ పోలీస్ స్టేషన్, కంగ్టీ సర్కిల్ కార్యాలయాలను సందర్శించారు.ఈ సందర్భంగా సిర్గాపూర్ పోలీసుల గౌరవ వందనం స్వీకరించి, నారాయణఖేడ్ డీఎస్పీతో కలిసి పోలీస్ స్టేషన్ ఆవరణలో మొక్కను నాటారు.అనంతరం పోలీస్ స్టేషన్ పరిసరాల పరిశుభ్రత, సిబ్బంది కిట్ ఆర్టికల్స్, స్టేషన్ రికార్డుల నిర్వహణను పరిశీలించారు. పోలీస్ స్టేషన్ ఆవరణలో స్వాధీనం చేసుకున్న, కేసులకు సంబంధించిన వాహనాల వివరాలను అడిగి తెలుసుకున్నారు. కేసులకు సంబంధించిన ఆస్తులను కోర్టులో సమర్పించే వరకు జాగ్రత్తగా భద్రపరచాలని సూచించారు.స్టేషన్ రికార్డులను పరిశీలిస్తూ ప్రతి రికార్డును ఎప్పటికప్పుడు అప్‌డేట్‌గా ఉంచాలని, స్టేషన్‌కు వచ్చే ప్రతి ఫిర్యాదును ఆన్‌లైన్‌లో నమోదు చేయాలని ఆదేశించారు. స్టేషన్ పరిధిలో జరిగిన నేరాలను పార్ట్-II మ్యాప్‌లో గుర్తించాలని, ఆస్తి సంబంధిత నేరాలు అధికంగా జరిగే ప్రాంతాలను క్రైమ్ ప్రోన్ ఏరియాలు/బ్లాక్ స్పాట్లుగా గుర్తించి, పగలు, రాత్రి బీట్ విధుల్లో నిఘాను పెంచాలని సూచించారు.దర్యాప్తులో ఉన్న కేసులను పరిశీలించిన ఎస్పీ, ప్రతి కేసులో నాణ్యమైన దర్యాప్తు చేపట్టాలని సూచించారు. మిస్సింగ్ కేసులు, దీర్ఘకాలంగా పెండింగ్‌లో ఉన్న కేసుల పరిష్కారానికి ప్రత్యేక ప్రణాళిక రూపొందించి, వాటిని త్వరితగతిన ఛేదించాలని ఆదేశించారు. రాష్ట్ర సరిహద్దుల నుంచి ప్రభుత్వ ఆదాయానికి గండికొట్టే అక్రమ రవాణా జరగకుండా చెక్‌పోస్టుల నిర్వహణను పకడ్బందీగా చేపట్టాలని ఎస్‌హెచ్‌ఓకు సూచించారు.

సీసీటీఎన్ఎస్2.0, పిటిషన్ మేనేజ్‌మెంట్ సిస్టమ్, టీఎస్‌కాప్, హెచ్‌ఆర్ఎంఎస్, ఈసాక్ష్య, టెక్ డాటం, ఐరాడ్ దర్పణ్, సీఈఐఆర్, సైబర్ క్రైమ్ పోర్టల్, సీడీఆర్, పోర్టబుల్ ఫింగర్ ప్రింట్ డివైస్ వంటి సాఫ్ట్‌వేర్ అప్లికేషన్లపై సిబ్బంది పూర్తి స్థాయి పట్టు సాధించి, నేరాల నియంత్రణ,దర్యాప్తులో వాటిని సమర్థవంతంగా వినియోగించాలని సూచించారు. స్టేషన్ రికార్డులైన పార్ట్-1 నుంచి పార్ట్-5 వరకు ఎలాంటి పెండింగ్ లేకుండా సిసిటీఎన్ఎస్ 2.0లో ఎప్పటికప్పుడు నమోదు చేయాలని ఆదేశించారు.అనంతరం సిబ్బందితో మాట్లాడుతూ, స్టేషన్‌కు వచ్చే ఫిర్యాదుదారులతో మర్యాదపూర్వకంగా మాట్లాడి, వారి సమస్యలను పరిష్కరిస్తామనే భరోసా కల్పించాలని సూచించారు. విలేజ్ పోలీస్ అధికారులు తమకు కేటాయించిన గ్రామాలపై పూర్తి అవగాహన కలిగి ఉండాలని, గ్రా పెద్దలు, యువతతో సత్సంబంధాలు కలిగి శాంతిభద్రతలకు సంబంధించిన ముందస్తు సమాచారాన్ని సేకరించాలని అన్నారు.స్టేషన్ పరిధిలోని సస్పెక్ట్, హిస్టరీషీటర్ల వివరాలపై సిబ్బంది పూర్తి అవగాహన కలిగి ఉండాలని, పగలు, రాత్రి బీట్ విధుల్లో హిస్టరీ షీటర్లను తనిఖీ చేస్తూ వివరాలను ఎప్పటికప్పుడు ఆన్‌లైన్‌లో అప్‌డేట్ చేయాలని సూచించారు. పాపిలాన్ డివైస్‌ను వినియోగిస్తూ అనుమానిత వ్యక్తులను తనిఖీ చేయడంతో పాటు, వేలిముద్రల ద్వారా పాత నేరస్తులను గుర్తించాలని సూచించారు.మారుతున్న సమాజానికి అనుగుణంగా సాంకేతిక పరిజ్ఞానాన్ని అందిపుచ్చుకోవాలని, ప్రతి పోలీస్ సిబ్బంది అన్ని రకాల విధులపై అవగాహన కలిగి ఉండాలని, తమకు కేటాయించిన బాధ్యతలను సమర్థవంతంగా నిర్వర్తించాలని సూచించారు.విధి నిర్వహణలో లేదా వ్యక్తిగతంగా ఏవైనా సమస్యలు ఉంటే నేరుగా తన దృష్టికి తీసుకురావచ్చని తెలిపారు. వాహనాలు నడిపే సమయంలో తప్పని సరిగా హెల్మెట్, సీట్‌బెల్ట్ ధరించాలని సూచించారు.

కంగ్టీ సర్కిల్ కార్యాలయ తనిఖీ:అనంతరం జిల్లా ఎస్పీ కంగ్టీ సర్కిల్ కార్యాలయాన్ని సందర్శించి కార్యాలయ పరిశుభ్రత, రికార్డుల నిర్వహణను పరిశీలించారు. దర్యాప్తులో ఉన్న గ్రేవ్ కేసులు, సర్కిల్ పరిధిలో పెండింగ్‌లో ఉన్న నాన్‌గ్రేవ్ కేసుల వివరాలను అడిగి తెలుసుకున్నారు. దీర్ఘకాలంగా పెండింగ్‌లో ఉన్న మిస్సింగ్, ఎన్.బి.డబ్ల్యూ కేసుల ఛేదనకు సర్కిల్ పరిధిలో ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేసి, కేసులను త్వరితగతిన పరిష్కరించాలని సూచించారు. ప్రభుత్వ నిషేధిత గంజాయి అక్రమ రవాణా, సాగుపై కఠినంగా వ్యవహరించాలని, గంజాయి సాగు చేస్తున్నట్లు గుర్తించిన వ్యవసాయ భూములను చట్టపరమైన నిబంధనల మేరకు జప్తు చేసేందుకు సిఫారసు చేయాలని అధికారులకు సూచించారు. నేరాల ఛేదన, నియంత్రణలో కీలకంగా ఉపయోగపడే సీసీ కెమెరాల ప్రాధాన్యతను ప్రజలకు వివరించి,స్వచ్ఛందంగా సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకునేలా అవగాహన కల్పించాలని అన్నారు. ముఖ్యంగా దాబాలు, పెట్రోల్ బంకుల ఎంట్రీ, ఎగ్జిట్ ప్రాంతాల్లో సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకునేలా సంబంధిత యజమానులకు సూచించాలని అధికారులను ఆదేశించారు.సర్కిల్ కార్యాలయం, పోలీస్ స్టేషన్ నిర్వహణ, రికార్డుల నిర్వహణ సంతృప్తికరంగా ఉన్నాయని పేర్కొన్న జిల్లా ఎస్పీ, అధికారులు, సిబ్బంది పనితీరును ప్రత్యేకంగా అభినందించారు. విధుల్లో ఉత్తమ ప్రతిభ కనబరిచిన సిబ్బందికి రివార్డులు ప్రకటించారు.

ఈ వార్షిక తనిఖీల సందర్భంగా జిల్లా ఎస్పీ వెంట నారాయణఖేడ్ డీఎస్పీ వెంకట్ రెడ్డి, కంగ్టీ సర్కిల్ ఇన్‌స్పెక్టర్ వెంకట్ రెడ్డి, సిర్గాపూర్ ఎస్ఐ మహేష్, సర్కిల్ ఎస్ఐలు తదితరులు ఉన్నారు.

కరువులో రైతాంగాన్ని ఆదుకోవాలి : సీపీఎం

నాగర్ కర్నూల్ రూరల్,

సెప్టెంబరు 30 (వుదయం ప్రతినిధి):

తీవ్ర వర్షాభావ పరిస్థితులతో ఎండిపోయిన పంటలకు నష్టపరిహారం చెల్లించి రైతాంగాన్ని ఆదుకోవాలని సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యురాలు కందికొండ గీత ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

బుధవారం మండల పరిధిలోని బొందల పల్లి గ్రామంలో ఎండిపోయిన పంటలను సీపీఎం నాయకులు పరిశీలించారు.

ఈ సందర్భంగా గీత మాట్లాడుతూ.. ఎల్‌నినో ప్రభావంతో వర్షాలు లేక రైతులు తీవ్రంగా నష్టపోయారన్నారు. బొందల పల్లి శివారులో 1450 ఎకరాల్లో పత్తి, వేరుశనగ, మినుములు సాగు చేయగా, 70 శాతం పంటలు ఎండిపోయాయని తెలిపారు. సాధారణంగా ఎకరాకు 40 క్వింటాళ్ల పత్తి దిగుబడి రావాల్సి ఉండగా, ప్రస్తుతం 20 క్వింటాళ్లే వచ్చే పరిస్థితి ఉందన్నారు.గత ప్రభుత్వ హయాంలో 24 గంటల కరెంటు ఇవ్వగా, ఇప్పుడు 16 గంటలే ఇస్తున్నారని, అది కూడా విడతల వారీగా ఇవ్వడంతో రైతులు ఇబ్బంది పడుతున్నారని రైతులు వాపోయారని తెలిపారు.కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు వెంటనే నాగర్‌కర్నూల్‌ను కరువు జిల్లాగా ప్రకటించి, రైతు రుణాలు మాఫీ చేసి నష్టపరిహారం చెల్లించాలని డిమాండ్ చేశారు.కార్యక్రమంలో సీపీఎం జిల్లా కమిటీ సభ్యుడు పొదిల రామయ్య, మండల కమిటీ సభ్యులు సురేష్, శివరాం, నాయకులు కాశన్న, సురేష్, కుర్మయ్య, రాజు, వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

పరిగి పిఎసిఎస్ సర్వసభ్య సమావేశంలో,ఎమ్మెల్యే టిఆర్ ఆర్

పూడూర్ అక్టోబర్ 1

కారాబాద్ జిల్లా పరిగి పట్టణంలోని పి ఎ సి ఎస్ కార్యాలయంలో చైర్మన్ పార్థసారథి పంతులు ఆధ్వర్యంలో నిర్వహించిన పరిగి ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం సర్వసభ్య సమావేశానికి పరిగి ఎమ్మెల్యే,టీపీసీసీ ట్రైనింగ్ కమిటీ చైర్మన్ (సర్) డాక్టర్ టి.రామ్మోహన్ రెడ్డి ముఖ్యఅతిథిగా హాజరయ్యారు.ఈ సందర్భంగా పి ఎ సి ఎస్ ఆధ్వర్యంలో రైతులకు అందుతున్న సేవలు, సహకార సంఘం కార్యకలాపాలు, రైతుల సంక్షేమానికి చేపడుతున్న కార్యక్రమాలపై జనరల్ బాడీ సమావేశంలో చర్చించారు. రైతులకు అవసరమైన సహకారం అందించడంతో పాటు పి ఎ సి ఎస్ ద్వారా మరిన్ని సేవలు అందుబాటులోకి తీసుకురావాల్సిన అవసరంపై ఎమ్మెల్యే సూచనలు చేశారు.

అనంతరం రైతులకు రూ.10 లక్షల విలువైన చెక్కులను ఎమ్మెల్యే డాక్టర్ టి. రామ్మోహన్ రెడ్డి అందజేశారు. రైతుల సంక్షేమం, వ్యవసాయ రంగ అభివృద్ధికి ప్రభుత్వం ప్రాధాన్యత ఇస్తోందని ఈ సందర్భంగా పేర్కొన్నారు.రైతులకు అవసరమైన విత్తనాలు, రుణాలు, ఇతర వ్యవసాయ సేవలు సకాలంలో అందేలా పి ఎ సి ఎస్ అధికారులు,సిబ్బంది సమన్వయంతో పనిచేయాలని సూచించారు.రైతులకు అండగా నిలుస్తూ సహకార సంఘాలను మరింత బలోపేతం చేయాల్సిన అవసరం ఉందన్నారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్మన్ పరశురాం రెడ్డి,పి ఎ సి ఎస్ చైర్మన్ పార్థసారథి పంతులు,మున్సిపల్ చైర్‌పర్సన్ రజిత వెంకటేష్, వైస్ చైర్మన్ రాజపుల్ల రెడ్డి, డైరెక్టర్లు, అధికారులు, ప్రజా ప్రతినిధులు, రైతులు తదితరులు పాల్గొన్నారు.

మూఢనమ్మకాలు వద్దు విజ్ఞానమే ముద్దు: ఎస్సై ఉదయ్ కుమార్

జన్నారం,

సెప్టెంబర్ 30 (వుదయం విలేఖరి)

మూఢనమ్మకాలు వద్దు,విజ్ఞానమే ముద్దని,శాస్త్రీయ విజ్ఞానమే దేశ అభివృద్ధికి పునాది అని ఎస్సై ఉదయ్ కుమార్, సాంఘిక సమానత్వ సేవా సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ఉప్పులేటి నరేష్ అన్నారు.మంచిర్యాల డీసీపీ భాస్కర్ ఆదేశాల మేరకు బుధవారం జన్నారం పోలీస్ శాఖ ఆధ్వర్యంలో మండల కేంద్రంలోని రాఘవేంద్ర కరిమల జూనియర్ కళాశాలలో వ్యక్తిత్వ వికాసం సైన్స్ మూఢనమ్మకాలు ద్రగ్స్ అనే అంశంపై అవగాహన సదస్సు నిర్వహించారు.ఈ సమావేశానికి అతిథులుగా ఎస్సై ఉదయ్ కుమార్, రాష్ట్ర అధ్యక్షుడు ఉప్పులేటి నరేష్ హాజరై మాట్లాడుతూ.. శాస్త్ర విజ్ఞానం ఎంతో అభివృద్ధి చెందుతున్న నేటి తరుణంలో గ్రామీణ,పట్టణ ప్రాంతాల్లో మూఢనమ్మకాలు నమ్మడం దురదృష్టకరమని, దొంగ స్వాములు, భూత వైద్యులు ప్రజల అమాయకత్వాన్ని ఆసరాగా చేసుకొని ఆర్థికంగా మోసం చేస్తున్నారని అన్నారు. విద్యతోనే దేశ అభివృద్ధి సాధ్యమని, విద్యార్థి దశలోనే మూఢనమ్మకాలు వీడుతూ సమాజాభివృద్ధికి కృషి చేయాలని పిలుపునిచ్చారు.విద్యార్థుల్లో శాస్త్రీయ ఆలోచనా విధానాన్ని పెంపొందించడంతో పాటు మూఢనమ్మకాలను తొలగించేందుకు శాస్త్రీయ అవగాహన కార్యక్రమాలు ఎంతో అవసరమని పేర్కొన్నారు.అనంతరం విద్యార్థులకు సైన్స్ మ్యాజిక్ షోను ఉప్పులేటి నరేష్ నిర్వహించారు. ఇసుక నుండి నాణాలు తీయడం, విద్యార్థి చేతిపై కిరోసిన్ తో మంటలు లేపడం, నోట్లో మంటలు లేపడం, పచ్చి వేపాకులపై నీటితో మంటలు లేపడం, ఇనుప చువ్వ నాలుకకు గుచ్చుకోవడం లాంటి ప్రదర్శనలు నిర్వహించారు .ఈ కార్యక్రమంలో ప్రిన్సిపల్ శ్రీనివాస్,డీన్ హేమలత, చిన్ని, ఉపాధ్యాయ బృందం,పోలీసులు పాల్గొన్నారు.

మల్లె చెరువు కట్ట పై అభివృద్ధికి అడుగులు

బతుకమ్మ వేళ మల్లెచెరువుకు రానున్న కొత్త కళ

రామాయంపేట, సెప్టెంబర్ 30 (వుదయం ప్రతినిధి రాజాగౌడ్):

రామాయంపేట మున్సిపాలిటీ పరిధిలోని మల్లెచెరువు కట్ట అభివృద్ధికి నిధులు మంజూరయ్యాయి. ఎమ్మెల్యే మైనంపల్లి రోహిత్‌రావు సూచనల మేరకు బతుకమ్మ పండుగ సందర్భంగా మహిళలకు మెరుగైన సౌకర్యాలు కల్పించేందుకు అభివృద్ధి పనులు చేపట్టనున్నట్లు మున్సిపల్ చైర్‌పర్సన్ గజవాడ లావణ్య నాగరాజు తెలిపారు. కట్టపై 800 మీటర్ల మేర సీసీ రోడ్డు నిర్మించడంతో పాటు స్ట్రీట్ లైటింగ్ ఏర్పాటు చేయనున్నట్లు పేర్కొన్నారు. బతుకమ్మ పండుగ సందర్భంగా మహిళలు పెద్ద సంఖ్యలో మల్లెచెరువు కట్ట వద్దకు చేరుకునే అవకాశం ఉన్నందున రాకపోకలకు ఇబ్బందులు కలగకుండా రహదారి, విద్యుత్ దీపాల ఏర్పాటుకు చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. అభివృద్ధి పనులు పూర్తయితే కట్టపై రాకపోకలు సులభతరం కావడంతో పాటు రాత్రి వేళల్లో ప్రజలకు మెరుగైన సౌకర్యాలు అందుబాటులోకి వస్తాయని పేర్కొన్నారు. పనులను త్వరితగతిన ప్రారంభించి నాణ్యతతో పూర్తి చేయాలని సంబంధిత అధికారులను ఆదేశించినట్లు చైర్‌పర్సన్ తెలిపారు. మొత్తం పనులను పది రోజుల్లోగా పూర్తి చేయాలని సూచించినట్లు వెల్లడించారు.ఈ కార్యక్రమంలో వైస్ చైర్ పర్సన్ పోచమ్మల నవనీత గణేష్ గారు కోఆప్షన్ నెంబర్ చింతల రాధా భవాని యాదగిరి గారు పట్టణ అధ్యక్షుడు చింతల సప్న స్వామి గారు మాజీ కౌన్సిలర్ బుర్ర అనిల్ గారు కాంగ్రెస్ పార్టీ నాయకులు మట్టి యాదగిరి గారు యూత్ కాంగ్రెస్ నాయకులు చిలుక విరాట్ భాను ప్రసాద్ దేవుని నరేష్ నరేందర్ సాయి తేజ సుధీర్ గౌడ్ గణేష్ తో పాటు అధికారులు తదితరులు పాల్గొన్నారు.

సిద్దాపూర్ చెరువులో అక్రమ మట్టి తవ్వకాలు: కాలనీవాసుల ఆగ్రహం

సదాశివపేట:

సంగారెడ్డి జిల్లా సదాశివపేట పట్టణ పరిధిలోని సిద్దాపూర్ గ్రామంలో (7వ వార్డు) గల స్థానిక చెరువు నుంచి అక్రమంగా మట్టి తరలిస్తున్నారంటూ కాలనీవాసులు తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేశారు. వినాయక నిమజ్జన ఏర్పాట్ల పేరు చెప్పి కోట్ల రూపాయల విలువైన మట్టి, మొరంను ప్రైవేట్ వ్యక్తులకు అమ్ముకుంటూ సొమ్ము చేసుకుంటున్నారని స్థానికులు ఆరోపించారు. బుధవారం నిర్వహించిన మీడియా సమావేశంలో వారు ఈ అక్రమ తవ్వకాల వివరాలను వెల్లడించారు.

దేవుడి పేరుతో మట్టి వ్యాపారం:గణేష్ నిమజ్జనానికి రోడ్డు మరమ్మతులు చేస్తున్నామని చెబుతూ.. 7వ వార్డు కాంగ్రెస్ కౌన్సిలర్ భర్త పెద్ద ఎత్తున మట్టిని ప్రైవేట్ పనులకు తరలించి అమ్ముకున్నారని స్థానికులు పేర్కొన్నారు. నిమజ్జనం కోసం వాస్తవానికి ఎంత మట్టి అవసరమైంది? ఎంత తవ్వారు? మిగిలిన మట్టిని ఎక్కడికి తరలించారు? అనే పూర్తి వివరాలను అధికారులు బహిర్గతం చేయాలని వారు డిమాండ్ చేశారు. అక్రమ తవ్వకాలను ప్రశ్నించిన కాలనీవాసులపై 'మాదే ప్రభుత్వం, నన్ను ఎవరూ ఏమీ చేయలేరు' అంటూ సదరు నాయకుడు బెదిరింపులకు దిగుతున్నారని వాపోయారు.ప్రమాదకరంగా మారిన గుంతలు - చెరువు కట్టకు ముప్పు:విచక్షణారహితంగా మట్టిని తవ్వేయడంతో చెరువు పరిసరాల్లో భారీ లోతైన గుంతలు ఏర్పడ్డాయని, పశువులు నీటి కోసం వెళ్లి ప్రమాదాల బారిన పడే అవకాశం ఉందని స్థానికులు ఆందోళన వ్యక్తం చేశారు. ఈ తవ్వకాల వల్ల చెరువు కట్ట బలహీనపడిందా? నీటి నిల్వ సామర్థ్యానికి విఘాతం కలిగిందా? అనే అంశాలపై సంబంధిత శాఖ అధికారులు క్షేత్రస్థాయిలో సాంకేతిక పరిశీలన జరపాలని డిమాండ్ చేశారు. అనుమతులు లేవన్న తహసీల్దార్:ఈ వ్యవహారంపై తహసీల్దార్, మైనింగ్ అధికారులకు ఫిర్యాదు చేసినా ఎలాంటి చర్యలు చేపట్టలేదని స్థానికులు విమర్శించారు. కాగా, ఈ తవ్వకాలపై తహసీల్దార్‌ను వివరణ కోరగా.. తమ కార్యాలయం నుంచి మట్టి తవ్వకాలకు ఎలాంటి ప్రత్యేక అనుమతులూ ఇవ్వలేదని, కేవలం వినాయక నిమజ్జనం కోసం అవసరమైన మేరకు మాత్రమే వినియోగించుకోవాలని సూచించినట్లు స్పష్టం చేశారు. ఇప్పటికైనా జిల్లా కలెక్టర్ ప్రత్యేక చొరవ చూపి, చెరువులో జరిగిన మట్టి దోపిడీపై సమగ్ర విచారణ జరిపించాలని, తరలించిన మట్టి విలువను రికవరీ చేసి బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని కాలనీవాసులు కోరారు.

హజ్ సొసైటీ సేవలు అభినందనీయం: డాక్టర్ అజ్హర్ అలీ

నాగర్ కర్నూల్,

సెప్టెంబరు 30 (వుదయం ప్రతినిధి):

నాగర్‌కర్నూల్ జిల్లా హజ్ సొసైటీ సేవలు అభినందనీయమని స్టేట్ హజ్ సొసైటీ సభ్యుడు డాక్టర్ అజ్హర్ అలీ అన్నారు.బుధవారం జిల్లా కేంద్రంలోని హజ్ సొసైటీ కార్యాలయాన్ని ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా జిల్లా అధ్యక్షుడు షేక్ ఫరీద్ అహ్మద్ ఆధ్వర్యంలో ఆయనకు స్వాగతం పలికారు.రాష్ట్రంలో నాగర్‌కర్నూల్ సొసైటీకి మంచి పేరు ఉందని, యాత్రికులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా నిబద్ధతతో సేవలు అందిస్తున్నారని కొనియాడారు. రాష్ట్ర సొసైటీ కోరిన సమాచారాన్ని వెంటనే అందిస్తున్నారని ప్రశంసించారు. హజ్ యాత్ర సమయంలో సేవలందించేందుకు ఐదుగురు సభ్యులకు ఐడీ కార్డులు జారీ చేస్తామని హామీ ఇచ్చారు.కార్యక్రమంలో కార్యదర్శి మహమ్మద్ ఇబ్రహీం, ఉపాధ్యక్షుడు అబ్దుల్ హాక్, ముస్తాక్ అహ్మద్, మౌలా పిరా, సయ్యద్ తాహెర్, మహమ్మద్ పాషా, ఏజాజ్ నక్షబంది తదితరులు పాల్గొన్నారు.

మందడి లలితమ్మ అంత్యక్రియలలో పాల్గొన్న

బిఆర్ఎస్ పార్టీ మండల సీనియర్ నాయకులు

మండల సీనియర్ నాయకులు వడ్డేమాన్ రామకృష్ణ,

చిన్నంబావి మండలం

30 వుదయం రిపోర్టర్

చిన్నంబావి మండల కేంద్రంలోని గద్వ బస్సాపూర్ గ్రామానికి చెందిన కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు మందడి చిదంబరెడ్డి మాతృమూర్తి మందడి లలితమ్మ అనారోగ్యంతో మంగళవారం చనిపోవడం జరిగింది. బుధవారం రోజు మందడి లలితమ్మ అంత్యక్రియలు బుధవారం నాయకులు, కార్యకర్తల సమక్షంలో లలితమ్మ మృతిపట్ల సంతాపం వ్యక్తం చేశారు. కుటుంబ సభ్యులకు మనోధైర్యం కల్పిస్తూ ఆమె ఆత్మకు శాంతి చేకూరాలని ప్రార్థించారు. ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ పార్టీ మండల నాయకులు, బిజెపి పార్టీ మండల నాయకులు, కాంగ్రెస్ పార్టీ మండల నాయకులు,కార్యకర్తలు,చిన్నంబావి మండల వివిధ గ్రామాల ప్రజలు గ్రామస్థులు పాల్గొన్నారు.

భార్య హత్య కేసులో భర్తకు జీవిత ఖైదు..

రూ.10 వేల జరిమానా...

*** శిక్ష పడేలా కృషి చేసిన పోలీసు అధికారులు,...**

*** సిబ్బందిని అభినందించిన మెదక్ జిల్లా ఎస్పీ డి.వి. శ్రీనివాసరావు ....**

వుదయం న్యూస్

శివ్వంపేట సెప్టెంబర్ 30....

మెదక్: అదనపు కట్నం కోసం భార్యను వేధించి, చివరకు రాయితో తలపై కొట్టి హత్య చేసిన భర్తకు జిల్లా న్యాయస్థానం జీవిత ఖైదు విధించిందని మెదక్ జిల్లా ఎస్పీ డి.వి. శ్రీనివాసరావు ఐపీఎస్ తెలిపారు.శివంపేట మండలం కొత్త పేటకు చెందిన బుచ్చ అశోక్‌కు అల్లీపూర్‌కు చెందిన మినాతో సుమారు మూడేళ్ల క్రితం వివాహమైంది. వివాహ సమయంలో కిలో వెండి, 8 తులాల బంగారం, మోటార్‌సైకిల్‌తో పాటు రూ.50 వేల నగదును కట్నంగా ఇచ్చారు. వివాహమైన ఐదు నెలల తర్వాత అశోక్ అదనపు కట్నం కోసం మినాను మానసికంగా, శారీరకంగా వేధించడం ప్రారంభించాడు. ఈ విషయంపై పెద్దల సమక్షంలో పలు మార్లు పంచాయతీలు నిర్వహించినప్పటికీ వేధింపులు ఆగలేదు. రూ.లక్ష అదనపు కట్నం కావాలని డిమాండ్ చేస్తూ 22.01.2023న మినాను ఇంటి నుంచి వెళ్లగొట్టాడు.02.03.2023న ఉదయం 10 గంటల సమయంలో మినా తన తల్లిదండ్రులు, గ్రామ పెద్దలతో కలిసి భర్త ఇంటికి వెళ్లింది. ఈ సందర్భంగా పంచాయతీ పెట్టి తన పరువు తీస్తోందనే కోపంతో అశోక్ రాయితో ఆమె తలపై బలంగా కొట్టాడు.తీవ్రంగా గాయపడిన మినాను సర్సాపూర్‌లోని పద్మజ ఆసుపత్రికి, అనంతరం మెరుగైన చికిత్స కోసం కూకట్‌పల్లిలోని పద్మజ ఆసుపత్రికి తరలించారు.అక్కడ చికిత్స పొందుతూ 05.03.2023న మృతి చెందింది.కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు అప్పటి ఎస్ఐ రవికాంత్ కేసు నమోదు చేశారు. అప్పటి దర్యాప్తు అధికారి, తూప్రాన్ సీఐ శ్రీధర్ సమగ్ర దర్యాప్తు నిర్వహించి కీలక సాక్ష్యాధారాలను సేకరించారు. పబ్లిక్ ప్రాసిక్యూటర్ వెంకటేష్ కోర్టులో బలమైన వాదనలు వినిపించారు. ప్రస్తుత తూప్రాన్ సీఐ వెంకట రాజా గౌడ్, శివంపేట ఎస్ఐ మధుకర్ రెడ్డి సాక్షులను కోర్టులో ప్రవేశపెట్టారు.పూర్తి సాక్ష్యాధారాలను పరిశీలించిన మెదక్ జిల్లా ప్రధాన న్యాయమూర్తి నీలిమ నిందితుడు బుచ్చ అశోక్‌కు జీవిత ఖైదు, రూ.10 వేల జరిమానా విధిస్తూ తీర్పు ఇచ్చారని ఎస్పీ తెలిపారు.ఈ కేసులో లైజనింగ్ అధికారులు ఎస్ఐ విఠల్, కానిస్టేబుల్ రవీందర్ గౌడ్, సీడీఓ ఆనంద్ సహకరించారని తెలిపారు. నిందితుడికి శిక్ష పడేలా సమర్థవంతంగా దర్యాప్తు నిర్వహించి, పటిష్టమైన సాక్ష్యాధారాలను కోర్టులో సమర్పించిన తూప్రాన్ సిఐ వెంకటరాజ గౌడ్ శివంపేట ఎస్సై మధుకర్ రెడ్డి గారిని మరియు సిబ్బందిని ఎస్పీ అభినందించారు.

రెవెన్యూ డివిజన్‌ను హామీలకే పరిమితం చేసింది బీఆర్ఎస్ : కాంగ్రెస్ నేతలు

అధికారం లో ఉన్నప్పుడు హేళన చేసి ఇప్పుడు విమర్శల ..!??

రామాయంపేట,సెప్టెంబర్ 30 (వుదయం ప్రతినిధి రాజాగౌడ్):

రామాయంపేట రెవెన్యూ డివిజన్ అంశంపై కాంగ్రెస్ ప్రభుత్వాన్ని విమర్శించడం విడ్డూరంగా ఉందని కాంగ్రెస్ నాయకులు అన్నారు. పదేళ్ల బీఆర్ఎస్ పాలనలో రామాయంపేట పట్టణ అభివృద్ధిని విస్మరించడంతో పాటు, రెవెన్యూ డివిజన్ ఏర్పాటు హామీని కాగితాలకే పరిమితం చేశారని ఆరోపించారు. బుధవారం రామాయంపేట లోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో నిర్వహించిన మీడియా సమావేశంలో వారు మాట్లాడారు.మున్సిపల్ చైర్‌పర్సన్ గజవాడ లావణ్య నాగరాజు మాట్లాడుతూ బీఆర్ఎస్ నాయకులు మాయమాటలతో ప్రజలను మరోసారి మభ్యపెట్టవద్దని అన్నారు. గత ప్రభుత్వ హయాంలో నాన్‌వెజ్ మార్కెట్ యార్డు పనులకు టెండర్లు నిర్వహించి మధ్యలో నే నిలిపివేశారని, ఎంఆర్ఓ కార్యాలయ నిర్మాణం కూడా పూర్తికాలేదని ఆరోపించారు. రామాయంపేటను ఆదర్శ పట్టణంగా అభివృద్ధి చేసేందుకు దాదాపు రూ.100 కోట్లతో ప్రతిపాదనలు సిద్ధం చేసినట్లు తెలిపారు. ప్రతి వార్డుకు సమాన ప్రాధాన్యం ఇస్తామని, ఎమ్మెల్యే మైనంపల్లి రోహిత్‌రావు సహకారంతో రెవెన్యూ డివిజన్ సాధించి తీరుతామని స్పష్టం చేశారు.సరాఫ్ యాదగిరి మాట్లాడుతూ రామాయంపేటకు నవోదయ విద్యాలయం, క్రీడా ప్రాంగణం ఏర్పాటు చేస్తామని గతంలో హామీలు ఇచ్చారని, వాటి పరిస్థితి ఏమైందని ప్రశ్నించారు. ప్రస్తుతం హామీ ఇవ్వకపోయినా ఇంటిగ్రేటెడ్ పాఠశాల నిర్మాణం చేపడుతున్నామని తెలిపారు. ఎమ్మెల్యే మైనంపల్లి రోహిత్‌రావు, మైనంపల్లి హనుమంతరావు సహకారంతో పట్టణంలో పలు అభివృద్ధి పనులు కొనసాగుతున్నాయని పేర్కొన్నారు.బండారు మహేందర్‌రెడ్డి మాట్లాడుతూ రామాయంపేట

పాస్టర్ కుటుంబంపై దాడికి పాల్పడిన వారిపై చర్యలు తీసుకోవాలి

- యూడీసీఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి పెదామాము దేవిడ్‌రాజు
- పాస్టర్ ఫెలోషిప్ అధ్యక్షుడు దుబ్బ దేవిడ్‌రాజు

నల్గొండ జిల్లా వుదయం ప్రతినిధి , సెప్టెంబర్ 30

నల్లగొండ జిల్లా చింతపల్లి మండలం కుర్మెడు గ్రామంలో సొంత గృహంలో ప్రార్థనలు చేసుకుంటున్న పాస్టర్, ఆయన కుటుంబ సభ్యులు, మహిళలు, యువకులపై దాడికి పాల్పడిన వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని యునైటెడ్ దళిత్ క్రిస్టియన్ ఫెడరేషన్ (యూడీసీఎఫ్) జిల్లా ప్రధాన కార్యదర్శి పెదామాము దేవిడ్‌రాజు, సాగర్ నియోజక వర్గ పాస్టర్ ఫెలోషిప్ అధ్యక్షుడు దుబ్బ దేవిడ్‌రాజు కోరారు. బుధవారం నల్లగొండ జిల్లా కలెక్టరేట్‌లో కలెక్టర్‌కు వినతిపత్రం అందజేశారు.అనంతరం కలెక్టరేట్ ఆవరణలో యూడీసీఎఫ్ ఆధ్వర్యంలో క్రైస్తవులు నిరసన తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. కుర్మెడు గ్రామంలో పాస్టర్ కుటుంబం ఇంట్లో ప్రార్థనలు చేసుకుంటుండగా కొందరు యువకులు దాడికి పాల్పడ్డారని ఆరోపించారు. ఇంటిపై రాళ్లు విసిరి కిటికీలు, సామగ్రిని ధ్వంసం చేశారని,అక్కడున్న వారిని భయభ్రాంతులకు గురిచేశారని తెలిపారు. గృహాల్లో ప్రార్థనలు చేసుకోవడాన్ని అన్యమత ప్రచారంగా భావించి దాడులకు పాల్పడటం సరికాదన్నారు. ఇలాంటి ఘటనలు క్రైస్తవుల మనోభావాలను దెబ్బతీస్తున్నాయని పేర్కొన్నారు. భవిష్యత్తులో క్రైస్తవులపై ఇలాంటి దాడులు పునరావృతం కాకుండా అధికారులు చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో హాలియా మండల అధ్యక్షుడు ఏపీ ప్రభాకర్, నిడమనూరు మండల అధ్యక్షుడు యోహాను, వైస్ ప్రెసిడెంట్ బొజ్జ విజయరాజు, పాస్టర్ జీవన్, రవికుమార్, ఎలీషారావు, రాజ్‌పాల్ తదితర క్రైస్తవ నాయకులు పాల్గొన్నారు

భద్రాచలంలో వైభవంగా శ్రీరామాయణ మహాపారాయణోత్సవం

- అక్టోబర్ 12 నుంచి 21 వరకు పది రోజుల పాటు ప్రత్యేక కార్యక్రమాలు
- 108 మంది పారాయణదారులకు ఉచిత వసతి, భోజన సదుపాయాలు

భద్రాచలం, 30/09/26 వుదయం ప్రతినిధి:

భద్రాచల శ్రీ సీతారామచంద్రస్వామి వారి పవిత్ర సన్నిధిలో శరన్నవరాత్రి మహోత్సవాలను పురస్కరించుకుని శ్రీరామాయణ మహాపారాయణోత్సవాన్ని అత్యంత భక్తిశ్రద్ధలతో, వైభవంగా నిర్వహించేందుకు దేవస్థానం అధికారులు నిర్ణయించారు. అక్టోబర్ 12వ తేదీ నుంచి అక్టోబర్ 21వ తేదీ వరకు వరుసగా పది రోజులపాటు తానీషా కళ్యాణ మండపం వెనుకవైపున ఉన్న మారుతీ సదనంలో శ్రీరామాయణ మహాపారాయణోత్సవాన్ని నిర్వహించనున్నట్లు శ్రీ సీతారామచంద్రస్వామి దేవస్థానం కార్యనిర్వహణాధికారి కే. దామోదర్ రావు తెలిపారు.గతంలో నిర్వహించిన విధంగానే ఈసారి కూడా కార్యక్రమాన్ని అత్యంత వైభవంగా నిర్వహించేందుకు అవసరమైన ఏర్పాట్లు చేపట్టనున్నట్లు ఆయన పేర్కొన్నారు.భద్రాద్రి రామయ్య సన్నిధిలో శరన్నవరాత్రి మహోత్సవాల సందర్భంగా నిర్వహించనున్న ఈ శ్రీరామాయణ మహాపారాయణోత్సవానికి ప్రత్యేక ఆధ్యాత్మిక ప్రాధాన్యత ఉందని, శ్రీరామాయణ పారాయణం ద్వారా భక్తుల్లో ఆధ్యాత్మిక చైతన్యం, భక్తిభావం మరింత పెంపొందేలా కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ పది రోజుల పాటు జరిగే మహాపారాయణోత్సవంలో పాల్గొనదలచిన భక్తులలో ఎంపిక చేయబడిన 108 మంది పారాయణదారులకు దేవస్థానం ఆధ్వర్యంలో ఉచిత వసతి,భోజన సదుపాయాలను కల్పించనున్నట్లు కార్యనిర్వహణాధికారి వెల్లడించారు. ఎంపికైన పారాయణదారులు కార్యక్రమం జరిగే పది రోజులపాటు భద్రాచలంలో ఉండి శ్రీరామాయణ మహాపారాయణంలో పాల్గొనేలా అవసరమైన సౌకర్యాలను దేవస్థానం కల్పించనుంది. అంతేకాకుండా శ్రీరామాయణ మహాపారాయణోత్సవాన్ని వీక్షించేందుకు, ఆధ్యాత్మిక కార్యక్రమంలో పాల్గొనేందుకు వచ్చే ఇతర భక్తులందరికీ కూడా భోజన సౌకర్యం కల్పించనున్నట్లు తెలిపారు. దీంతో భక్తులు ఎలాంటి ఇబ్బందులు లేకుండా కార్యక్రమంలో పాల్గొనేలా దేవస్థానం చర్యలు తీసుకోనుంది. భద్రాచలం క్షేత్రం శ్రీరామ భక్తులకు అత్యంత పవిత్రమైన పుణ్యక్షేత్రంగా పేరుగాంచిన నేపథ్యంలో శరన్నవరాత్రి మహోత్సవాల సమయంలో నిర్వహించే ఈ మహాపారాయణోత్సవానికి రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల నుంచి భక్తులు హాజరయ్యే అవకాశం ఉంది. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని శ్రీరామాయణ పారాయణాన్ని ఆలకించి,శ్రీ సీతారామ చంద్రస్వామి వారి అనుగ్రహాన్ని పొందాలని దేవస్థానం అధికారులు కోరుతున్నారు. శ్రీరామాయణ మహాపారాయణోత్సవం సందర్భంగా భక్తులకు అవసరమైన వసతి, భోజనం తదితర సదుపాయాలను సమన్వయంతో అందించేందుకు దేవస్థానం సిబ్బంది చర్యలు చేపట్టనున్నారు.

కార్యక్రమం విజయవంతంగా నిర్వహించేందుకు భక్తులు, పారాయణదారులు,దేవస్థానం సిబ్బంది పరస్పర సహకారం అందించాలని అధికారులు కోరారు.భక్తులందరికీ ఈ కార్యక్రమం గురించి ముందుగానే సమాచారం అందేలా విస్తృత ప్రచారం నిర్వహించాలని కార్యనిర్వహణాధికారి కే. దామోదర్ రావు కోరారు. తమ దినపత్రికలు, టెలివిజన్ ఛానళ్లు, ఇతర ప్రసార మాధ్యమాల ద్వారా శ్రీరామాయణ మహాపారాయణోత్సవం వివరాలను ప్రచురించి, ప్రసారం చేసి భక్తులందరికీ తెలియజేయాలని ఆయన విజ్ఞప్తి చేశారు. శరన్నవరాత్రి మహోత్సవాల సందర్భంగా భద్రాచలంలో నిర్వహించనున్న ఈ పది రోజుల శ్రీరామాయణ మహాపారాయణోత్సవం భక్తులకు ఆధ్యాత్మిక వాతావరణాన్ని అందించడంతో పాటు భద్రాద్రి క్షేత్ర వైభవాన్ని మరింత చాటిచెప్పేలా నిర్వహించేందుకు దేవస్థానం ప్రత్యేక దృష్టి సారిస్తున్నట్లు తెలిపారు.భక్తులు పెద్ద సంఖ్యలో తరలి వచ్చి శ్రీరామాయణ మహాపారాయణోత్సవంలో భాగస్వాములు కావాలని, శ్రీ సీతారామచంద్రస్వామి వారి ఆశీస్సులు పొందాలని కార్యనిర్వహణాధికారి కే. దామోదర్ రావు ఆకాంక్షించారు.

అనిమల్ల సత్యనారాయణ కుటుంబానికి పరామర్శ

- రూ.5,000 వేల తక్షణ ఆర్థిక సాయం అందజేసిన కాసాల జనార్ధన్ రెడ్డి
- మృతుని కుమారుడి MBBS చదువుకు పూర్తి సహకారం

చండూరు , సెప్టెంబర్ 30 (వుదయం):

ఇటీవల అకస్మాత్తుగా మృతిచెందిన చండూరు మండలం గుండ్రపల్లి గ్రామానికి చెందిన అనిమల్ల సత్యనారాయణ కుటుంబాన్ని కాంగ్రెస్ పార్టీ జిల్లా నాయకుడు కాసాల జనార్ధన్ రెడ్డి బుధవారం పరామర్శించారు. గ్రామంలోని మృతుని నివాసానికి వెళ్లిన ఆయన, సత్యనారాయణ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం శోకసంద్రంలో ఉన్న కుటుంబ సభ్యులను ఓదార్చి, వారికి తక్షణ ఆర్థిక సాయంగా ₹5,000 నగదును అందజేశారు.ఈ సందర్భంగా కాసాల జనార్ధన్ రెడ్డి మాట్లాడుతూ.. సత్యనారాయణ అకాల మరణం ఆ కుటుంబానికి తీరని లోటని ఆవేదన వ్యక్తం చేశారు. మృతుని కుమారుడి వైద్య విద్య (MBBS) చదువుకు అయ్యే ఖర్చుల నిమిత్తం స్థానిక ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి తరపున పూర్తి సహాయ సహకారాలు అందిస్తామని, ఆ కుటుంబాన్ని అన్ని విధాలా ఆదుకుంటామని హామీ ఇచ్చారు.ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ గుండ్రపల్లి గ్రామ శాఖ అధ్యక్షుడు కాసాల పాండురంగా రెడ్డి, మాజీ సర్పంచ్ తీగల సుభాష్, గ్రామ శాఖ ప్రధాన కార్యదర్శి వందనపు నరేందర్, 4వ వార్డు సభ్యుడు తిరుమణి శ్రీనివాస్, 3వ వార్డు సభ్యురాలు ముచ్చపోతుల విగ్నేశ్వరి-చరణ్, సీనియర్ నాయకులు కట్కూరి రంగారెడ్డి, కట్కూరి వెంకట్ రెడ్డి, తీగల కృష్ణయ్య, అనిమల్ల యాదయ్య, అనిమల్ల కృష్ణయ్య తదితరులు పాల్గొన్నారు.

అయ్యప్ప ఆలయంలో అన్నదానం

అనంతగిరి సెప్టెంబర్ 30 వుదయం

తెలంగాణా శబరిమల అనంతగిరి శ్రీ అయ్యప్ప సన్నిధిలో 2026 సంక్రాంతి పండగ నుండి ప్రారంభం అయిన ప్రతి బుధవారం అన్నప్రసాద వితరణ ముప్పై ఎనిమిదవ (38) వారం, అనంతగిరి వాస్తవ్యులు శ్రీ.పి. నందా చార్యులు సహకారంతో నిర్వహించారు ఈ కార్యక్రమంలో ట్రస్ట్ చైర్మన్ కొండపల్లి వాసు,అఖిల భారత అయ్యప్ప దీక్షా ప్రచార సమితి జిల్లా అధ్యక్షులు అర్వపల్లి సత్యనారాయణ, జగిని ప్రసాద్,బండారుపల్లి వెంకటేశ్వర్ రావు,బానోతు శివాజీ, భూక్యా రవీందర్ , కనకయ్య, పొడిశెట్టి నరసింహారావు,ఐతన బోయిన వెంకటేశ్వర్లు భక్తులు,ట్రస్ట్ సభ్యులు పాల్గొని స్వామి నిదర్శించి అన్నప్రసాదము స్వీకరించినారు.

జిల్లా విద్యా అధికారిగా డి. వాసంతి బాధ్యతలు స్వీకరణ

ఖమ్మం వుదయం బ్యూరో సెప్టెంబర్ 30

ఖమ్మం జిల్లా విద్యా అధికారి గా డి. వాసంతి బాధ్యతలు స్వీకరించిన అనంతరం కలెక్టరేట్ లోని కలెక్టర్ ఛాంబర్ లో జిల్లాకలెక్టర్ దివాకర టిఎస్ ని మర్యాద పూర్వకంగా కలిసి పూలమొక్క అందించారు.

రోస్టర్ పాయింట్ విధంగా భర్తీ చేయాలి

యాదాద్రి భువనగిరి జిల్లా, 30 సెప్టెంబర్ 2026

ఈరోజు యాదాద్రి భువనగిరి జిల్లా కలెక్టరేట్ కార్యాలయంలో దివ్యాంగుల బ్యాక్లాగ్ ఉద్యోగాల కోసం జిల్లాకు సంబంధించిన అన్ని శాఖలలో ఖాళీలను రోస్టర్ పాయింట్ విధంగా డిసెంబర్ 01 వరకు భర్తీ చేయాలని జిల్లా స్థాయి ఉన్నతాధికారుల సమక్షంలో ఈ సమావేశాన్ని నిర్వహించడం జరిగింది. ఈ సమావేశంలో కమిటీ సభ్యులుగా తెలంగాణ విలాంగుల హక్కుల సాధన సమితి జిల్లా అధ్యక్షులు కనకబోయిన నాగరాజ్ గారు, మరియు రాజపేట మండల అధ్యక్షులు ఇప్పల రమేష్ , NGO మధుసూదన్ రెడ్డి శివ గారు పాల్గొనడం జరిగింది.

పట్టభద్రుల ఎమ్మెల్సీ బరిలో అమీనాబాద్ వాసి

- భారత్ పార్టీ తరపున పోటీకి షఫీ సిద్ధం

అనంతగిరి, సెప్టెంబర్ 30 వుదయం

నల్గొండ – ఖమ్మం – వరంగల్ పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల బరిలోకి అమీనాబాద్ గ్రామానికి చెందిన బి.ఆర్. షఫీ అడుగుపెట్టేందుకు సిద్ధమవుతున్నారు. భారత్ పార్టీ తరఫున ఎమ్మెల్సీ అభ్యర్థిగా పోటీ చేయనున్నట్లు ఆయన ప్రకటించినట్లు సమాచారం. దీంతో స్థానికంగా పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికలపై ఆసక్తి నెలకొంది.మోటివేషనల్ ప్రసంగాల ద్వారా యువతలో స్ఫూర్తి నింపుతూ తనకంటూ ప్రత్యేక గుర్తింపు తెచ్చుకున్న బి.ఆర్. షఫీ, ప్రస్తుతం రాజకీయ రంగంలోకి ప్రవేశించేందుకు సిద్ధమవుతున్నారు.విద్యార్థులు, నిరుద్యోగులు, ఉద్యోగార్థులకు దిశానిర్దేశం చేస్తూ వివిధ అంశాలపై ప్రసంగాలు చేయడంతో పాటు, యూట్యూబ్, సామాజిక మాధ్యమాల ద్వారా తన సందేశాలను విస్తృతంగా ప్రజల్లోకి తీసుకెళ్తున్నారు.పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల నేపథ్యంలో విద్య, ఉపాధి అవకాశాలు, నిరుద్యోగ సమస్యలు, ఉన్నత విద్య అభివృద్ధి వంటి అంశాలు ప్రాధాన్యత సంతరించుకుంటున్నాయి. ఈ తరుణంలో యువతకు సుపరిచితుడైన బి.ఆర్. షఫీ ఎన్నికల బరిలోకి దిగేందుకు సిద్ధమవడం రాజకీయ వర్గాల్లోనూ చర్చనీయాంశంగా మారింది.

రాష్ట్రస్థాయి వాలీబాల్ పోటీలకు శ్రీనిధి విద్యార్థి ఎంపిక

మధిర, సెప్టెంబర్,30, వుదయం, ప్రతినిధి:

శ్రీనిధి జూనియర్ కళాశాల విద్యార్థి ఎస్కే షరీఫ్ రాష్ట్రస్థాయి అండర్19 వాలీబాల్ జట్టుకు ఎంపికయ్యాడు. అక్టోబర్ 8,9, 10 తేదీల్లో మహబూబ్‌నగర్‌లో నిర్వహించనున్న రాష్ట్రస్థాయి అండర్19 వాలీబాల్ పోటీల్లో షరీఫ్ పాల్గొననున్నాడు.కళాశాలలో ద్వితీయ సంవత్సరం ఎంపీసీ చదువుతున్న షరీఫ్ చదువుతో పాటు క్రీడలపై ఆసక్తి పెంచుకొని,తన ప్రతిభతో రాష్ట్రస్థాయి జట్టుకు ఎంపిక కావడం పట్ల కళాశాల చైర్మన్ వై. అనిల్ కుమార్ నెహ్రు, ప్రిన్సిపాల్ తాళ్లూరి రమేష్ హర్షం వ్యక్తం చేశారు.ఈ సందర్భంగా వారు షరీఫ్‌ను అభినందించి, రాష్ట్రస్థాయి పోటీల్లో ఉత్తమ ప్రతిభ కనబరిచి కళాశాలకు మంచి పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు.విద్యార్థుల్లో క్రీడా ప్రతిభను ప్రోత్సహించేందుకు కళాశాల ఎల్లప్పుడూ ప్రాధాన్యత ఇస్తుందని తెలిపారు.

ఎల్ఆర్ఎస్ ను సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల్లో నిరంతరం కొనసాగించాలి

- నాలా కన్వర్షన్ పై ఫ్లాట్ నంబర్లతో రిజిస్ట్రేషన్లు చేయాలి
- తెలంగాణ రియల్ ఎస్టేట్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షులు పంతంగి వీరస్వామి గౌడ్

సూర్యాపేట, సెప్టెంబర్ 30: వుదయం ప్రతినిధి

తెలంగాణ ప్రభుత్వం రాష్ట్రవ్యాప్తంగా ఎల్ఆర్ఎస్ విధానాన్ని సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల్లో నిరంతరం కొనసాగించాలని తెలంగాణ రియల్ ఎస్టేట్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షులు పంతంగి వీరస్వామి గౌడ్ డిమాండ్ చేశారు. బుధవారం సూర్యాపేట జిల్లా కేంద్రంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. ప్రభుత్వం ఇటీవల ఎల్ఆర్ఎస్ ను నిలిపివేయడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని, పాత పద్ధతిలోనే ఎల్ఆర్ఎస్ ను కొనసాగించాలని కోరారు. ఎకరం, రెండు ఎకరాల లోపు ఉన్న భూములకు నాలా కన్వర్షన్ పై ఫ్లాట్ నంబర్లు వేసి రిజిస్ట్రేషన్లు చేసేలా మార్గదర్శకాలు విడుదల చేయాలన్నారు. 2020లో ఎల్ఆర్ఎస్ కోసం రూ.10 వేలు చెల్లించిన వారికి రిజిస్ట్రేషన్ అవకాశం కల్పించాలని విజ్ఞప్తి చేశారు. సొంత భవనాలు లేని సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాలకు స్థలం, నిధులు కేటాయించి మౌలిక వసతులతో సూతన భవనాలు నిర్మించాలన్నారు. 22-ఏ నిషేధిత భూముల సమస్యను త్వరితగతిన పరిష్కరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు జలగం సత్యం గౌడ్, జిల్లా ప్రధాన కార్యదర్శి వెన్నా శ్రీనివాస్ రెడ్డి, రాష్ట్ర కార్యదర్శులు అమరవాది శ్రావణ్, కంభంపాటి అంజయ్య గౌడ్, నాయకులు ఆకుల మారయ్య గౌడ్, ఐతగాని మల్లయ్య గౌడ్, రాపర్తి జానయ్య, విన్ను, నరేష్, పట్టేటి కిరణ్, మాదిరెడ్డి గోపాల్ రెడ్డి, సారగండ్ల కోటేష్ తదితరులు పాల్గొన్నారు.

ప్రజలు నిజాలను అర్థం చేసుకుంటున్నారు

అవినీతి రహిత పాలనే మన ధ్యేయం
సత్తుపల్లి ఎమ్మెల్యే డాక్టర్ మట్టా రాగమయి దయానంద్

కల్లూరు, సెప్టెంబర్ 30 (వుదయం ప్రతినిధి)

రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడిన ప్పటి నుంచి ప్రతిపక్షాలు చేస్తున్న విమర్శలు, దుష్ప్రచారాలకు కాలమే సమాధానం చెబుతుందని, ప్రజలు ఇప్పటికే నిజాలను గ్రహిస్తున్నారని సత్తుపల్లి ఎమ్మెల్యే డాక్టర్ మట్టా రాగమయి దయానంద్ పేర్కొన్నారు. శుక్రవారం ఆమె మీడియాతో మాట్లాడుతూ.. పార్టీ కార్యకర్తలు, ప్రజల్లో ఉన్న పలు సందేహాలు, నియోజకవర్గ పరిస్థితులపై స్పందిస్తూ కీలక విషయాలను పంచుకున్నారు. వ్యవస్థలో అవినీతికి తావు లేకుండా పారదర్శక పాలన అందించాలని నిర్ణయించుకున్నప్పుడు ఎన్నో సమస్యలు, ప్రతిపక్షాల నుంచి ఒత్తిళ్లు ఎదురుకావడం సహజమని ఎమ్మెల్యే అన్నారు. అయితే, కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తల్లో ప్రతిపక్షాలు నింపేందుకు ప్రయత్నించిన అపోహలు ఇప్పుడిప్పుడే తొలగిపోతున్నాయని స్పష్టం చేశారు.

90 శాతానికి పైగా హామీల అమలు

ప్రభుత్వానికి బడ్జెట్ పరిమితులు ఉన్నప్పటికీ, ముఖ్యమంత్రి, కేబినెట్ మంత్రుల నాయకత్వంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీల్లో 90 శాతానికి పైగా నెరవేర్చిందని చెప్పారు. ప్రతిష్టాత్మకమైన ₹2 లక్షల రుణమాఫీతో పాటు అనేక సంక్షేమ పథకాలను మధ్యవర్తులు, అవినీతి లేకుండా నేరుగా ప్రజలకు అందిస్తుంటే.. ఓర్వలేక ప్రతిపక్షాలు నానా యాగి చేస్తున్నాయని మండిపడ్డారు. రాజకీయాల్లో ప్రతిపక్షాల విమర్శలు సహజమేనన్న ఆమె.. వారి రాజకీయ స్వార్థం కోసం సంక్షేమ పథకాలు, అభివృద్ధిపై నిత్యం దుష్ప్రచారం చేస్తున్నారని ధ్వజమెత్తారు. "మా కార్యకర్తలు, నాయకుల దగ్గర విపరీతంగా డబ్బు ఉందంటూ ప్రతిపక్ష నాయకులే చెప్పుకుంటున్నారు. అదే సమయంలో అధికార పార్టీ నాయకులు, కార్యకర్తల వద్ద అక్రమంగా ప్రోగుచేసిన డబ్బు ఎందుకు లేదో ప్రజలు ఆలోచించాలి. మేము అవినీతికి తావివ్వకుండా, పైసా పక్కదారి పట్టకుండా పనిచేస్తున్నాం. వారు గతంలో అవినీతికి పాల్పడ్డారు కాబట్టే వారి వద్ద ఆ డబ్బులు ఉన్నాయి" అని ఎమ్మెల్యే సూటిగా వ్యాఖ్యానించారు.

స్వార్థం లేని పాలనకు ప్రజల ఆదరణ

నిజాలు బయటకు రావడానికి కొంత సమయం పట్టినా (లేట్ అయినా).. ప్రస్తుత పరిస్థితులను, ప్రభుత్వం అందిస్తున్న మంచి పాలనను ప్రజలు ఇప్పుడిప్పుడే సరిగ్గా అర్థం చేసుకుంటున్నారని డాక్టర్ మట్టా రాగమయి దయానంద్ తెలిపారు. ఎలాంటి స్వార్థం లేకుండా ప్రతి నిమిషం ప్రజల సంక్షేమం కోసమే పనిచేస్తున్న తమకు నియోజకవర్గ ప్రజల నుంచి అపూర్వ ఆదరణ లభిస్తోందని ధీమా వ్యక్తం చేశారు.

కల్లూరులో జూనియర్ సివిల్ జడ్జి కోర్టును ఏర్పాటు చేయాలి

- సీఎంకు వినతి
- సత్తుపల్లి కోర్టుల్లో కల్లూరు ప్రాంతానివే 1,800 కేసులు పెండింగ్‌లో ఉన్నాయన్న న్యాయవాది రామనర్సింహారావు

కల్లూరు, సెప్టెంబర్ 30(వుదయం ప్రతినిధి)

సత్తుపల్లి నియోజకవర్గ పరిధిలోని కల్లూరు మండల కేంద్రంలో నూతనంగా 'జుడీషియల్ ఫస్ట్ క్లాస్ మెజిస్ట్రేట్' కోర్టును ఏర్పాటు చేయాలని కోరుతూ తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రికి అడ్వకేట్ పి. రామనర్సింహారావు, కల్లూరు ప్రాంత ప్రజలు వినతిపత్రం సమర్పించారు. రాష్ట్ర ప్రభుత్వం ఇటీవల న్యాయ పాలన సౌలభ్యం కోసం 200 నూతన కోర్టులను మంజూరు చేసిందని, అందులో భాగంగా సత్తుపల్లికి ఒక అదనపు జేఎఫ్‌సీఎం కోర్టును కేటాయించారని ఆయన గుర్తుచేశారు. అయితే, సత్తుపల్లిలో ఇప్పటికే స్థల కొరత తీవ్రంగా ఉందని, ఐదవ అదనపు జిల్లా కోర్టు, సీనియర్ సివిల్ కోర్టుతో పాటు రెండు జేఎఫ్‌సీఎం కోర్టులు వసతుల లేమితో నడుస్తున్నాయని వివరించారు. ప్రయాణ భారం: కల్లూరు పరిధిలోని సరిహద్దు గ్రామాలైన తెలగారం, మర్లపాడు, చిన్నకోరికొండి, దారుక బంజర్ తదితర గ్రామాల ప్రజలు సత్తుపల్లి కోర్టుకు వెళ్లాలంటే దాదాపు 60 కిలోమీటర్లు ప్రయాణించాల్సి వస్తోందని, దీనివల్ల ప్రజలు, వాదులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. కల్లూరు గతంలో సమితి, మండల కేంద్రంగా ఉండి, ప్రస్తుతం మున్సిపాలిటీగా రూపాంతరం చెందిందని, ఇక్కడి జనాభా 90,000 పైగా ఉందన్నారు. ఇప్పటికే కల్లూరులో అదనపు కలెక్టర్ కార్యాలయం, ఏసీపీ కార్యాలయాలు సేవలు అందిస్తున్నాయని పేర్కొన్నారు. ప్రస్తుతం సత్తుపల్లి కోర్టుల్లో పెండింగ్‌లో ఉన్న కేసుల్లో ఒక్క కల్లూరు ప్రాంతానివే దాదాపు 1,800 సివిల్, క్రిమినల్ కేసులు ఉన్నాయని తెలిపారు. సత్తుపల్లితో పోలిస్తే కల్లూరులో కోర్టు ఏర్పాటుకు సరిపడా ప్రభుత్వ భవనాలు, తగిన స్థలం సిద్ధంగా ఉన్నాయని స్పష్టం చేశారు. ఈ కారణాల దృష్ట్యా సత్తుపల్లికి బదులుగా కల్లూరులోనే నూతన జుడీషియల్ ఫస్ట్ క్లాస్ మెజిస్ట్రేట్ కోర్టును ఏర్పాటు చేయాలని, తద్వారా ఈ ప్రాంత ప్రజలకు న్యాయం చేకూర్చాలని ప్రభుత్వాన్ని కోరారు.

ముఖ్యమంత్రిని మర్యాదపూర్వకంగా కలిసిన కాంగ్రెస్ ఎమ్మెల్సీ అభ్యర్థులు

సూర్యాపేట, సెప్టెంబర్ 30: వుదయం ప్రతినిధి

ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డితో కాంగ్రెస్ పార్టీ గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ అభ్యర్థులు బుధవారం భేటీ అయ్యారు. నల్లగొండ-ఖమ్మం-వరంగల్ గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ అభ్యర్థి రామ్ రెడ్డి సర్వోత్తమ్ రెడ్డి, హైదరాబాద్-రంగారెడ్డి-మహబూబ్ నగర్ గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ అభ్యర్థి సామ రామ్మోహన్ రెడ్డిలు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు. ఎన్నికలకు కాంగ్రెస్ పార్టీ అభ్యర్థిగా ఖరారైనందున ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, పీసీసీ అధ్యక్షుడు మహేశ్ కుమార్ గౌడ్ ను హైదరాబాద్ లోని ఆయన నివాసంలో మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచారం, పార్టీ కార్యక్రమాలు, గ్రాడ్యుయేట్ ఓటర్ల సమన్వయంపై చర్చించారు. తమను అభ్యర్థిగా ఎంపిక చేసిన పార్టీ అధిష్టానానికి, పీసీసీ అధ్యక్షుడికి కృతజ్ఞతలు తెలిపారు. పార్టీ నాయకులు, కార్యకర్తల సమన్వయంతో ఎన్నికల్లో ముందుకు సాగుతామని పేర్కొన్నారు. కార్యక్రమంలో డీసీసీ అధ్యక్షుడు గుడిపాటి నర్సయ్య, సీనియర్ కాంగ్రెస్ నాయకులు రాంరెడ్డి కృష్ణారెడ్డి, మున్సిపల్ కౌన్సిలర్ కొండపల్లి దిలీప్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

మండల స్థాయి క్రీడల్లో మూడోసారి ఛాంపియన్స్‌గా శ్రీనిధి కాన్సెప్ట్ స్కూల్

మధిర, సెప్టెంబర్ 30, వుదయం, ప్రతినిధి:

టీవీఎం పాఠశాలలో నిర్వహించిన మధిర మండల స్థాయి పాఠశాల క్రీడా సమాఖ్య క్రీడా పోటీల్లో శ్రీనిధి కాన్సెప్ట్ స్కూల్ విద్యార్థులు అద్భుత ప్రతిభ కనబరిచి వరుసగా మూడోసారి ఓవరాల్ ఛాంపియన్‌షిప్‌ను కైవసం చేసుకున్నారు.సీనియర్ బాలికల కబడ్డీ, జూనియర్ బాలికల కబడ్డీ, జూనియర్ బాలుర కబడ్డీ విభాగాల్లో ప్రథమ బహుమతులు సాధించగా, సీనియర్ బాలుర వాలీబాల్‌లో సంయుక్త విజేతలుగా నిలిచారు. సీనియర్ బాలికల వాలీబాల్, సీనియర్ బాలికల ఖోఖో, జూనియర్ బాలుర ఖోఖో విభాగాల్లో ద్వితీయ బహుమతులు సాధించారు. మొత్తం ఏడు విభాగాల్లో బహుమతులు సాధించి ఓవరాల్ ఛాంపియన్‌షిప్‌ను సొంతం చేసుకున్నారు.ఈ సందర్భంగా పాఠశాల కరస్పాండెంట్ బి. అంజన బాబు, డైరెక్టర్ చందు మాట్లాడుతూ విద్యతో పాటు క్రీడలకు కూడా సముచిత ప్రాధాన్యతనిస్తూ విద్యార్థులను అన్ని విధాలుగా ప్రోత్సహిస్తున్నామని తెలిపారు. క్రీడల్లో విద్యార్థులు సాధిస్తున్న విజయాలు పాఠశాల యాజమాన్యం,ఉపాధ్యాయులుక్రీడా సిబ్బంది చేస్తున్న కృషికి నిదర్శనమన్నారు. విద్యార్థులకు క్రీడల్లో శిక్షణ అందిస్తున్న పి.డి. ప్రవీణ్, పి.ఈ.టి. శివను పాఠశాల యాజమాన్యం అభినందించింది. ఓవరాల్ ఛాంపియన్‌షిప్ సాధించిన క్రీడాకారులను పాఠశాల ప్రిన్సిపాల్ శ్రీనివాస్, ఉపాధ్యాయులు అభినందించి, భవిష్యత్తులో మరిన్ని విజయాలు సాధించాలని ఆకాంక్షించారు.

సీతంపేట గ్రామంలో పౌర హక్కుల పై అవగాహన

చింతకాని. సెప్టెంబర్ 30 (వూదయం):

మండల పరిధిలోని సీతంపేట గ్రామంలో షెడ్యూల్డ్ కులాల అభివృద్ధి శాఖ ఆధ్వర్యంలో పౌర హక్కుల పై అవగాహన సదస్సు నిర్వహించినైనది ఈ కార్యక్రమానికి గ్రామ సర్పంచ్ ఆళ్ల నాగమణి అధ్యక్షత వహించారు ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ మా గ్రామ ప్రజలకు పౌర హక్కుల పై అవగాహన సదస్సు నిర్వహించిన అధికారులకు కృతజ్ఞతలు తెలిపారు ప్రతి గ్రామంలో ఇలాంటి కార్యక్రమాలు నిర్వహించడం వలన ప్రజల్లో చైతన్యం పెరుగుతుందని పేర్కొన్నారు ఈ కార్యక్రమాన్ని ఉద్దేశించి తాసిల్దార్ దినవల్లి కరుణశ్రీ మాట్లాడుతూ రాజ్యాంగం కల్పించిన పౌర హక్కుల పై ప్రజలు అవగాహన కలిగి ఉండాలని మీ గ్రామంలో బడిలో గాని దేవాలయాలలో గాని ప్రజలందరూ సమానమని ప్రజల మధ్య భేదాభిప్రాయాలు లేకుండా ఉండాలని కోరారు గ్రామాల్లో కుల దూషణలు, వివక్ష లేదా సామాజిక సమస్యలు

ఉద్యోగ విరమణ పొంది ఏఎస్ఐ ఎండీ అజీజుద్దీన్

జిల్లా పోలీస్ కార్యాలయంలో ఆత్మీయ వీడ్కోలు

జగిత్యాల సెప్టెంబర్ 30 (వుదయం ప్రతినిధి)

పోలీస్ శాఖలో గత 37 సంవత్సరాలుగా విధులు నిర్వహించి ప్రస్తుతం జగిత్యాల పట్టణ పోలీస్ స్టేషన్ లో విధులు నిర్వహిస్తూ ఉద్యోగ విరమణ పొందుతున్న ఏఎస్ఐ అజీజుద్దీన్ ను బుధవారం జిల్లా పోలీస్ కార్యాలయంలో జిల్లా సుపరేండెంట్ ఆఫ్ పోలీస్ అశోక్ కుమార్ పూలమాల వేసి శాలువాలతో సన్మానించారు సుధీర్ఘ కాలంగా పోలీస్ శాఖ లో విధులు నిర్వహించి సేవలు మరువమన్నారు పదవి విరమణ అనంతరం కుటుంబ సభ్యులతో అనందంగా వారి భావిజీవితం ఆయురారోగ్యాలతో సుఖసంతోషాలతో గడపాలని ఆకాంక్షినారు ఈ కార్యక్రమంలో ఎస్ బి ఇన్స్పెక్టర్ ఆరిఫ్ అలీఖాన్ సిబ్బంది పాల్గొన్నారు.

బ్యాంకింగ్ లావాదేవీల్లో అప్రమత్తత అవసరం

కేడీసీసీ బ్యాంక్ మేనేజర్ కె. ఉదయశ్రీ

మంథని: సెప్టెంబర్ 30 వుదయం ప్రతినిధి

బ్యాంకింగ్ లావాదేవీలు, డిజిటల్ చెల్లింపుల విషయంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని కేడీసీసీ బ్యాంక్ మేనేజర్ కె. ఉదయశ్రీ సూచించారు. బుధవారం మంథని మండలం వెంకటాపూర్‌లో నిర్వహించిన ఆర్థిక అక్షరాస్యత అవగాహన సదస్సులో ఆమె మాట్లాడారు. లోన్ యాప్‌లు, లాటరీలు, పార్ట్‌టైమ్ ఉద్యోగాలు, తక్కువ పెట్టుబడితో అధిక లాభాలు, పాన్, ఆధార్ అప్‌డేట్ పేరుతో వచ్చే అనుమానాస్పద మెసేజ్‌లు, లింక్‌లను నమ్మవద్దన్నారు. ఓటీపీ, ఏటీఎం పిన్, పాస్‌వర్డ్, బ్యాంకు ఖాతా వివరాలను ఇతరులకు వెల్లడించరాదని సూచించారు. ఆశ, భయాన్ని ఆసరాగా చేసుకుని సైబర్ నేరగాళ్లు మోసాలకు పాల్పడుతున్నారని తెలిపారు. రైతులకు కిసాన్ క్రెడిట్ కార్డుతో పాటు పాడి పశువులు, గొర్రెలు, తోటలు, ట్రాక్టర్లు, గోదాములు తదితర వ్యవసాయ అవసరాలకు వివిధ రకాల రుణ సదుపాయాలు అందుబాటులో ఉన్నాయని వివరించారు. యూపీఐ, ఐఎంపీఎస్, గూగుల్‌పే, ఫోన్‌పే వంటి డిజిటల్ సేవలను సురక్షితంగా వినియోగించుకోవాలని సూచించారు. ప్రధానమంత్రి జీవన్ జ్యోతి బీమా, సురక్ష బీమా పథకాలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ముందుగా రమేష్ బృందం బుర్రకథ ద్వారా అవగాహన కల్పించింది. కార్యక్రమంలో ఏఎంసీ చైర్మన్ కుడుదుల వెంకన్న, సర్పంచ్ తోట పోచయ్య, ఉపసర్పంచ్ కీర్తి సాయి, ఫీల్డ్ ఆఫీసర్ సందెబోయిన శ్రీనివాస్, ఎఫ్ఎల్‌సీ మోహన్‌రావు, బ్యాంకు, సహకార సంఘం నిబ్బంది, గ్రామస్తులు పాల్గొన్నారు.

తెగుళ్ల నివారణపై రైతులకు సూచనలు..

హరిపురంలో వరి పంటలను పరిశీలించిన ఎంఏఓ జే అనుష

ముత్తారం సెప్టెంబర్ 30(వుందయం ప్రతినిధి):

మండలంలోని హరిపురం గ్రామానికి చెందిన రైతు రామంచ రాజబాబు సాగు చేస్తున్న వరి పంటలను మండల వ్యవసాయ అధికారి జే. అనుష బుధవారం పరిశీలించారు.ప్రస్తుత వాతావరణ పరిస్థితుల్లో బ్యాక్టీరియా ఆకు ఎండు తెగులు,సుడిదోమ వచ్చే అవకాశం ఉన్నందున రైతులు అప్రమత్తంగా ఉండాలని సూచించారు.తెగుళ్ల నివారణకు తగిన మందులను పిచికారీ చేయాలని, పొలాలను తరచూ పరిశీలిస్తూ సమస్యలు గుర్తిస్తే వెంటనే వ్యవసాయ శాఖ అధికారులను సంప్రదించాలని సూచించారు.ఈ కార్యక్రమంలో ఏఈఓ బి.శశిధర్, రైతులు పాల్గొన్నారు.

పలు అభివృద్ధి కార్యక్రమాలు ప్రారంభించిన కోరుట్ల ఎమ్మెల్యే డాక్టర్ కల్వకుంట్ల సంజయ్

కోరుట్ల సెప్టెంబర్ 30 (వుదయం ప్రతినిధి)

కోరుట్ల మండలం సంగెం గ్రామంలో బుధవారం చేపట్టిన పలు అభివృద్ధి కార్యక్రమాలను స్థానిక సర్పంచ్ చీటీ స్వరూప వెంకట్రావులతో కలిసి ప్రారంభించిన కోరుట్ల నియోజకవర్గ శాసనసభ్యులు డాక్టర్ కల్వకుంట్ల సంజయ్ ఇందులో భాగంగా 10లక్షల రూపాయల వ్యయంతో నిర్మించిన నూతన మహిళా సంఘ భవనాన్ని ప్రారంభించి అనంతరం 20 లక్షల రూపాయల వ్యయంతో నిర్మించబోయే నూతన గ్రామపంచాయతీ భవనానికి భూమి పూజ చేశారు అలాగే పది లక్షల రూపాయల వ్యయంతో నిర్మించిన నూతన సిసి రోడ్డును ఎమ్మెల్యే డాక్టర్ కల్వకుంట్ల సంజయ్ ప్రారంభించారు ఈ కార్యక్రమంలో పలువురు ప్రజా ప్రతినిధులు అధికారులు నాయకులు మహిళా సంఘాల సభ్యులు గ్రామస్తులు యువకులు మహిళలు తదితరులు పాల్గొన్నారు.

కోరుట్ల మున్సిపాలిటీలో సఫాయి మిత్ర సురక్ష ఏవం సమ్మాన్ శిబిర్

- **పారిశుద్ధ్య కార్మికులకు ఉచిత వైద్య పరీక్షలు మందుల పంపిణీ...**
- **కార్మికుల రక్షణే ధ్యేయంగా పిపిఈ కిట్ల అందజేత...**

కోరుట్ల సెప్టెంబర్ 30 (వుదయం ప్రతినిధి)

దేశ వ్యాప్తంగా సాగుతున్న 'స్వచ్ఛతా హి సేవా 2026' కార్యక్రమంలో భాగంగా కోరుట్ల మున్సిపాలిటీ ఆధ్వర్యంలో పారిశుద్ధ్య కార్మికుల కొరకు ప్రత్యేకంగా 'సఫాయి మిత్ర సురక్ష ఏవం సమ్మాన్ శిబిర్' (ఉచిత వైద్య ఆరోగ్య శిబిరం) నిర్వహించారు మున్సిపల్ కార్యాలయ ప్రాంగణంలో ఏర్పాటు చేసిన ఈ వైద్య శిబిరాన్ని మున్సిపల్ చైర్‌పర్సన్ తిరుమల వసంత మున్సిపల్ కమిషనర్ వి రాఘవేంద్ర తో కలిసి ప్రారంభించారు ఇట్టి శిబిరంలో పట్టణ పారిశుద్ధ్య కార్మికులకు (సఫాయి మిత్రలకు) నిపుణులైన వైద్య బృందం చేత పూర్తి స్థాయి ఆరోగ్య పరీక్షలు (హెల్త్ చెకప్) నిర్వహించి వారికి అవసరమైన మందులను ఉచితంగా పంపిణీ చేశారు అనంతరం కార్మికుల విధి నిర్వహణలో భద్రత రక్షణ కొరకు మున్సిపల్ చైర్‌పర్సన్ తిరుమల వసంత కమిషనర్ వి రాఘవేంద్ర వైస్ చైర్ పర్సన్ మహమ్మద్ షాహెద్ ఉల్ అహద్ పలు వార్డు కౌన్సిలర్లు కో అప్షన్ సభ్యుల చేతుల మీదుగా పారిశుద్ధ్య కార్మికులందరికీ పిపిఈ కిట్లను పంపిణీ చేశారు అనంతరం మున్సిపల్ చైర్‌పర్సన్ తిరుమల వసంత మాట్లాడుతూ పట్టణాన్ని స్వచ్ఛంగా ఉంచడంలో నిరంతరం శ్రమిస్తున్న పారిశుద్ధ్య కార్మికుల ఆరోగ్యం రక్షణే ధ్యేయంగా ఈ శిబిరం ఏర్పాటు చేసినట్లు తెలిపారు కార్మికులు విధులు నిర్వహించేటప్పుడు తప్పనిసరిగా రక్షణ కిట్లను పిపిఈ కిట్స్ ధరించాలని ఆరోగ్య విషయాలపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని సూచించారు అనంతరం కమిషనర్ రాఘవేంద్ర మాట్లాడుతూ ప్రతి ఒక్క కార్మికుడు ఇట్టి వైద్య శిబిరాన్ని రక్షణ పరికరాలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

ప్రకృతి పరిరక్షణకు కృషి చేయాలి



ప్రకృతి ప్రేమికుడు గట్టు కృష్ణమూర్తి

మంథని, సెప్టెంబర్ 30: వుదయం ప్రతినిధి

సేవా సంకల్ప అభియాన్‌లో భాగంగా సమాజ సేవకుడు, ప్రకృతి ప్రేమికుడు గట్టు కృష్ణమూర్తిని మంథని బీజేపీ పట్టణ శాఖ ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు. సొంత ఖర్చులతో మొక్కలు నాటడం, రోడ్లపై గుంతలు పూడ్చడం, విద్యార్థులకు ప్రకృతి పరిరక్షణపై అవగాహన కల్పించడం వంటి సేవలు చేస్తున్నారని నిర్వాహకులు తెలిపారు. ప్లాస్టిక్ వినియోగం వల్ల కలిగే అనర్థాలపై కూడా ప్రజలకు అవగాహన కల్పిస్తున్నారని పేర్కొన్నారు. ఈ సందర్భంగా కృష్ణమూర్తి మాట్లాడుతూ ప్రకృతి పరిరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యత అన్నారు. ప్రకృతిని నాశనం చేస్తే జీవరాశుల మనుగడకు ముప్పు ఏర్పడుతుందని తెలిపారు. భవిష్యత్‌లో ప్రకృతి వైపరీత్యాలను ఎదుర్కొనేందుకు ప్రతి ఒక్కరూ ప్రకృతి సంరక్షణలో భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. కార్యక్రమానికి బీజేపీ పట్టణ అధ్యక్షుడు సబ్బని సంతోష్ అధ్యక్షత వహించారు. బోగోజు శ్రీనివాస్, రాపర్తి సంతోష్, నారమల్ల కృష్ణ, బూడిద తిరుపతి, సామల అశోక్ తదితరులు పాల్గొన్నారు.

చలో సిరిసిల్లకు భారీగా తరలిన జగిత్యాల కాంగ్రెస్ శ్రేణులు

- **జెండా ఊపి ర్యాలీని ప్రారంభించిన జగిత్యాల ఎమ్మెల్యే డాక్టర్ యం సంజయ్ కుమార్**
- **120కి పైగా బస్సులు 150కి పైగా కార్లలో కార్యకర్తలు నాయకులు బయలుదేరారు**

జగిత్యాల సెప్టెంబర్ 30 (వుదయం ప్రతినిధి)

ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి రాజన్న సిరిసిల్ల పర్యటన సందర్భంగా నిర్వహిస్తున్న కార్యక్రమానికి జగిత్యాల నియోజకవర్గం నుంచి కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు భారీగా తరలివెళ్లారు జగిత్యాల పట్టణ పద్మనాయక కళ్యాణ మండపం నుంచి ఏర్పాటు చేసిన భారీ ర్యాలీని జగిత్యాల నియోజకవర్గ శాసనసభ్యులు డాక్టర్ యం సంజయ్ కుమార్ జెండా ఊపి ప్రారంభించారు అనంతరం ఎమ్మెల్యే కాంగ్రెస్ పార్టీ నాయకులు కార్యకర్తలతో కలిసి సిరిసిల్లకు బయలుదేరారు జగిత్యాల నియోజకవర్గంలోని వివిధ మండలాలు గ్రామాలు పట్టణ ప్రాంతాల నుంచి నాయకులు కార్యకర్తలు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు ఈ సందర్భంగా 120కి పైగా బస్సులు 150కి పైగా కార్లలో కాంగ్రెస్ పార్టీ శ్రేణులు సిరిసిల్లకు బయలుదేరాయి ఈ సందర్భంగా ఎమ్మెల్యే డాక్టర్ యం సంజయ్ కుమార్ మాట్లాడుతూ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కార్యక్రమాన్ని విజయవంతం చేసేందుకు జగిత్యాల నియోజకవర్గం నుంచి కాంగ్రెస్ పార్టీ శ్రేణులు పెద్ద సంఖ్యలో తరలివెళ్తున్నాయని తెలిపారు కాంగ్రెస్ పార్టీ నాయకులు కార్యకర్తలు అభిమానులు పెద్ద ఎత్తున తరలిరావడం పట్ల ఆయన అభినందనలు తెలిపారు ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ ప్రజాప్రతినిధులు ముఖ్య నాయకులు మండల పట్టణ అధ్యక్షులు అనుబంధ సంఘాల నాయకులు కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు

కాంగ్రెస్ పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శిగా ఖుతుబోద్దీన్ పాషా

టిపిసిసి కల్వకుంట్ల సుజిత్ రావు నేతృత్వంలో ఖుతుబోద్దీన్ పాషా కు కీలక బాధ్యతలు

మెట్ పల్లి సెప్టెంబర్ 30 (వుదయం విలేకరి)

జగిత్యాల జిల్లా కాంగ్రెస్ పార్టీ ప్రధాన కార్యదర్శిగా మెట్ పల్లి పట్టణానికి చెందిన మైనారిటీ నాయకులు మహమ్మద్ ఖుతుబోద్దీన్ పాషా ను నియమిస్తూ జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు గాజంగి నందయ్య బుధవారం ఉత్తర్వులు జారీ చేశారు టిపిసిసి డెలిగేట్ మెంబర్ సుజిత్ రావు నేతృత్వంలో కాంగ్రెస్ అధిష్టానం ఈ మేరకు నిర్ణయం తీసుకోగా ఖుతుబోద్దీన్ పాషా కు నియామక ఉత్తర్వులు అందజేశారు రాజకీయాల్లో చురుకైన పాత్ర పోషిస్తూ ప్రజా సమస్యల పరిష్కారంలో ముందుండే ఖుతుబోద్దీన్ పాషా జిల్లా స్థాయి పదవిని కైవసం చేసుకోవడం పట్ల నియోజకవర్గ కాంగ్రెస్ శ్రేణుల్లో హర్షాతిరేకాలు వ్యక్తమవుతున్నాయిఈ సందర్భంగా పలువురు కాంగ్రెస్ సీనియర్ నాయకులు కార్యకర్తలు వార్డు ప్రజలు ఆయనను కలిసి అభినందనలు తెలియజేశారు తనపై నమ్మకంతో ఇంతటి కీలక బాధ్యతలను అప్పగించినందుకు రాష్ట్ర కాంగ్రెస్ నాయకత్వానికి ఖుతుబోద్దీన్ పాషా ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వార్డు స్థాయి నుంచి తనను గమనించి జిల్లా స్థాయిలో ఈ గుర్తింపు ఇవ్వడం ఎంతో ఆనందంగా ఉందన్నారు తనపై పెట్టిన నమ్మకాన్ని వమ్ము చేయకుండా పార్టీ బలోపేతానికి తానికి ఎల్లవేళలా కష్టపడతానని కాంగ్రెస్ పార్టీని నియోజకవర్గంలో తార స్థాయికి చేర వేర్చడమే తన లక్ష్యమని ఆయన ధీమా వ్యక్తం చేశారు వార్డు ప్రజల సమస్యల పరిష్కారానికి పార్టీ శ్రేణుల సంక్షేమానికి నిరంతరం అందుబాటులో ఉంటానని ఖుతుబోద్దీన్ పాషా స్పష్టం చేశారు తన నియామకానికి సహకరించిన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మంత్రులు శ్రీధర్ బాబు అడ్డూరి లక్ష్మణ్ కుమార్ కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర అధ్యక్షులు మహేష్ కుమార్ గౌడ్ మెట్‌పల్లి వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ కూన గోవర్ధన్ కిసాన్ సెల్ రాష్ట్ర కో ఆర్డినేటర్ వాకిటి సత్యం రెడ్డి లకు కృతజ్ఞతలు తెలిపారు ఈ కార్యక్రమంలో టీపీసీసీ ఫిషర్మన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రుత్త నారాయణ మల్లాపూర్ మండల కాంగ్రెస్ పార్టీ మాజీ అధ్యక్షులు కొమ్ముల చిన్నారెడ్డి మండల ఫిషర్మన్ అధ్యక్షులు రోడ్డ రాజు ఇబ్రహీంపట్నం మండల యూత్ కాంగ్రెస్ అధ్యక్షులు నల్లూరి సాగర్ పాత దాంరాజ్ పల్లి ఉప సర్పంచ్ ఇప్పపల్లి గణేష్ కలైడ గంగాధర్ ఏలేటి వినోద్ రెడ్డి బైండ్ల శ్రీకాంత్ గూడ సోల్లు ముత్యం రెడ్డి గోపిడి నరేష్ కళ్మెం శ్రీను ఎట్టం మల్లేష్ సమీర్ సర్కార్ తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ పార్టీ జగిత్యాల జిల్లా ఉపాధ్యక్షులుగా నేమురి భూమయ్య

- **పార్టీ కోసం చేసిన సేవలకు గుర్తింపు**
- **జిల్లా స్థాయిలో కీలక బాధ్యతలు**

కోరుట్ల సెప్టెంబర్ 30 (వుదయం ప్రతినిధి)

కోరుట్ల పట్టణానికి చెందిన నేమురి భూమయ్యను కాంగ్రెస్ పార్టీ జగిత్యాల జిల్లా ఉపాధ్యక్షులుగా నియమించారు ఈ సందర్భంగా ఆయనకు నియామక పత్రాన్ని బుధవారం జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షులు గాజంగి నందయ్య అందజేశారు కాంగ్రెస్ పార్టీ అభివృద్ధి బలోపేతం కోసం గత కొన్ని సంవత్సరాలుగా నేమురి భూమయ్య అందించిన సేవలను గుర్తించి ఈ బాధ్యతలు అప్పగించినట్లు తెలిపారు గతంలో ఆయన కోరుట్ల మండల ఎన్ఎస్‌యూఐ అధ్యక్షులుగా ఉమ్మడి కరీంనగర్ జిల్లా యువజన కాంగ్రెస్ పార్టీ జిల్లా ఉపాధ్యక్షులుగా జిల్లా ప్రధాన కార్యదర్శిగా వివిధ బాధ్యతలు నిర్వహించారు పార్టీ కోసం ఆయన చేసిన సేవలకు గుర్తింపుగా తాజాగా జగిత్యాల జిల్లా ఉపాధ్యక్షులుగా అవకాశం కల్పించినట్లు పేర్కొన్నారు తన నియామకానికి సహకరించిన కోరుట్ల నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ తెలంగాణ రాష్ట్ర వెలమ కార్పొరేషన్ చైర్మన్ జువ్వాడి నర్సింగరావు కాంగ్రెస్ పార్టీ సీనియర్ రాష్ట్ర నాయకులు జువ్వాడి కృష్ణరావు తెలంగాణ స్టేట్ ఫిల్మ్ ఛాంబర్ ఆఫ్ కామర్స్ అధ్యక్షులు జువ్వాడి శేఖర్ రావు కోరుట్ల పట్టణ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు తిరుమల గంగాధర్ లకు నేమురి భూమయ్య ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు తనపై నమ్మకం ఉంచి జిల్లా ఉపాధ్యక్షులుగా బాధ్యతలు అప్పగించిన నాయకులకు ధన్యవాదాలు తెలియజేస్తూ అప్పగించిన బాధ్యతలను సమర్థవంతంగా నిర్వహించి కాంగ్రెస్ పార్టీ బలోపేతానికి తనవంతు కృషి చేస్తానని భూమయ్య పేర్కొన్నారు.

జాతీయ స్థాయికి బాస్కెట్ బాల్ జగిత్యాల యువ క్రీడాకారులు

జగిత్యాల సెప్టెంబర్ 30 (వుదయం ప్రతినిధి)

అక్టోబర్ 27 నుండి మహారాష్ట్ర లోని పుణె లో జరిగే జాతీయ స్థాయి యూత్ బాస్కెట్ బాల్ క్యాంపు కు జగిత్యాల కు చెందిన యువ భాస్కెట్ బాల్ క్రీడాకారులు ఎంపికయ్యారు ఇటీవల హైదరాబాద్ లో జరిగిన మన తెలంగాణ రాష్ట్ర యూత్ బాస్కెట్ బాల్ జట్టు సెలెక్షన్స్ ను జరిగాయి ఇందులో మన జగిత్యాల నుండి బాలికల విభాగంలో వి సుధాన్వి బాలుర విభాగంలో హేమంత్ లు తమ ప్రతిభను కనబరిచి రాష్ట్ర యూత్ బాస్కెట్ బాల్ జట్టు క్యాంప్ కు ఎంపిక అయినట్లు రాష్ట్ర జాతీయ బాస్కెట్ బాల్ అసోసియేషన్ ఉపాధ్యక్షుడు డాక్టర్ వేణు గోపాల్ తెలిపారు ఎంపికైన క్రీడాకారులను పిడిలు విశ్వ ప్రసాద్ నిరంజన్ క్రిష్ణ ప్రసాద్ అజయ్ వేణు అభినందించారు.

పుష్కర ఏర్పాట్లపై సీఎండీ పరిశీలన

మంథని, సెప్టెంబర్ 30: వుదయం ప్రతినిధి

గోదావరి పుష్కరాలు–2027 నేపథ్యంలో మంథని పుష్కర ఘాట్‌ను టీజీ ఎన్పీడీసీఎల్ సీఎండీ కర్నాటి వరుణ్‌రెడ్డి బుధవారం పరిశీలించారు. భక్తులకు విద్యుత్ అంతరాయం లేకుండా పటిష్ట ఏర్పాట్లు చేయాలని అధికారులను ఆదేశించారు. అనంతరం దుబ్బపల్లిలోని ఎన్‌హెచ్‌జీ సోలార్ ప్లాంట్‌ను పరిశీలించి, విద్యుత్ ఉత్పత్తి, గ్రిడ్ అనుసంధానంపై వివరాలు తెలుసుకున్నారు. పునరుత్పాదక ఇంధన వినియోగాన్ని పెంచాలని సూచించారు. కార్యక్రమంలో ఎస్ఈ వడ్లకొండ గంగాధర్‌తో పాటు పలువురు అధికారులు పాల్గొన్నారు.

డబుల్ బెడ్ రూమ్ కాలనీలో రెవెన్యూ మంత్రి పర్యటనలో పనుల్లో జరిగిన అక్రమాలు

జగిత్యాల సెప్టెంబర్ 30 (వుదయం ప్రతినిధి)



జగిత్యాల పట్టణంలో నివసించే బడుగు బలహీన వర్గాల సొంతింటి కలను నెరవేర్చే క్రమంలో పట్టణానికి దాదాపు 7 కిమీ ల దూరంలో గతంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఉన్నప్పుడు 2008 సంవత్సరంలో ఒక్కొక్కరికి ఇండ్లు లేని నిరుపేదలకు 80 గజాల స్థలాన్ని కేటాయించగా కొంత మంది ఇంటి నిర్మాణం చేసుకోవడం జరిగింది కాని కొంత మంది ఆర్థికంగా లేక బేస్మెంటు నిర్మాణం కొంత మంది ఖాళీగా వదలి వేయగా తిరిగి తెలంగాణ ఏర్పడ్డ తరువాత తెలంగాణ ప్రభుత్వం డబుల్ బెడ్ రూమ్ ఇండ్ల నిర్మాణం చేపట్టి "4520" ఇండ్ల నిర్మాణం బహుళ అంతస్తులలో నిర్మాణం చేసి '2019" ఎలక్షన్ల ముందు హడావిడిగా కనీస మౌళిక సదుపాయాలు ఏర్పాటు చేయక ముందే లబ్దిదారులను గుర్తించి వారికి పట్టాలను ప్రోసిడింగ్ కాపీలను అందించడం జరిగింది జగిత్యాల పట్టణ పరిధి లోకి తెస్తూ ప్రభుత్వం ద్వారా గెజిట్ నోటిఫికేషన్ ఇచ్చి జిఓ జారీ చేశారు అంత బాగానే ఉంది కాని అక్కడకనీస మౌలిక సదుపాయాలు అయిన రోడ్లు మట్టితో ఉండడం వల్ల వర్షంలో ప్రజలు నడవలేని పరిస్థితి సిసి రోడ్లు వేయలేదు లైటింగ్ ఏర్పాటు చేయలేదు సాయంత్రం 6 గంటలు దాటితే రోడ్డుమీద నడిచే పరిస్థితి లేదు విపరీతమైన చీకటి అంతా ఖాళీ ప్లాట్లలో చెట్లు మొలిసి ఎక్కడ నుండి పాములు విషపురుగులు వస్తాయో తెలియని పరిస్థితి అక్కడ చాల అసాంఘిక కార్యక్రమాలు జరుగుతున్నాయని అక్కడ నివసించే ప్రజలు తెలియజేశారు మిస్సింగ్ కేసులు రేప్ కేసులు దాడుల కేసులు ఈ రకమైన ఎన్నో కేసులు జరుగుతున్న పట్టించుకునే అధికారులు లేరు ప్రజా ప్రతినిదులు లేరు ఇట్టి కాలనీ పట్టణ పరిధిలోకి వచ్చి అక్కడ దాదాపు రెండు వార్డు లుగా విభజించినప్పటికి మున్సిపల్ కార్మికులు అక్కడికి వెళ్ళరు కనీసం ఊడ్వడం డ్రైన్ తీయడం చెట్ల పొదలు తొలగించడం వంటి పనులు చేసిన దాఖలాలు లేవు అక్కడ నివసిస్తున్న దాదాపు 1000 కుటుంబాలు ఎన్నో సార్లు కలెక్టర్ దృష్టికి తీసుకు వెళ్ళి ప్రజావాణి లో దరఖాస్తులు ఇచ్చిన ఒక్క మాజీ ప్రజాప్రతినిదిగా వారి కష్టాలను.వాళ్ళు పడుతున్న ఇబ్బందులను చూడ లేక నేను జిల్లా కలెక్టర్ కు ప్రజావాణి లో దాదాపు ఒక పదిసార్లు దరఖాస్తులు ఇచ్చినప్పటికి ఎటు వంటి చర్యలు లేకపోవడంతో మీ దృష్టికి తీసుకు రావటం జరుగుతుంది అక్కడ 4520 ఇండ్లలో ఇప్పటికి దాదాపు 4320 ఇండ్లు పంపిణీ పూర్తయింది కానీ ఇప్పటికి కాలనికి బస్సు సౌకర్యం లేదు పోలీస్ స్టేషన్ లేదు ఒక్క స్కూలు లేదు ముఖ్యంగా స్మశాన వాటికలు లేక అక్కడ ఉన్న డంపింగ్ యార్డ్ ముందే శవాలను కాల్చడం పూడ్చడం చేయడంతో కాలనీలో పోల్యూషన్తో బాదపడుతున్నారు డంపింగ్ యార్డులో ఉన్న చెత్తను తరుచూ నిప్పు పెట్టడంతో విపరీతంగా పొగ వచ్చి అక్కడ నివసించే ప్రజలు అనారోగ్య బారిన పడుతూ శ్వాసకోస రోగాలతో సతమవుతున్నారు ఇన్ని రకాల ఇబ్బందులు ఎ దుర్కొంటున్న ప్రజల కొరకు ఎటువంటి ఏర్పాట్లు చేయని ఉన్నతాదికారులు మున్సిపల్ అధికారులు ప్రజా ప్రతినిదులు కానీ గత మాసంలో ఆగష్టు 21 రోజున రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి వస్తున్నారని తెలియగానే హడావిడిగా కౌన్సిల్ అప్రూవల్ లేకుండా కలెక్టర్ అప్రూవల్ తీసుకోకుండా డబుల్ బెడ్ రూమ్ కాలనీలో మున్సిపల్ కార్మికులు మున్సిపల్ పారిశుద్ధ్య వాహనాలతో పనులు ఆగష్టు 19, 20 తేదీలలో ఎంతో పని చేయించినట్లు 16 లక్షల రూపాయలు ఖర్చు చేసినట్లు చూపుతూ తదుపరి సాధారణ సమావేశం ఎజెండాలో పొందుపర్చి బిల్లు చెల్లింపులకు తీర్మాణం చేయడం విడ్డురంగా ఉందని 16 లక్షల రూపాయల ప్రజాధనం దుర్వినియోగం కాకుండా వెంటనే పూర్తి స్థాయిలో విచారణ జరిపించి భాద్యులైన అధికారులపైన చట్టపరమైన చర్యలు తీసుకోవాలని క్రమశిక్షణ చర్యలో భాగంగా విదుల్లోంచి తొలగించాలని డబల్ బెడ్ రూమ్ కాలనీ లో నివాసం ఉంటున్న ప్రజలు జగిత్యాల పట్టణ ప్రజలు అందరూ కూడ అంటున్నారు ఇప్పుడున్న కమీషనర్ సత్య ప్రణవ్ వచ్చిన నాటి నుండి ప్రోహిబిషన్ పీరియడ్ అంటూ ప్రజలకు అవసరమైన పనులు మోటేషన్స్ ఇంటి నెంబర్ కేటాయింపు సెల్ఫ్ అసెసుమెంట్లు బర్త్ అండ్ డెత్ సర్టిఫికెట్ ల జారీ ఇంటి పర్మిషన్లు మొదలగు పనులకు మాత్రం చిన్న తప్పులు ఉన్నా దాన్ని సవరణ చేయాలని అన్ని కరెక్ట్ గా ఉన్న ఫైలు పక్కన పెడుతూ సామాన్య ప్రజలను ఎన్నో ఇబ్బందులకు గురి చేస్తూ ఆఫీస్ చుట్టూ తిప్పుతూ ఆఫీస్ లో ఉండకుండా ఉన్న రెండు మూడు గంటలు చైర్మన్ చాంబర్లో కూర్చోని వెళ్ళిపోవడం లేదంటే కలెక్టర్ ఆఫీస్కు మిగిలిన సమయం అంతా క్వార్టర్లో ఉండడం ఈ విధంగా సామాన్య ప్రజలకు 24 గంటలు అందుబాటులో ఉండాల్సిన మున్సిపల్ కమీషనర్ ఈ విధంగా సామాన్య ప్రజలకు కావాల్సిన పనులు చేయకుండా కాంట్రాక్టు పనులు అదనపు ఎజండాలు ఈ రకంగా నిదుల దుర్వినియోగం పనులకు ప్రోత్సహిస్తున్న అధికారి జగిత్యాల పట్టణానికి వద్దంటూ జగిత్యాల పట్టణ ప్రజలందరి పక్షాన మనవి చేస్తూ డబుల్ బెడ్ రూము కాలనీలో చేసిన పనులు అంటూ 16 లక్షల రూపాయల ప్రజాధనం దుర్వినియోగంపై పూర్తి స్థాయిలో విచారణ జరిపి సంబందిత అదికారులపైన చర్యలు తీసుకోవాలని జగిత్యాల పట్టణ ప్రజలందరి పక్షాన మరొయికసారి మనవి చేస్తున్నట్లు ఇట్టి విషయంపై మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్ అండ్ అర్బన్ డెవలప్మెంట్ శాఖ కమిషనర్ కు లేఖ రాసినట్లు మాజీ కౌన్సిలర్ హనుమండ్ల జయశ్రీ తెలిపారు.

ఇంకా ఎన్నాళ్లు ఈ ముందస్తు అరెస్టులు

అక్రమ అరెస్టులతో ప్రశ్నిస్తే గొంతులను ఆపలేరు

కోరుట్ల సెప్టెంబర్ 30 (వుదయం ప్రతినిధి)

ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి రాజన్న సిరిసిల్ల జిల్లా పర్యటనలో భాగంగా కథలాపూర్ మండల భారతీయ జనతా పార్టీ నాయకుల ముందస్తు అరెస్ట్ చేసి పోలీస్ స్టేషన్ కి తరలించారు ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఈ చేతకాని ప్రభుత్వం వెంటనే గద్దె దిగాలని రాజన్న సిరిసిల్ల జిల్లాకు ఇచ్చిన హామీలను వెంటనే నెరవేర్చలని ఇచ్చిన హామీల్లో భాగంగా అన్నీ పనులు వెంటనే ప్రారంభిస్తామని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సమావేశం ప్రకటించాలని వారు డిమాండ్ చేశారు.

ప్రజల సమస్యలపై పోరాటం ఆపేది లేదు

- **కమీషన్లు వస్తేనే పనులా..?**
- **కాటారం మార్కెట్ ఏడాదైనా పూర్తి చేయకపోవడం అవమానం**
- **చిరువ్యాపారులు, ప్రజల ఇబ్బందులు పట్టించుకోవడం లేదని పుట్ట మధూకర్ విమర్శ**

మంథని సెప్టెంబర్ 30 వుదయం ప్రతినిధి

మంథని నియోజక వర్గం కాటారం మండల కేంద్రంలో నిర్మాణంలో ఉన్న వెజ్, నాన్‌వెజ్ మార్కెట్ పనులు ఏడాది గడిచినా పూర్తికాకపోవడంపై మంథని మాజీ ఎమ్మెల్యే పుట్ట మధూకర్ ఆగ్రహం వ్యక్తం చేశారు. బుధవారం మార్కెట్ నిర్మాణ పనులను పరిశీలించిన ఆయన, శంకుస్థాపన చేసి ఏడాది పూర్తయినా పనులు పూర్తి చేయకపోవడం ప్రజలను ఇబ్బందులకు గురిచేస్తోందన్నారు. మార్కెట్ అందుబాటులో లేకపోవడంతో కూరగాయలు, ఇతర వస్తువుల

లే అవుట్ అనుమతుల జారీలో నిబంధనలు పాటించాలి

- జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్
- లే అవుట్ అనుమతికి అప్రోచ్ రోడ్డు తప్పనిసరి
- వాటర్ బాడీస్ ఎఫ్.టి.ఎల్., బఫర్ జోన్‌లలో ఎటువంటి అనుమతులు ఇవ్వవద్దు
- లే అవుట్ దరఖాస్తులపై సంయుక్త తనిఖీ నివేదికలను అక్టోబర్ 15లోగా సమర్పించాలి
- జిల్లా స్థాయి లేఔట్ కమిటీ సమావేశంలో పాల్గొన్న జిల్లా కలెక్టర్

ఖమ్మం వుదయం బ్యూరో సెప్టెంబర్ 30

లే అవుట్ అనుమతుల జారీలో నిబంధనలను కట్టుదిట్టంగా పాటించాలని జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్ అన్నారు. బుధవారం జిల్లా కలెక్టర్ కలెక్టరేట్‌లో నిర్వహించిన జిల్లా స్థాయి లేఔట్ కమిటీ సమావేశంలో జిల్లా కలెక్టర్ పాల్గొని, పెండింగ్‌లో ఉన్న లేఔట్ అనుమతులపై సంబంధిత రెవెన్యూ, ఇరిగేషన్, ఎన్‌పిడిసిఎల్, టౌన్ ప్లానింగ్, తదితర లైన్ డిపార్ట్‌మెంట్ అధికారులతో సుదీర్ఘంగా చర్చించారు. ప్రతి లేఔట్ దరఖాస్తుకు సంబంధించి సంబంధిత శాఖల నుంచి రిమార్క్స్, అభ్యంతరాలు, ఎన్ఓసీల స్థితిగతులను అడిగి తెలుసుకొని పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ దివాకర్ టిఎస్ మాట్లాడుతూ లేఔట్ కమిటీ సమావేశం అనంతరం అనుమతులు మంజూరైనప్పటికీ కొంతమంది దరఖాస్తుదారులు ఆన్లైన్‌లో అనుమతులు మంజూరు కాలేదని కార్యాలయాల చుట్టూ తిరుగుతున్నారని తెలిపారు. ఇకపై లేఔట్ కమిటీ ఆమోదం పొందిన వెంటనే సంబంధిత ఆన్లైన్ మంజూరు ప్రక్రియను మూడు రోజుల్లోగా పూర్తి చేసేలా అధికారులు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. లేఔట్ అనుమతులకు సంబంధించి క్షేత్ర స్థాయిలో తప్పనిసరిగా పరిశీలన, సంయుక్త తనిఖీలు నిర్వహించాలని కలెక్టర్ సూచించారు. ప్రతిపాదిత లేఔట్ భూమి చెరువులు, నీటి వనరులు, ఎఫ్.టి.ఎల్., బఫర్ జోన్ పరిధిలో ఉందా లేదా క్షుణ్ణంగా పరిశీలించాలని అన్నారు. ఇరిగేషన్, ఎన్‌పిడిసిఎల్, టౌన్ ప్లానింగ్, రెవెన్యూ తదితర సంబంధిత శాఖలు తమ పరిధిలోని అంశాలను పరిశీలించి అవసరమైన ఎన్ఓసీలు, నివేదికలను సకాలంలో అందించాలని ఆదేశించారు. లే అవుట్కు అప్రోచ్ రోడ్డు, అంతర్గత రోడ్లు ఉండాలని అన్నారు. రోడ్డు నిర్మాణానికి అవసరమైన మేర భూమి లేఔట్‌లో కేటాయింపులు జరిగేలా అధికారులు క్షుణ్ణంగా పరిశీలించాలని తెలిపారు. లేఔట్‌లో స్ట్రీట్ లైట్స్, సీపరేజ్ వ్యవస్థ, డ్రైనేజీ వ్యవస్థ, త్రాగునీటి సరఫరా, విద్యుత్ సరఫరా తప్పనిసరిగా ఉండేలా చూడాలని కలెక్టర్ తెలిపారు. లేఔట్ ప్రాంతం నీటి వనరులు, నీటి ప్రవాహాలకు నిర్దేశించిన దూరంలో ఉండాలని, ఎఫ్.టి.ఎల్., బఫర్ జోన్ పరిధిలో ఎట్టి పరిస్థితుల్లోనూ అనుమతులు జారీ చేయరాదని స్పష్టం చేశారు. లేఔట్ ప్రాంతంలో గతంలో ఏమైనా నీటి వనరులు, నీటి ప్రవాహ మార్గాలు ఉన్నాయా అనే అంశాన్ని సంబంధిత అధికారులు సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగిస్తూ క్షుణ్ణంగా పరిశీలించాలని కలెక్టర్ ఆదేశించారు. లేఔట్ ఆమోద ప్రక్రియ పూర్తిగా పారదర్శకంగా ఉండాలని, నిబంధనలకు లోబడి మాత్రమే అనుమతులు జారీ చేయాలని తెలిపారు. అనుమతులు మంజూరు చేసిన అనంతరం కూడా వాటిలో పేర్కొన్న నిబంధనలను లేఔట్ అభివృద్ధి సమయంలో పాటిస్తున్నారా లేదా అనే అంశంపై అధికారులు పర్యవేక్షణ చేయాలని కలెక్టర్ సూచించారు. ప్రతి లేఔట్ దరఖాస్తుకు సంబంధించి సంబంధిత శాఖల నివేదికలకు స్పష్టమైన కాలపరిమితి విధించి, నిర్ణీత సమయంలో నివేదికలు సమర్పించేలా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ ఆదేశించారు. ఇప్పటికే సంయుక్త పరిశీలన అవసరమైన లేఔట్లకు సంబంధించిన జాయింట్ ఇన్స్పెక్షన్ రిపోర్టులను అక్టోబర్ 15వ తేదీలోగా సమర్పించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. ఈ సమావేశంలో ఖమ్మం మున్సిపల్ కమీషనర్ అభిషేక్ అగస్త్య, ఆర్ అండ్ బి ఎస్ఇ యుగంధర్ రావు, పీఆర్ ఎస్ఇ వెంకట్ రెడ్డి, సంబంధిత రెవెన్యూ, ఇరిగేషన్, ఎన్‌పిడిసిఎల్, టౌన్ ప్లానింగ్ శాఖల అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

అంగన్‌వాడీల్లో అశ్రద్ధపై కలెక్టర్ ఆగ్రహం

- పరిశుభ్రత, రికార్డుల నిర్వహణలో నిర్లక్ష్యంపై షోకాజ్ నోటీసులకు ఆదేశం
- మహిళా సంఘాల ఆధ్వర్యంలో ఏర్పాటు కంది, ఇతర పప్పు దినుసుల మిల్లు
- ఏర్పాటు స్థలం పరిశీలించిన కలెక్టర్ డాక్టర్ సత్య శారద

పర్వతగిరి, సెప్టెంబర్ 30 (వుదయం ప్రతినిధి):

అంగన్‌వాడీ కేంద్రాల్లో పరిశుభ్రత, రికార్డుల నిర్వహణలో నిర్లక్ష్యాన్ని సహించేది లేదని జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద స్పష్టం చేశారు. బుధవారం పర్వతగిరి మండలంలోని దౌలత్‌నగర్, ఉట్టి తండా అంగన్‌వాడీ కేంద్రాలను ఆమె ఆకస్మికంగా తనిఖీ చేశారు. కేంద్రాల్లో పరిశుభ్రత సరిగా పాటించకపోవడంపై సంబంధిత అంగన్‌వాడీ టీచర్లపై ఆగ్రహం వ్యక్తం చేశారు. కేంద్రాలను క్రమం తప్పకుండా తనిఖీ చేయని సూపర్వైజర్ల తీరుపైనా అసంతృప్తి వ్యక్తం చేశారు. చిన్నారులకు తొప్పనిసరిగా యూనిఫాం ఉండేలా చూడాలని, మెనూ ప్రకారం నాణ్యమైన పౌష్టికాహారం అందించాలని అధికారులను ఆదేశించారు. అంగన్‌వాడీ కేంద్రాల్లో ఎల్లప్పుడూ పరిశుభ్రమైన వాతావరణం ఉండేలా ఆయాలు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని సూచించారు. రికార్డుల నిర్వహణ సక్రమంగా లేకపోవడాన్ని గుర్తించిన కలెక్టర్.. నిర్లక్ష్యంగా వ్యవహరించిన అంగన్‌వాడీ టీచర్లతో పాటు కేంద్రాలను తనిఖీ చేయని సూపర్వైజర్లకు షోకాజ్ నోటీసులు జారీ చేయాలని జిల్లా సంక్షేమ అధికారిని ఆదేశించారు.కంది పప్పు మిల్లుకు స్థల పరిశీలన అంతకుముందు కలెక్టర్ కొంకపాక, పర్వతగిరి మార్కెట్‌యార్డులను క్షేత్రస్థాయి అధికారులతో కలిసి సందర్శించారు. మహిళా సంఘాల సభ్యులతో కలిసి ఆర్గానిక్ పప్పు దినుసులు, మిల్లెట్స్, కంది తదితర పంటల ప్రాసెసింగ్‌కు అనువైన ప్రాంతాలను పరిశీలించారు. కంది, ఇతర పప్పు దినుసుల మిల్లును మహిళా సంఘాల ఆధ్వర్యంలో ఏర్పాటు చేయడం ద్వారా స్థానిక పంటలకు విలువ జోడించడంతో పాటు మహిళలకు ఉపాధి, ఆదాయ అవకాశాలు కల్పించే అంశంపై అధికారులతో చర్చించారు.మిల్లు ఏర్పాటుకు అవసరమైన స్థలం, వీవో భవన నిర్మాణానికి అనువైన ప్రాంతం, మౌలిక వసతుల కల్పన తదితర అంశాలను పరిశీలించారు. అరటి, మోదుగు ఆకులతో విస్తరులు, టిఫిన్ ప్లేట్లు తయారు చేసే అపకాశాలను కూడా పరిశీలించారు.బుద్ధిమాంద్యం ఉన్న చిన్నారులపై ప్రత్యేక శ్రద్ధ ఉట్టి తండా అంగన్‌వాడీ కేంద్రంలో బుద్ధిమాంద్యం ఉన్న చిన్నారులను కలెక్టర్ డాక్టర్ సత్యశారద ఆప్యాయంగా పలకరించారు. వారి అవసరాలను తెలుసుకుని, సంబంధిత చిన్నారులను భవిత కేంద్రాలకు పంపించేలా చర్యలు తీసుకోవాలని జిల్లా సంక్షేమ అధికారికి సూచించారు.ఈ కార్యక్రమంలో డీఆర్డీవో నాగపద్మజ, జిల్లా సంక్షేమ అధికారి నాగమణి, పర్వతగిరి తహసీల్దార్ టీ.వెంకటస్వామి, ఎంపీడీవో మాలోత్ శంకర్ నాయక్ తదితర అధికారులు పాల్గొన్నారు.

మున్సిపల్ భూముల వివరాలు పక్కాగా ఉండాలి

మున్సిపల్ చైర్‌పర్సన్ బండారి అనూషా సతీష్

ఆదిలాబాద్, వుదయం ప్రతినిధి, సెప్టెంబర్ 30:

మున్సిపల్ పరిధిలోని 49 వార్డుల్లో ఉన్న మున్సిపల్ స్థలాలు, లీజు స్థలాలు, ప్రభుత్వ స్థలాలను గుర్తించి ప్రత్యేక మ్యాప్ రూపొందించేందుకు చర్యలు చేపడుతున్నట్లు మున్సిపల్ చైర్‌పర్సన్ బండారి అనూషా సతీష్ తెలిపారు. భవిష్యత్‌లో ఆయా స్థలాల వివరాలు స్పష్టంగా అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకుంటామని చెప్పారు. బుధవారం తన అధ్యక్షతన నిర్వహించిన మున్సిపల్ సర్వసభ్య సమావేశంలో ఆమె మాట్లాడారు. పట్టణంలోని పురాతన గాంధీచౌక్‌లో మహాత్మా గాంధీ విగ్రహంతో పాటు చౌక్ అభివృద్ధి పనులకు రూ.15 లక్షలు కేటాయించాలని నిర్ణయించినట్లు చైర్‌పర్సన్ తెలిపారు. పట్టణ అభివృద్ధి పనులను ప్రణాళికాబద్ధంగా చేపట్టేందుకు కృషి చేస్తామని చెప్పారు. ఎల్‌నినో ప్రభావంతో పట్టణంలో వర్షపాతం సుమారు 40 శాతం తక్కువగా నమోదైందని, ఈ నేపథ్యంలో ప్రజలు నీటిని పొదుపుగా, మితంగా వినియోగించాలని కోరారు. ప్రతి ఒక్కరూ తమ ఇళ్ల వద్ద ఇంకుడు గుంతలు ఏర్పాటు చేసుకోవాలని, నీటిని వృథా చేయకుండా సంరక్షించాలని సూచించారు. భవిష్యత్‌లో నీటి కొరత సమస్య తలెత్తకుండా ప్రతి ఒక్కరూ నీటి సంరక్షణలో భాగస్వాములు కావాలని చైర్‌పర్సన్ బండారి అనూషా సతీష్ పిలుపునిచ్చారు. సమావేశంలో మున్సిపల్ కమిషనర్ జగదీష్ గౌడ్, మేనేజర్, ఆర్ఓ, అకౌంట్స్ ఆఫీసర్, టౌన్ ప్లానింగ్, రెవెన్యూ అధికారులు, మున్సిపల్ అధికారులు, కౌన్సిల్ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

3 నుంచి 6 సంవత్సరాల పిల్లలను అంగన్వాడీ కేంద్రాల్లో చేర్పించాలి

దండేపల్లి: సెప్టెంబర్ 30 (వుదయం విలేకరి)

9 వ రాష్ట్రీయ పోషణ్ మాసంలో భాగంగా బుధవారం గూడెం,ద్వారక అంగన్వాడీ కేంద్రాల్లో అంగన్వాడీ సంసిద్ధత మరియు నమోదు కార్యక్రమం నిర్వహించడం జరిగిందని 3 నుంచి 6 సంవత్సరాల లోపు పిల్లలను అంగన్వాడీ కేంద్రాల్లో చేర్పించాలని ఐసిడిఎస్ సూపర్వైజర్ మమత తెలిపారు ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ సమాజ్ భాగస్వామ్యంతో అంగన్వాడీ సంసిద్ధత, బడికి సన్నద్ధత మరియు నమోదు డ్రైవ్ నిర్వహిస్తున్నట్లు తెలిపారు చిన్నారులలో విద్యాభ్యాసానికి పునాది వేయడానికి మరియు అంగన్వాడీ కేంద్రాల ద్వారా సంపూర్ణ ఆరోగ్య, పోషకాహార సేవలందించడానికి తల్లిదండ్రులు,స్థానిక ప్రజాప్రతినిధులు, కమ్యూనిటీ సభ్యులు సహకారం అందించాలని కోరారు ఈ కార్యక్రమంలో సర్పంచ్ మురిమడుగు సత్యనారాయణ,ఊమెన్ హబ్ జెండర్ స్పెషలిస్ట్ విజయ,అంగన్వాడీ టీచర్స్,తల్లులు,పిల్లలు పాల్గొన్నారు.

సోయాబీన్ రైతులకు న్యాయం జరిగేలా చూస్తాం

ఏఎంసీ చైర్మన్ బోరంచు శ్రీకాంత్‌రెడ్డి

ఆదిలాబాద్, వుదయం ప్రతినిధి, సెప్టెంబరు 30:

మాళవిక రకం సోయాబీన్ విత్తనాలతో పంట దెబ్బతిని నష్టపోయిన రైతులకు న్యాయం జరిగేలా చర్యలు తీసుకుంటామని ఆదిలాబాద్ వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ బోరంచు శ్రీకాంత్‌రెడ్డి తెలిపారు. తలమడుగు మండలం రుయ్యాడి గ్రామంలో సోయాబీన్ పంటను బుధవారం పరిశీలించి రైతుల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా రైతులు సాగు చేసిన మాళవిక రకం సోయాబీన్ పంటలో మొక్కలు సరిగా మొలకెత్తకపోవడం, కొన్ని మొక్కలు పచ్చిగానే ఉండటం, మరికొన్ని ఎండిపోవడాన్ని చైర్మన్ స్వయంగా పరిశీలించారు. ఈ రకం విత్తనాలను 56 మంది రైతులు సుమారు 400 ఎకరాల్లో సాగు చేయగా 70 నుంచి 80 శాతం వరకు పంట దెబ్బతిన్నట్లు రైతులు వివరించారు. రైతుల పంట నష్టం, వారి సమస్యలను జిల్లా ఇన్‌చార్జి మంత్రి, కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లి న్యాయం జరిగేలా చూస్తానని శ్రీకాంత్‌రెడ్డి హామీ ఇచ్చారు. అనంతరం తలమడుగులోని గోదాములను పరిశీలించారు. గోదాములకు మెరుగైన వసతులు, రోడ్డు సౌకర్యం, కాంపౌండ్ వాల్, సీసీ కెమెరాలు ఏర్పాటు చేసేందుకు చర్యలు తీసుకోవాలని అధికారులను కోరారు. రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ఈసారి పత్తి కొనుగోళ్లను అక్టోబరు 12 నుంచే ప్రారంభించేలా కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లినట్లు తెలిపారు. పత్తి కొనుగోళ్లలో రైతులకు పూర్తిస్థాయిలో న్యాయం జరిగేలా చర్యలు తీసుకుంటామని భరోసా ఇచ్చారు. కార్యక్రమంలో ఏఎంసీ సభ్యులు మద్దెల పోశెట్టి, కాటిపల్లి శ్రీనివాసరెడ్డి, సర్పంచ్ ఏలుగు రాజన్న, వెంకట్‌రెడ్డి, ప్రేమేందర్‌రెడ్డి, సజ్జనపు కిషన్, రాకేష్‌రెడ్డి, దేవన్న, ప్రవీణ్‌రెడ్డి, జైపాల్‌రెడ్డి, రమాకాంత్‌రెడ్డి, నవీన్‌రావు, ఇందూరి దివాకర్, కాంగ్రెస్ నాయకులు ప్రవీణ్‌రెడ్డి, సాంబశివ్, చెన్నాల సాయికిరణ్, చిన్న రాజారెడ్డి, గోక శ్రీనివాస్‌రెడ్డి, నిమ్మల సుదర్శన్‌రెడ్డి, ప్రకాష్‌రెడ్డి, రామ్‌రెడ్డి, గోక రాజు, లక్ష్మన్న, కంచరి చారి, స్వామి, గంగాధర్ తదితరులు పాల్గొన్నారు.

ఆహార భద్రత చట్టాన్ని పకడ్బందీగా అమలు చేయాలి

రాష్ట్ర ఫుడ్ కమిషన్ చైర్మన్ గోలి శ్రీనివాస్‌రెడ్డి

ఆదిలాబాద్, వుదయం ప్రతినిధి, సెప్టెంబరు 30:

జిల్లాలో జాతీయ ఆహార భద్రత చట్టం–2013ను పకడ్బందీగా అమలు చేసి అర్హులైన ప్రతి ఒక్కరికీ రేషన్, పౌష్టికాహారం, ఆహార భద్రత పథకాల ప్రయోజనాలు అందేలా చర్యలు తీసుకోవాలని రాష్ట్ర ఫుడ్ కమిషన్ చైర్మన్ గోలి శ్రీనివాస్‌రెడ్డి తెలిపారు. రెండు రోజుల క్షేత్ర పర్యటనలో భాగంగా బుధవారం కలెక్టరేట్‌లో జిల్లా కలెక్టర్ రాజర్షి షాతో కలిసి నిర్వహించిన సమీక్ష సమావేశంలో ఆయన మాట్లాడారు. అంగన్‌వాడీ కేంద్రాలు, సంక్షేమ వసతి గృహాలు, రేషన్ దుకాణాల్లో నేమ్‌బోర్డులు ఏర్పాటు చేసి, బాధ్యుల వివరాలు, ఫిర్యాదు విధానం, టోల్‌ఫ్రీ నంబర్లను ప్రజలకు స్పష్టంగా కనిపించేలా ప్రదర్శించాలని సూచించారు. విద్యార్థులకు నాణ్యమైన పౌష్టికాహారం అందించడంలో ఎలాంటి నిర్లక్ష్యం ఉండరాదన్నారు. క్షేత్ర పర్యటనలో ట్రైబల్ వెల్ఫేర్ రెసిడెన్షియల్ పాఠశాలలు, జూనియర్ కళాశాల హాస్టళ్లలో భోజన వేళలు, మెనూ అమలు, వంటగది పరిశుభ్రత తదితర అంశాల్లో కొన్ని లోపాలు గుర్తించినట్లు తెలిపారు. ఫుడ్ కమిషన్ సభ్యుడు ఒరగంటి ఆనంద్ మాట్లాడుతూ.. ఆహార భద్రత చట్టం ద్వారా అర్హులైన ప్రతి ఒక్కరికీ పౌష్టికాహారం పొందే హక్కు కల్పించబడిందన్నారు. గర్భిణీలు, బాలింతలు, చిన్నారులకు పౌష్టికాహారం, అవసరమైన సేవలు సక్రమంగా అందేలా చూడాలని సూచించారు. నిబంధనల ఉల్లంఘనలకు పాల్పడే వారిపై చర్యలు తీసుకునే అధికారం ఫుడ్ కమిషన్‌కు ఉందన్నారు. జిల్లా కలెక్టర్ రాజర్షి షా మాట్లాడుతూ.. జిల్లాలోని 2,566 రేషన్ దుకాణాల ద్వారా 2,27,477 రేషన్ కార్డులకు చెందిన 7,44,404 యూనిట్లకు ప్రతి నెల సుమారు 4,500 మెట్రిక్ టన్నుల బియ్యాన్ని పంపిణీ చేస్తున్నట్లు తెలిపారు. కొత్తగా జారీ చేసిన డిజిటల్ స్మార్ట్ రేషన్ కార్డులను అర్హులకు పంపిణీ చేస్తున్నామని పేర్కొన్నారు. గురుకుల పాఠశాలలు, సంక్షేమ హాస్టళ్లలో ఫుడ్ పాయిజనింగ్ ఘటనలు పునరావృతం కాకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించినట్లు కలెక్టర్ తెలిపారు. విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించడం, నిర్దేశిత మెనూను అమలు చేయడం, వంట సిబ్బంది, వార్డెన్లకు అవసరమైన శిక్షణ ఇవ్వడం, హెల్త్ ప్రొఫైల్స్ నిర్వహించడం, కంప్లెంట్ బాక్సులు ఏర్పాటు చేయడం, మెనూ, టోల్‌ఫ్రీ నంబర్లను ప్రదర్శించడం తప్పనిసరి చేయాలని సూచించారు. పాఠశాలలు, హాస్టళ్లలో పోషకాహారం, పరిశుభ్రత, మౌలిక వసతులను 'పోషణ్ చర్చ' యాప్ ద్వారా అధికారులు నిరంతరం పర్యవేక్షిస్తున్నారని రాజర్షి షా తెలిపారు. విద్యార్థుల్లో వ్యక్తిగత పరిశుభ్రత, పోషకాహారం, మానసిక వికాసం, మాదకద్రవ్యాల దుష్ప్రభావాలపై అవగాహన కల్పిస్తున్నట్లు పేర్కొన్నారు. సమావేశంలో అదనపు కలెక్టర్లు రాజేశ్వర్, ఆర్.ఎస్.చిత్రు, డీఆర్ఓ స్రవంతి, ఆర్డీవో జగదీశ్వర్‌రావు, డీఆర్‌డీఓ రాథోడ్ రవీందర్, డీఎస్‌వో నందిని, డీఎం సుధారాణి, డీఈవో మాధవి, డీఎంహెచ్‌వో సాధన, సంక్షేమ శాఖల అధికారులు, సీడీపీవోలు, ఎంఈవోలు, రేషన్ డీలర్ల సంఘం ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

గిరిజన సంక్షేమ గురుకులాల్లో డీడీ జాదవ్ అంబాజీ ఆకస్మిక తనిఖీ

ఆసిఫాబాద్ (వుదయం ప్రతినిధి)

కుమరం భీమ్ ఆసిఫాబాద్ జిల్లా కేంద్రం లోని బాలికల గురుకుల పాఠశాల,కళాశాల లను జిల్లా గిరిజన సంక్షేమ ఉప సంచాలకులు జాదవ్ అంబాజీ బుధువారం ఆకస్మికంగా సందర్శించి తనిఖీ చేశారు. ఈ సందర్భంగా పాఠశాలల్లో విద్యార్థినిల హాజరు, తరగతి గదుల్లో బోధన, వసతి గృహ నిర్వహణ, భోజనశాల, వంటశాల, పరిశుభ్రత, తాగునీటి సౌకర్యం, మరుగుదొడ్ల నిర్వహణ, వైద్య సదుపాయాలు, విద్యార్థుల భద్రతా చర్యలను ఆయన క్షుణ్ణంగా పరిశీలించారు. విద్యార్థినిలతో నేరుగా మాట్లాడి వారి విద్యాభ్యాసం, భోజనం నాణ్యత,వసతి సౌకర్యాలు, ఆరోగ్యం, పాఠశాలలో ఎదురవుతున్న సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ప్రతి విద్యార్థినికి నాణ్యమైన విద్యతో పాటు మెరుగైన వసతి, పౌష్టికాహారం అందేలా ప్రిన్సిపాల్ ,వైస్ ప్రిన్సిపాల్ ఉపాధ్యాయులు నిరంతరం పర్యవేక్షణ చేయాలని సూచించారు. పాఠశాల పరిసరాలను ఎప్పటికప్పుడు పరిశుభ్రంగా ఉంచడంతో పాటు బాలికల ఆరోగ్యం, భద్రతకు అత్యంత ప్రాధాన్యత ఇవ్వాలని ఆదేశించారు. ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలు, విద్యా సౌకర్యాలు విద్యార్థులకు పూర్తి స్థాయిలో అందేలా చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులకు సూచించారు. అనంతరం పాఠశాలల్లోని రికార్డులు, విద్యార్థుల హాజరు, వసతి గృహ నిర్వహణ తదితర అంశాలను పరిశీలించి, విద్యార్థుల సమస్యలను ఎప్పటికప్పుడు గుర్తించి పరిష్కరించాలని సిబ్బందికి సూచించారు. ఆకస్మిక తనిఖీల ద్వారా పాఠశాలల నిర్వహణ మరింత మెరుగుపడాలని, విద్యార్థులకు మెరుగైన విద్యా వాతావరణం కల్పించడమే గిరిజన సంక్షేమ శాఖ ప్రధాన లక్ష్యమని జాదవ్ అంబాజీ స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో గురుకుల పాఠశాల,ప్రిన్సిపాల్ జాదవ్ మహేశ్వరీ కళాశాల ప్రిన్సిపాల్ అరుణ శ్రీ ఉపాధ్యాయులు, పాఠశాల సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

రిమ్స్ బాధిత కుటుంబానికి రూ.5 లక్షల సాయం

గ్రంథాలయ సంస్థ చైర్మన్ మల్లెపూల నర్సయ్య

ఆదిలాబాద్, వుదయం ప్రతినిధి, సెప్టెంబరు 30:

రిమ్స్ ఎస్ఎన్‌సీయూలో జరిగిన అగ్ని ప్రమాదంలో శిశువును కోల్పోయిన బాధిత కుటుంబానికి రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించిన రూ.5 లక్షల ఆర్థిక సాయం అందజేసినట్లు జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ డా. మల్లెపూల నర్సయ్య తెలిపారు. బుధవారం బజార్‌హత్నూర్ మండలం శ్యామ్‌రావుగూడలోని బాధిత కుటుంబం నివాసానికి వెళ్లి తహసీల్దార్‌తో కలిసి చెక్కును అందజేసినట్లు పేర్కొన్నారు. ఈ సందర్భంగా డా. మల్లెపూల నర్సయ్య మాట్లాడుతూ.. ఆదిలాబాద్ రిమ్స్ ఎస్ఎన్‌సీయూలో ఈ నెల 21న జరిగిన అగ్ని ప్రమాదంలో శ్యామ్‌రావుగూడకు చెందిన ఎర్మా ఇస్రు, నాగుబాయి దంపతుల 12 రోజుల శిశువు మృతి చెందడం బాధాకరమన్నారు. శిశువును కోల్పోయిన కుటుంబానికి రాష్ట్ర ప్రభుత్వం అండగా నిలుస్తూ రూ.5 లక్షల ఆర్థిక సాయం అందించిందన్నారు. బాధిత కుటుంబానికి అవసరమైన సహాయ సహకారాలను అందించేందుకు ప్రభుత్వం కృషి చేస్తుందని తెలిపారు. శిశువును కోల్పోయిన కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో బజార్‌హత్నూర్ మాజీ మండల కాంగ్రెస్ అధ్యక్షుడు జల్కె పాండురంగ్, గుడిహత్నూర్ కాంగ్రెస్ సీనియర్ నాయకులు నాగనాథ్ అప్ప, ఆడే జైపాల్, రామ్‌కిషన్, బజార్‌హత్నూర్ మండల కాంగ్రెస్ నాయకులు, ఆదిలాబాద్ జిల్లా కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

టైక్వాండో ఎంపికల్లో విజృంభించిన ద్రోణ అకాడమీ విద్యార్థులు

బంగారు పతకాలతో రాష్ట్రస్థాయికి ఎంపికైన క్రీడాకారులు

మంచిర్యాల:వుదయం ప్రతినిధి, సెప్టెంబరు 30:

బెల్లంపల్లి రైల్వే స్పోర్ట్స్ కాంప్లెక్స్ ప్రాంగణంలో మంగళవారం జరిగిన 70వ ఎస్‌జిఎఫ్ (SGF) జోనల్ సెలెక్షన్స్‌లో పాత మంచిర్యాలకు చెందిన "ద్రోణ టైక్వాండో అకాడమీ" విద్యార్థులు అద్భుత ప్రతిభ కనబరిచి పతకాల పంట పండించారు. అకాడమీకి చెందిన పలువురు క్రీడాకారులు స్వర్ణ, కాంస్య పతకాలు సాధించి రాష్ట్రస్థాయి పోటీలకు అర్హత సాధించారు.

విజేతల వివరాలు:

★ అండర్–14 బాలుర విభాగం (గోల్డ్ మెడల్స్):

★ –25 కేజీల విభాగం: ఎం. అవ్యుక్త్

★ –32 కేజీల విభాగం: శ్రేయాన్స్

★ –35 కేజీల విభాగం: రిషిత్

★ –38 కేజీల విభాగం: జి. అయాన్ష్

★ –41 కేజీల విభాగం: నాగుల శశివర్ధన్

★ +41 కేజీల విభాగం: చెట్టి కౌశిక్ కార్తికేయ

★ అండర్–17 బాలికల విభాగం (గోల్డ్ మెడల్స్):

★ –35 కేజీల విభాగం: సిహెచ్. శివ లాస్య

★ –55 కేజీల విభాగం: కొల్లూరి హర్షిత పటేల్

★ –68 కేజీల విభాగం: పెంట సహస్ర

★ కాంస్య పతకాలు (బ్రాంజ్ మెడల్స్):

★ స్వర్ణమయి పటేల్, సాయి రిషిక్, స్నేహిత్ తేజ మూడవ స్థానంలో నిలిచి కాంస్య పతకాలు సాధించారు.

అద్భుత ప్రతిభతో బంగారు పతకాలు సాధించి, రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైన క్రీడాకారులతో పాటు కాంస్య పతకాలు సాధించిన విద్యార్థులందరినీ ఎస్‌జిఎఫ్ (SGF) సెక్రటరీ యాకూబ్, టైక్వాండో అసోసియేషన్ కార్యదర్శి జిల్లపల్లి వెంకట స్వామి, అధ్యక్షులు బుచ్చి రామారావు, కోశాధికారి సుధాకర్, కోచ్‌లు గోవిందుల అరుణ్ కుమార్, మైదం సుజిత్ ప్రత్యేకంగా అభినందించారు. క్రీడాకారులు రాష్ట్రస్థాయి పోటీలలోనూ రాణించి మంచిర్యాల జిల్లాకు మరిన్ని పతకాలు తీసుకురావాలని ఆకాంక్షించారు.

కాంగ్రెస్ పార్టీలో చేరిన ధర్మరావుపేట ఉపసర్పంచ్ నక్క చంద్రమౌళి

దండేపల్లి: సెప్టెంబర్ 30 (వుదయం విలేకరి)

బిఆర్ఎస్ పార్టీకి దండేపల్లి మండలంలో షాక్ తగిలింది దండేపల్లి మండలం ధర్మ రావుపేట గ్రామ ఉపసర్పంచ్ నక్క చంద్రమౌళి బుధవారం కాంగ్రెస్ పార్టీలో చేరారు ఈ సందర్భంగా ఆయనకు కాంగ్రెస్ పార్టీ మంచిర్యాల నియోజకవర్గ సీనియర్ నాయకులు మంతెన జగన్మోహన్ రావు కాంగ్రెస్ పార్టీ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు ఈ సందర్భంగా చంద్రమౌళి మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ, రేవంత్ రెడ్డి ప్రభుత్వం చేస్తున్న అభివృద్ధి,సంక్షేమ పథకాలకు ఆకర్షితులై పార్టీలో చేరినట్లు తెలిపారు మరియు రానున్న రోజుల్లో ప్రభుత్వ పథకాలు ప్రజల్లోకి తీసుకెళ్లి పార్టీ బలోపేతం కోసం కృషి చేస్తానని తెలిపారు ఈ కార్యక్రమంలో మాజీ యంపిపి గడ్డం శ్రీనివాస్,మాజీ వైస్ యంపిపి ఆకుల రాజేందర్, సీనియర్ నాయకులు చీటి సత్యంరావు,మాజీ యంపిటిసి ముత్తె రాజన్న, మాజీ సర్పంచ్ అంబటిపెల్లి రవీందర్,యస్సి సెల్ జిల్లా ప్రధాన కార్యదర్శి బొడ్డు కమాలకర్,కార్యదర్శులు దమ్మ సునీల్,జాడి ప్రేంసాగర్,మాజీ పిఎసిఎస్ డైరెక్టర్ నెల్కి వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా జిల్లా స్థాయి కిసాన్ మేళా - 2026

- రైతు సంక్షేమమే ప్రభుత్వ ప్రధాన లక్ష్యం
- ప్రభుత్వ సలహాదారు మహమ్మద్ అలీ షబ్బీర్
- ఆధునిక వ్యవసాయ పద్ధతులను రైతులు సద్వినియోగం చేసుకోవాలి
- జిల్లా కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్

కామారెడ్డి, సెప్టెంబర్ 30 (వుదయం ప్రతినిధి):-

తెలంగాణ ప్రభుత్వం వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో, ఆత్మ సౌజన్యంతో కామారెడ్డి పట్టణంలోని కళాభారతిలో బుధవారం జిల్లా స్థాయి కిసాన్ మేళా –2026 కార్యక్రమాన్ని

సిరిసిల్లలో రేవంత్ రణభేరి.. మార్పు ఖాయం!"

- గత పాలనపై తీవ్ర విమర్శలు.. చేనేత, రైతులు, గల్ఫ్ కార్మికులకు ప్రాధాన్యం
- కుటుంబ పాలనకు.. ప్రజా పాలనకు మధ్య తేడాను ప్రజలు గమనించాలి
- సీఎం రేవంత్‌రెడ్డి

రాజన్నసిరిసిల్ల,
సెప్టెంబరు 30 (వుదయం ప్రతినిధి) :

ధైర్యం, దైవం కలిసి వెలిసిన ప్రాంతం సిరిసిల్ల అని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అన్నారు. వేములవాడ రాజరాజేశ్వరస్వామి సన్నిధిలో దైవచింతనతోపాటు.. నిజాం రజాకార్లకు వ్యతిరేకంగా పూర్వీకులు సాగించిన వీరోచిత పోరాటానికి సిరిసిల్ల ప్రజలు వారసులని పేర్కొన్నారు. బుధవారం సిరిసిల్లలో నిర్వహించిన బహిరంగ సభలో సీఎం రేవంత్‌రెడ్డి మాట్లాడుతూ సిరిసిల్ల అంటే సిరులకు నిలయమని,అయితే గత పదేళ్ల పాలనలో ఈ ప్రాంతం ఉరిసిల్లగా మారిందని సీఎం విమర్శించారు. వస్త్ర పరిశ్రమకు సిరిసిల్ల చిరునామాగా ఉందని, వేలాది కుటుంబాలు చేనేత, వస్త్ర పరిశ్రమపై ఆధారపడి జీవిస్తున్నాయని తెలిపారు. అగ్గిపెట్టెలో పట్టేంత సన్నని చీరలను తయారు చేసే నైపుణ్యం ఇక్కడి కార్మికుల సొంతమన్నారు.గత పాలనలో చేనేత కార్మికుల ఆత్మహత్యలు, గల్ఫ్ వలసలు ఎందుకు ఆగలేదని ప్రజలు ఆలోచించాలని సూచించారు.గల్ఫ్‌లో ప్రమాదవశాత్తు కార్మికులు మృతి చెందిన ప్పుడు మృతదేహాలను స్వగ్రామాలకు తీసుకురావడంలో కుటుంబాలు ఇబ్బందులు ఎదుర్కొన్నాయని అన్నారు. అలాగే గల్ఫ్ కార్మికుల కోసం ప్రత్యేక విధానం తీసుకురావాలని స్థానిక నాయకులు కోరిన నేపథ్యంలో.. విదేశాల్లో ప్రమాదవశాత్తు మృతి చెందిన కార్మికుల మృతదేహాలను స్వదేశానికి తీసుకురావడంతోపాటు, వారి కుటుంబాలకు రూ.5 లక్షల ఆర్థిక సాయం అందించేలా ప్రజా ప్రభుత్వం చర్యలు చేపట్టిందని సీఎం తెలిపారు.సిరిసిల్ల ప్రజలు వేసిన ఓట్లతో కేసీఆర్ కుటుంబం వేల కోట్ల అక్రమ సంపాదన చేసిందని సీఎం ఆరోపించారు. అమెరికాలో ఉన్న సమయంలో కేటీఆర్ చేసిన పనులపై, ఆయన కుటుంబ ఆస్తులపై లెక్కలు బయటపెట్టాలని డిమాండ్ చేశారు. గోదావరి జలాలు, మానేరు ఇసుకను అడ్డుపెట్టుకుని పలువురు నేతలు దోపిడీకి పాల్పడ్డారని ఆరోపించారు. నేరెళ్ల ఘటన బాధితులే ఇందుకు సజీవ సాక్ష్యమని పేర్కొన్నారు.మేడే మానేరు ప్రాజెక్టు ముంపులో ఇళ్లు కోల్పోయామని చెప్పిన కేసీఆర్ కుటుంబ సభ్యులకు ఇండ్ల స్థలాలు లభించలేదా? అని సీఎం ప్రశ్నించారు. సిరిసిల్ల ప్రజల ఓట్లు కేటీఆర్‌కు పచ్చనోట్లుగా మారాయని వ్యాఖ్యానించారు. వేములవాడ రాజన్నను, భద్రాచలం రామయ్యను మోసం చేసిన వ్యక్తి కేసీఆర్ మాత్రమేనని సీఎం ఆరోపించారు. గత పాలకులు పదేళ్లలో పేదలకు డబుల్ బెడ్‌రూం ఇళ్లు నిర్మించడంలో విఫలమయ్యారని విమర్శించారు.

చేనేతకు రూ.1,741 కోట్లు..

తమ ప్రభుత్వం వెయ్యి రోజుల పాలనలో నేత కార్మికుల సంక్షేమం కోసం రూ.1,741 కోట్లు ఖర్చు చేసిందని రేవంత్‌రెడ్డి తెలిపారు. రాజన్న సిరిసిల్ల జిల్లాకు రూ.1,700 కోట్ల నిధులు మంజూరు చేశామని చెప్పారు. వేములవాడలో నూలు డిపో ఏర్పాటు చేశామని, రాజన్న ఆలయ అభివృద్ధికి చర్యలు చేపట్టామని వివరించారు. వేములవాడలో ఎమ్మార్వో కార్యాలయం, సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయం, మహిళా పోలీస్‌స్టేషన్, ట్రాఫిక్ పోలీస్‌స్టేషన్‌తో పాటు యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ పాఠశాలను ఏర్పాటు చేస్తున్నామని తెలిపారు.

సిరిసిల్లలో మార్పు ఖాయం..

సిరిసిల్లలో మార్పు రాబోతోందని, ప్రజల కలల్లో ఆనందం కనిపించే రోజులు ముందున్నాయని సీఎం అన్నారు.రాబోయే శాసనమండలి ఎన్నికల్లో పద్మశాలి బిడ్డను మండలికి పంపించాలని కోరారు. రాబోయే ఎన్నికల్లో సిరిసిల్లలో కాంగ్రెస్ పార్టీ తరఫున గెలిచే అభ్యర్థికి మంత్రి వర్గంలో స్థానం కల్పిస్తామని ప్రకటించారు.కాళేశ్వరం ప్రాజెక్టులోని 9, 10, 11, 12 ప్యాకేజీలను పూర్తి చేయకుండా పెండింగ్‌లో పెట్టడం వల్ల సిరిసిల్ల ప్రాంత రైతులకు గోదావరి జలాలు అందలేదని సీఎం విమర్శించారు. మానేరు నదిపై నిర్మించిన చెక్‌డ్యామ్‌లు కొట్టుకుపోయిన ఘటనలపై కూడా గత ప్రభుత్వాన్ని ప్రశ్నించారు.కేసీఆర్ ముఖ్యమంత్రిగా ఉన్న సమయంలో ఆయన కుటుంబ సభ్యులు మంత్రులుగా కొనసాగారని, ప్రస్తుత ప్రభుత్వంలో సామాజిక వర్గాలకు ప్రాతినిధ్యం కల్పిస్తూ పలువురికి మంత్రి పదవులు ఇచ్చామని సీఎం పేర్కొన్నారు. కుటుంబ పాలన కావాలా? ప్రజా పాలన కావాలా? అనే విషయాన్ని ప్రజలు ఆలోచించుకోవాలని పిలుపునిచ్చారు.గత ప్రభుత్వ హయాంలో పేదలకు రేషన్ కార్డులు ఇవ్వలేదని, బతుకమ్మ చీరల పంపిణీలోనూ అవకతవకలు జరిగాయని సీఎం ఆరోపించారు.

చిలక చీరలను పంపిణీ

బతుకమ్మ చీరలకు సంబంధించిన రూ.350 కోట్ల బకాయిలను తమ ప్రభుత్వం చెల్లించిందని తెలిపారు. ఈ ఏడాది పండుగ సందర్భంగా చిలక చీరలను పంపిణీ చేయనున్నట్లు చెప్పారు.కోటి ఆరు లక్షల కుటుంబాలకు చెందిన 3.46 కోట్ల మంది లబ్ధిదారులకు రేషన్ షాపుల ద్వారా సన్నబియ్యం అందిస్తున్నామని తెలిపారు. 200 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్, మహిళలకు ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణం వంటి పథకాలను అమలు చేస్తున్నామని చెప్పారు.

రైతులు, ఉద్యోగులకు ప్రాధాన్యం

రైతు భరోసా కింద రూ.36 వేల కోట్లు, రుణమాఫీ కింద రూ.20,614 కోట్లు రైతులకు చెల్లించామని సీఎం తెలిపారు. 75 వేల ప్రభుత్వ ఉద్యోగాలను భర్తీ చేశామని, ఉద్యోగులకు ప్రతి నెల ఒకటో తేదీన వేతనాలు చెల్లిస్తున్నామని చెప్పారు. రిటైర్డ్ ఉద్యోగులకు బకాయిలు చెల్లించామని పేర్కొన్నారు. తెలంగాణ ఉద్యమకారుల కుటుంబాలకు కూడా ప్రభుత్వం ప్రాధాన్యం ఇస్తోందని తెలిపారు. శ్రీకాంతాచారి తల్లిని మహిళా కమిషన్ సభ్యురాలిగా, చాకలి ఐలమ్మ కుటుంబ సభ్యులను మహిళా కమిషన్ సభ్యులుగా నియమించామని సీఎం వివరించారు.ఈసభలో పీసీసీ అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్,మంత్రులు దుద్దిళ్ల శ్రీధర్ బాబు,పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, పొన్నం ప్రభాకర్,అడ్లూరి లక్ష్మణ్,ప్రభుత్వ విప్ లు, ఆది శ్రీనివాస్,చింతకుంట విజయరమణారావు,ప్రత్యేక సలహాదారులు సుదర్శన్‌రెడ్డి, రాజ్యసభ సభ్యుడు వేమూరి నరేందర్‌రెడ్డి,ఎంపీలు మల్లు రవి, చామల కిరణ్‌రెడ్డి, ప్రభుత్వ విప్ ,ప్రభుత్వ సలహాదారు వేణుగోపాల్, ఎమ్మెల్యేలు వేముల వీరేశం, బీర్ల ఐలయ్య, మక్కాన్‌సింగ్ రాజ్‌ఠాకూర్, మేడిపల్లి సత్యం, కవ్వంపల్లి సత్యనారాయణ, మదన్‌మోహన్‌రావు, లక్ష్మీకాంతరావు, డాక్టర్ సంజయ్, శ్రీగణేష్, నాగరాజు, కుంభం అనిల్‌రెడ్డి, నవీన్ యాదవ్, సంపత్‌కుమార్, ఎమ్మెల్సీ బల్మూరి వెంకట్, అధికారులు, ప్రజాప్రతినిధులు, కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు, ప్రజలు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు.

తాడిచర్లలో 132 కేవీ సబ్‌స్టేషన్‌కు స్థల పరిశీలన

విద్యుత్ సమస్యల పరిష్కారానికి చర్యలు: టీజీఎన్‌పీడీసీఎల్ సీఎండీ

మంథని, సెప్టెంబర్ 30: వుదయం ప్రతినిధి:

మంథని నియోజక వర్గం తాడిచర్ల గ్రామానికి మంజూరైన 132 కేవీ సబ్‌స్టేషన్ నిర్మాణానికి అధికారులు బుధవారం స్థల పరిశీలన చేపట్టారు. టీజీఎన్‌పీడీసీఎల్ సీఎండీ, విద్యుత్ శాఖ అధికారులు గ్రామంలోని సర్వే నంబర్ 915లో ప్రతిపాదిత స్థలాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా సర్పంచ్ బండి స్వామి, ఉపసర్పంచ్ బొబ్బిలి రాజు గ్రామంలో నెలకొన్న విద్యుత్ సమస్యలను సీఎండీ దృష్టికి తీసుకెళ్లారు. విద్యుత్ సరఫరా, తరచూ తలెత్తుతున్న లోపాలు, ఏఎంఆర్ కంపెనీకి సంబంధించిన సమస్యలపై అధికారులు వివరాలు తెలుసుకున్నారు. మంత్రి శ్రీధర్‌బాబు ఆదేశాల మేరకు గ్రామంలోని విద్యుత్ సమస్యలను త్వరలో పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటామని సీఎండీ హామీ ఇచ్చినట్లు సర్పంచ్ తెలిపారు. 132 కేవీ సబ్‌స్టేషన్ ఏర్పాటుతో తాడిచర్లతో పాటు పరిసర ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా మెరుగు పడుతుందని స్థానికులు ఆశాభావం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో రైతులు చంద్రయ్య, దేవర్నేని రాజేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

సాంకేతిక కోర్సుల్లో ఉచిత శిక్షణ...

కోరుట్ల సెప్టెంబర్ 30 (వుదయం ప్రతినిధి)

స్వామి రామానందతీర్థ గ్రామీణ సంస్థలో పలు సాంకేతిక కోర్సులలో ఉచిత శిక్షణ ఇవ్వనున్నట్లు స్వామి రామానంద తీర్థ సంస్థ చైర్మన్ ఎన్ కిశోర్ రెడ్డి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు రామానందతీర్థ సంస్థలో దీన్ దయాళ్ ఉపాధ్యాయ గ్రామీణ కౌశల్య యోజన పథకం ద్వారా 3 నెలల కాల వ్యవధి కలిగిన అకౌంట్స్ ఎగ్జిక్యూటివ్ (ట్యాలీ ప్రైమ్) కోర్సుకు బీకాం విద్యార్హత కల్గిన వారు దరఖాస్తు చేసుకోవాలని వెల్లడించారు అలాగే సోలార్ టెక్నీషియన్ ఎలక్ట్రీషియన్ కోర్సు ఆటో మొబైల్ టూ వీలర్ టెక్నీషియన్ కోర్సుకు ఎస్సెస్సీ పాసై ఉండాలని తెలిపారు అభ్యర్థులు 18 నుంచి 28 సంవత్సరాల మధ్య వయస్సు కలిగి ఉండాలని ఆసక్తి గల అభ్యర్థులు తమ విద్యార్హతల సర్టిఫికెట్ ఆధార్ కుల ధ్రువీకరణ పాస్ పోర్టు ఫొటోలతో అక్టోబర్ 5 లోపు సంస్థలో నేరుగా దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు ఎంపికైన అభ్యర్థులకు శిక్షణ కాలంలో ఉచిత భోజనంతో కూడిన హాస్టల్ వసతి కల్పించబడుతుందని వెల్లడించారు పూర్తి వివరాలకు 9133908000, 9133908111 నెంబర్లను సంప్రదించాలని తెలిపారు.

జిల్లా వ్యాప్తంగా పోలీస్ యాక్ట్ సెక్షన్–30 అమలు

- ముందస్తు అనుమతి లేకుండా ర్యాలీలు, ఊరేగింపులు, బహిరంగ సభలు నిర్వహించొద్దు
- జిల్లా ఎస్పీ డా. జి. జానకి షర్మిల

నిర్మల్ జిల్లా (వుదయం ప్రతినిధి)30 సెప్టెంబర్ 2026

జిల్లాలో శాంతిభద్రతల పరిరక్షణ, ప్రజా ప్రశాంతతను దృష్టిలో ఉంచుకుని 01 అక్టోబర్ 2026 నుండి 31 అక్టోబర్ 2026 వరకు నిర్మల్ జిల్లా వ్యాప్తంగా పోలీస్ యాక్ట్ సెక్షన్–30 అమలులో ఉంటుందని జిల్లా ఎస్పీ డా. జి. జానకి షర్మిల, ఐపీఎస్ ఒక ప్రకటనలో తెలిపారు. సెక్షన్–30 అమలులో ఉన్న కాలంలో సంబంధిత పోలీసు అధికారుల ముందస్తు అనుమతి లేకుండా ర్యాలీలు, ఊరేగింపులు, ధర్నాలు, నిరసన కార్యక్రమాలు, బహిరంగ సభలు, సమావేశాలు లేదా పెద్ద సంఖ్యలో ప్రజలు పాల్గొనే కార్యక్రమాలు నిర్వహించరాదని సూచించారు. నిబంధనలను ఉల్లంఘించి ప్రజా శాంతిభద్రతలకు భంగం కలిగించే విధంగా వ్యవహరించిన వారిపై సంబంధిత చట్టాల ప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. అదేవిధంగా, సోషల్ మీడియా వేదికల ద్వారా తప్పుడు ప్రచారం, పదంతులు, మత విద్వేషాలు లేదా సామాజిక ఉద్రిక్తతలకు దారితీసే పోస్టులు, వీడియోలు, సందేశాలు ప్రసారం చేసిన వారిపైనా చట్టపరమైన చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. ప్రజలు చట్టాన్ని గౌరవించి పోలీసు శాఖకు సహకరించాలని, సభలు, సమావేశాలు లేదా ఇతర బహిరంగ కార్యక్రమాలు నిర్వహించాలనుకుంటే సంబంధిత పోలీసు అధికారుల నుంచి ముందస్తు అనుమతి తప్పనిసరిగా పొందాలని జిల్లా ఎస్పీ సూచించారు. జిల్లా శాంతిభద్రతల పరిరక్షణలో ప్రతి ఒక్కరూ బాధ్యతాయుతంగా వ్యవహరించాలని కోరారు.

రైతులకు నిరంతర విద్యుత్ సరఫరా చేయాలి : బీజేపీ

మల్యాల మండలం సెప్టెంబర్ 30 (వుదయం న్యూస్)

మల్యాల మండల బీజేపీ అధ్యక్షులు గాజుల మల్లేశం ఆధ్వర్యంలో బుధవారం మండల విద్యుత్ ఏఈ అధికారి దయానంద్ కి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా రైతులకు సరఫరా చేయు విద్యుత్ కోతలు వలన రైతుల పొలాలకు సరిపడా నీళ్లు బావులు, బోర్లు, వాగుల కింద పారించలేకపోతున్నారు.ప్రస్తుతం వరి పంట కీలక దశలో ఉన్నందున విద్యుత్ కోతలతో రైతులు తీవ్రంగా నష్టపోతారు. రైతులకు కోతలు లేని నిరంతర విద్యుత్ సరఫరా చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో బిజెపి జిల్లా ఉపాధ్యక్షుడు బింగి వేణు , బొబ్బిలి వెంకటస్వామి యాదవ్ , గొల్లపల్లి సర్పంచి గడ్డం మల్లేశం , మాజీ ఎంపిటిసి రాచర్ల రమేష్ , నులుగొండ సురేష్ , కిసాన్ మోర్చామండల అధ్యక్షుడు సామా మైపాల్ రెడ్డి , బీజేవైఎం మండల అధ్యక్షుడు పొన్నగంటి గౌతమ్ , ఎస్సీ మోర్చా మండల అధ్యక్షుడు సుంకపాక టైటాస్ , కోన్ శ్రీనివాస్ , రాచర్ల రాములు , పులి సంకీర్త్ ,రాఘవేంద్ర ,బండారి రాజు , జిల్లాల రమేష్, కుసుమ సాయికిరణ్ , షేర్ల పరుశురాం. ఇట్ రెడ్డి లింగారెడ్డి. గడ్డం మల్లేశం. సంఘ శంకర్ ,వెంకటేష్ , నేరెళ్ల వర్షిత్ , కార్యకర్తలు పాల్గొన్నారు.

కౌన్సిల్ సాధారణ సమావేశం

కోరుట్ల సెప్టెంబర్ 30 (వుదయం ప్రతినిధి)

కోరుట్ల పురపాలక సంఘ కార్యాలయంలో మున్సిపల్ చైర్ పర్సన్ తిరుమల వసంత అధ్యక్షతన బుధవారం కౌన్సిల్ సాధారణ సమావేశం నిర్వహించారు ఇట్టి సమావేశంలో పొందుపరచిన (16) అంశాలలో (15) అంశాలను మాత్రమే కౌన్సిల్ సభ్యులు ఆమోదం తెలిపారు అనంతరం చైర్ పర్సన్ సభ్యులందరూ ప్రస్తుత వర్షాకాల దృష్ట్యా అన్ని వార్డులలో మురికి కాలువలు శుభ్రం చేయాలని పరిసరాలు శుభ్రంగా ఉండేలా చూడాలని రాబోయే బతుకమ్మ దసరా పండగలకు పట్టణ ప్రజలకు ఎలాంటి ఇబ్బంది కలగకుండా చర్యలు తీసుకోవాలని మున్సిపల్ అధికారులను ఆదేశించారు ఇట్టి సమావేశంలో మున్సిపల్ కమిషనర్ వి రాఘవేంద్ర వైస్ చైర్ పర్సన్ మహమ్మద్ షాహిద్ పలువురు కౌన్సిలర్లు కో ఆప్షన్ సభ్యులు డివై ఈఈ మేనేజర్ టీపీఓ ఏఈ జేఏఓ ఆర్ఓ ఎస్ఐ మున్సిపల్ కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

సర్వే నంబరు 437 పరిసర ప్రాంతాలు ప్రభుత్వ భూముల నుంచి మొరం తీసేందుకు ఎలాంటి అనుమతులు లేవు

- ఎవరైనా తీసి తరలిస్తే వాహనాలను జప్తు చేస్తాం
- అపరాధ రుసుమును వేస్తాం

జగిత్యాల సెప్టెంబర్ 30 (వుదయం ప్రతినిధి)

జగిత్యాల రూరల్ మండలం నర్సింగాపూర్ గ్రామ శివారులోని ప్రభుత్వ భూమిని మైనింగ్ ఏడి జైసింగ్ జగిత్యాల రూరల్ తహసీల్దార్ హకీమ్ రెవెన్యూ సిబ్బంది బుధవారం పరిశీలించారు అనంతరం రెండు చోట్ల కందకాలు తవ్వించి ఈ సందర్భంగా మైనింగ్ ఏడి జైసింగ్ మాట్లాడుతూ నర్సింగాపూర్ గ్రామ శివారు లోని సర్వే నంబరు 437 పరిసర ప్రాంతాలు ప్రభుత్వ భూముల నుంచి మొరం తీసేందుకు ఎలాంటి అనుమతులు లేవని ఎవరైనా తీసి తరలిస్తే వాహనాలను జప్తు చేస్తామని అపరాధ రుసుమును వేస్తామని హెచ్చరించారు అనంతరం ప్రభుత్వ భూమిలో హెచ్చరిక ఫ్లెక్సీ ఏర్పాటు చేశారు.

ప్రత్యక్ష పద్ధతిలోనే ప్రాథమిక సహకార సంఘ ఎన్నికలు చేపట్టాలి

పిఏసిఎస్ చైర్మన్ పత్తి రెడ్డి మహిపాల్ రెడ్డి

జగిత్యాల సెప్టెంబర్ 30 (వుదయం ప్రతినిధి)

రైతులతో నిత్యం సేవలను అందించే ప్రాథమిక సహకార సంఘాల ఎన్నికలను ప్రత్యక్ష పద్ధతిలోనే నిర్వహించాలని జగిత్యాల ప్రాథమిక సహకార సంఘం చైర్మన్ పత్తి రెడ్డి మహిపాల్ రెడ్డి డిమాండ్ చేశారు బుధవారం జగిత్యాల లోని సహకార సంఘ భవనంలో సర్వసభ్య సమావేశం నిర్వహించారు ఈ సందర్భంగా సంఘ అభివృద్ధి కై పాలకవర్గ నిర్ణయాల అనంతరం ప్రభుత్వం తెచ్చిన దొడ్డి దారి జీవో పై ఆందోళన వ్యక్తం చేశారు రాష్ట్ర ప్రభుత్వం పిఏసిఎస్ పాలక వర్గాలను ప్రత్యక్ష ఎన్నికల పద్ధతిలో కాకుండా నామీనేటెడ్ పద్ధతిలో నియమించాలనే ఆలోచనతో జీవో 432 ను తెచ్చిందన్నారు రాష్ట్ర ప్రభుత్వ ఆలోచనను తీవ్రంగా తప్పుపట్టిన మహిపాల్ రెడ్డి ప్రత్యక్ష ఎన్నికల్లో పోటీ చేసి గెలవలే కనే ఈ దొడ్డిదారి ప్రయత్నాలు అన్నారు ప్రజాస్వామ్య వ్యవస్థ లో ప్రత్యక్ష ఎన్నికల తోనే అన్ని వర్గాలకు న్యాయం జరుగుతుందని ప్రభుత్వం వెంటనే జీవో 432 ను రద్దు చేయాలని మహిపాల్ రెడ్డి డిమాండ్ చేశారు.

ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ని సన్మానించిన జువ్వాడి నర్సింగరావు

కోరుట్ల సెప్టెంబర్ 30 (వుదయం ప్రతినిధి)

ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి రాజన్న సిరిసిల్లా జిల్లా కేంద్రంలో ఏర్పాటు చేసిన వారు బహిరంగ సభలో పాల్గొనేందుకు విచ్చేసిన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని తెలంగాణ రాష్ట్ర వెలమ కార్పొరేషన్ చైర్మన్ కోరుట్ల నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జి జువ్వాడి నర్సింగరావు శాలువాతో సన్మానించారు.

సోషల్ మీడియా వినియోగంపై చట్టపరమైన అవగాహన

మంథని, సెప్టెంబర్ 30: వుదయం ప్రతినిధి

మంథని షెడ్యూల్డ్ తెగల బాలికల ఆశ్రమ జూనియర్ కళాశాలలో బుధవారం న్యాయ విజ్ఞాన సదస్సు నిర్వహించారు. ఇంటర్నెట్ యుగంలో సోషల్ మీడియాను బాధ్యతాయుతంగా వినియోగించాల్సిన అవసరంతో పాటు, దాని దుర్వినియోగం వల్ల ఎదురయ్యే చట్టపరమైన సమస్యలపై విద్యార్థినులకు అవగాహన కల్పించారు. సోషల్ మీడియా ద్వారా జరిగే మోసాలు, వేధింపులు, వ్యక్తిగత సమాచార దుర్వినియోగం తదితర అంశాలపై వివరించారు. అదనపు జూనియర్ సివిల్ జడ్జి శ్రీమతి ఆర సుధారాణి విద్యార్థినులకు పలు సూచనలు చేశారు. బార్ అసోసియేషన్ ఉపాధ్యక్షుడు కె. రఘోత్తం రెడ్డి, కళాశాల ప్రిన్సిపాల్ బి. వసుంధర, న్యాయవాది శశిభూషణ్ కాచే పాల్గొన్నారు.

భారీగా 109 కిలోల గంజాయి పట్టివేత

- భద్రాచలం ఎక్సైజ్ అధికారుల ముమ్మర తనిఖీలు
- ఇద్దరు అరెస్ట్
- కారు, బైక్, మూడు సెల్‌ఫోన్లు స్వాధీనం
- గంజాయి విలువ సుమారు రూ.30 లక్షలు

భద్రాచలం, 30/9/26 వుదయం ప్రతినిధి:

భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ఎక్సైజ్ అధికారులు గంజాయి అక్రమ రవాణాపై నిర్వహిస్తున్న ముమ్మర తనిఖీల్లో భారీగా గంజాయిని పట్టుకున్నారు. భద్రాచలం ఎక్సైజ్ పోలీస్ స్టేషన్ పరిధిలో బుధవారం నిర్వహించిన ప్రత్యేక వాహన తనిఖీల్లో మొత్తం 109 కిలోల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. ఈ ఘటనకు సంబంధించి ఇద్దరు నిందితులను అరెస్ట్ చేయడంతో పాటు గంజాయి తరలింపునకు ఉపయోగించిన ఒక హ్యుందాయ్ వెర్నా కారు, ఒక హీరో బైక్, మూడు మొబైల్ ఫోన్లను అధికారులు స్వాధీనం చేసుకున్నారు. స్వాధీనం చేసుకున్న గంజాయి విలువ సుమారు రూ.30 లక్షలు ఉంటుందని అధికారులు వెల్లడించారు. డిప్యూటీ కమిషనర్ సోమిరెడ్డి, కొత్తగూడెం ఎక్సైజ్ సూపరింటెండెంట్ ఎ. శ్రీనివాసరెడ్డి ఆదేశాల మేరకు, అసిస్టెంట్ ఎక్సైజ్ సూపరింటెండెంట్ ఎన్. శ్రీనివాసరావు ఆధ్వర్యంలో భద్రాచలం ఎక్సైజ్ ఎస్‌హెచ్‌ఓ సిబ్బంది, డీటీఎఫ్ కొత్తగూడెం బృందం సమన్వయంతో ఈ తనిఖీలు నిర్వహించారు. బుధవారం మధ్యాహ్నం సుమారు 12 గంటల సమయంలో భద్రాచలంలోని వీరభద్ర ఫంక్షన్ హాల్ వద్ద అనుమానాస్పదంగా వెళ్తున్న వాహనాలను అధికారులు క్షుణ్ణంగా తనిఖీ చేస్తుండగా ఈ భారీ గంజాయి రవాణా వ్యవహారం వెలుగులోకి వచ్చింది. తనిఖీల్లో భాగంగా ముందుగా హీరో బైక్ రిజిస్ట్రేషన్ నంబర్ OD-30H-1783ను అధికారులు ఆపి తనిఖీ చేశారు. బైక్‌లో అక్రమంగా తరలిస్తున్న 9 కిలోల గంజాయి బయటపడింది. దీంతో బైక్‌పై ఉన్న వ్యక్తిని అధికారులు అదుపులోకి తీసుకుని విచారించారు. అతడిని దివాకర్ మండల్, తండ్రి కృష్ణ మండల్, వయస్సు 22 సంవత్సరాలు, వృత్తి కూలీ, కలిమెల, మల్కానగిరి జిల్లా, ఒడిశా రాష్ట్రంగా గుర్తించారు. దివాకర్ మండల్‌ను అధికారులు విచారించగా గంజాయిని ఒడిశా రాష్ట్రంలోని మల్కానగిరి జిల్లా కలిమెల ప్రాంతం నుంచి మహారాష్ట్రలోని ముంబైకి తరలిస్తున్నట్లు తెలిపినట్లు అధికారులు వెల్లడించారు. ఈ క్రమంలో అతడిని విచారిస్తున్న సమయంలో అదే మార్గంలో వెనుక నుంచి వస్తున్న మరో వాహనంపై అధికారులకు అనుమానం కలిగింది. దీంతో ఆ వాహనాన్ని కూడా ఆపి క్షుణ్ణంగా తనిఖీ చేపట్టారు. హ్యుందాయ్ వెర్నా కారు రిజిస్ట్రేషన్ నంబర్ AP-10-AP-8269ను తనిఖీ చేయగా కారులో పెద్ద మొత్తంలో గంజాయి ఉన్నట్లు అధికారులు గుర్తించారు. కారులో అక్రమంగా తరలిస్తున్న 100 కిలోల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. కారులో ఉన్న వ్యక్తిని కూడా అధికారులు అదుపులోకి తీసుకుని విచారణ చేపట్టారు. అతడిని సుమన్ పాల్, తండ్రి పాపన్ పాల్, వయస్సు 22 సంవత్సరాలు, వృత్తి ఎలక్ట్రిషియన్, కలిమెల, మల్కానగిరి జిల్లా, ఒడిశా రాష్ట్రంగా గుర్తించారు.

ఈ రెండు వాహనాల్లో లభించిన గంజాయిని కలిపి మొత్తం 109 కిలోలు ఉన్నట్లు అధికారులు నిర్ధారించారు. స్వాధీనం చేసుకున్న గంజాయి విలువ సుమారు రూ.30 లక్షలు ఉంటుందని అధికారులు అంచనా వేశారు.గంజాయి రవాణాకు ఉపయోగించిన రెండు వాహనాలను సీజ్ చేసి, నిందితుల వద్ద ఉన్న మూడు మొబైల్ ఫోన్లను కూడా స్వాధీనం చేసుకున్నారు. మొబైల్ ఫోన్లలోని సమాచారం ఆధారంగా గంజాయి సరఫరా వ్యవహారంలో మరెవరైనా వ్యక్తులు ఉన్నారా అనే కోణంలో అధికారులు దర్యాప్తు చేస్తున్నారు. గంజాయి అక్రమ రవాణాకు సంబంధించి ఇద్దరు నిందితులను అరెస్ట్ చేసి కేసు నమోదు చేసినట్లు ఎక్సైజ్ అధికారులు తెలిపారు. గంజాయి ఎక్కడి నుంచి సేకరించారు, ఎవరికి అందజేయడానికి తరలిస్తున్నారు, ఈ వ్యవహారంలో ప్రధాన సూత్రధారులు ఎవరైనా ఉన్నారా, నిందితులకు సహకరిస్తున్న ఇతర వ్యక్తులు ఉన్నారా అనే అంశాలపై దర్యాప్తు కొనసాగుతోంది. నిందితుల నుంచి మరిన్ని వివరాలు సేకరించిన అనంతరం గంజాయి అక్రమ రవాణా వెనుక ఉన్న నెట్‌వర్క్‌పై కూడా చర్యలు తీసుకునే అవకాశం ఉందని అధికారులు తెలిపారు. ఈ కేసులో ఎన్. శ్రీనివాస రావు, అసిస్టెంట్ ఎక్సైజ్ సూపరింటెండెంట్, కొత్తగూడెం; రామాదేవి, ఇన్‌స్పెక్టర్, డీటీఎఫ్ కొత్తగూడెం; కిస్తయ్య, ఇన్‌స్పెక్టర్, ఎస్‌హెచ్‌ఓ భద్రాచలం; సలీంఉల్లా ఖాన్, పీఈఎస్ఐ, డీటీఎఫ్ కొత్తగూడెం; అల్లూరి రాజా సీతారామరాజు, సబ్ ఇన్‌స్పెక్టర్, భద్రాచలం స్టేషన్‌తో పాటు ఎక్సైజ్ సిబ్బంది కరీం, మౌలాంకర్, వీరబాబు, శ్రీనివాస్, నర్సింహారావు, రమేష్, పార్థసారధి, విల్సన్, సీతారాం, వీరభద్రరావు, రాకేష్, కిరణ్, ప్రసన్నకుమార్ తదితరులు పాల్గొన్నారు.కేసు దర్యాప్తు పూర్తయిన అనంతరం గంజాయి రవాణా మార్గం, సరఫరాదారులు, కొనుగోలుదారులు, ఇతర సంబంధిత వ్యక్తుల వివరాలు వెలుగులోకి వచ్చే అవకాశం ఉందని అధికారులు తెలిపారు.

కల్తీ వస్తువులను నివారించాలి

జిల్లా కలెక్టర్ కె.హరిత

ఆసిఫాబాద్ (వుదయం ప్రతినిధి):

జిల్లాలోని హోటళ్ళు, బేకరీలు, గురుకుల పాఠశాలలు, వసతి గృహాలలో తయారుచేసే ఆహారంలో కల్తీ వస్తువులను వినియోగించే వారిని గుర్తించి చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ కె.హరిత అన్నారు. బుధవారం జిల్లా కేంద్రంలోని సమీకృత జిల్లా కలెక్టరేట్ భవన సమావేశ మందిరంలో ఏర్పాటుచేసిన జిల్లా స్థాయి ఆహార భద్రత సలహా కమిటీ సమావేశానికి జిల్లా అదనపు కలెక్టర్ (రెవెన్యూ) ఎం.డేవిడ్ తో కలిసి హాజరై సంబంధిత శాఖల అధికారులతో సమీ